
నేడు జడ్పీ సమావేశం

● వివిధ శాఖల పనితీరుపై చర్చ

నెల్లూరు (జడ్పీ), మే 3: జిల్లా పరిషత్ (జడ్పీ) సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు సీఈవో కన్నమనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్రామీణ నీటిసరఫరా, పారిశుధ్యం, గృహనిర్మాణ శాఖ, వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, నీటిపారుదల శాఖలపై సమావేశంలో చర్చిస్తామని, కావున సభ్యులంతా హాజరు కావాలని తెలిపారు.

పౌరుషాల పురిటిగడ్డ.. రాజకీయ చైతన్యం కలిగిన సింహపురిలో తెలుగుదేశం, జనసేన పార్టీల అధినేతలు నారా చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌లకు అపూర్వ స్వాగతం లభించింది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నెల్లూరుకు వచ్చిన తమ ప్రియతమ నేతలను చూసేందుకు పెల్లుబుకిన అభిమానం కట్టలు తెంచుకుంది. అడుగడుగునా బ్రహ్మరథం పట్టి.. మేళతాళాలు, కేరింతలతో తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు సందడి చేశారు. రోడ్‌షోలో యువత బైక్‌పై చక్కర్లు కొట్టింది.





సింహగర్జన



ఓ పక్క బాణసంచా పేలుళ్లు.. మరో పక్క అభిమానుల మధ్య నెల్లూరులో ఉత్సాహంగా సాగిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల రోడ్‌షో

అనుభవంతో వస్తున్నాం.. ఆదరించండి!

● జనసేనాని పవన్ కల్యాణ్

'కష్టాలు వచ్చినప్పుడు పెన్నా నది పారిపోతుందా!? మరి విధ్వంసకర జగన్‌ను చూసి మనం పారిపోతామా!? పెన్నమ్మ స్ఫూర్తితో మన హక్కులను మనం కాపడుకుందాం. ఎవరి ముందూ తలవంచేది కాదు సింహపురి గడ్డ' అని జనసేన అధినేత కొణిదెల పవన్‌కల్యాణ్ వ్యాఖ్యానించారు. నెల్లూరులోని నర్తకి సెంటర్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. నెల్లూరులో ఇంత ఘనస్వాగతం కలలో కూడా ఊహించలేదని పవన్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆడబిడ్డలు కూడా రోడ్డు మీదకు వచ్చారంటేనే యువత మార్పు కోరుకుంటున్నట్లు అర్థమవుతోందన్నారు. యువతకు అండగా, ప్రజలకు బంగారు బాట వేయడానికి కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడబోతోందని చెప్పారు. తాను రాజకీయ పార్టీ పెట్టడానికి ప్రధాన కారణం నెల్లూరులో పెరగడమేనని అన్నారు. సెయింట్ జోసెఫ్ స్కూల్, వీఆర్ కాలేజీలో జ్ఞానాన్ని నేర్చుకోవడమే కాక పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తితో పెరిగానని చెప్పారు. నెల్లూరుకు రాగానే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయని అన్నారు. మూలాపేట, రంగనాయకుల పేటలో తిరిగానని పవన్ చెప్పారు. తనకు, చంద్రబాబుకు, మోదీకు ఏం తక్కువని, కానీ ప్రజల కోసం మేమంతా కలిసి వస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి అనుభవకరమైన పాలన చాలా అవసరమని చెప్పారు. అనుభవం కలిగిన కూటమితో ముందుకొస్తున్నామని ప్రజలంతా ఆదరించాలని కోరారు. నాడు విజన్ 2020 అని చంద్రబాబు అంటే ఎప్పుడు 2020 సంవత్సరం వస్తుందా.. అని చూశామని, ఇప్పుడు హైదరాబాద్ ఎటువంటి ఫలితాలను ఇస్తోందో చూస్తున్నామని చెప్పారు. అయితే జగన్‌కు ఒక విజన్ అంటూ ఏమీ లేదని, కేవలం ఎన్నికల కోసమే ఆలోచిస్తారని అన్నారు. ఇప్పుడు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా విజన్ 2047తో ముందుకొస్తున్నామని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తీసుకునే నిర్ణయం రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ధేశిస్తుందని వ్యాఖ్యానించారు. 'మీ ప్రాణాలకు నా ప్రాణాలు అడ్డు వేస్తా.. అవినీతి కోటలు బద్ధలు కొడదాం..' అంటూ పవన్ ప్రజలకు పిలుపునిచ్చారు. రాజకీయాల్లో సేవ చేయడానికి వచ్చిన మంచి వ్యక్తులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు అని, వారిని గెలిపించాలని కోరారు.



అభిమాన నేతలపై పూలవర్షం కురిపిస్తూ..

● చంద్రబాబుకు ప్రజల జేజేలు ● యువత గుండెల్లో పవనిజం..

● వేలాదిగా తరలివచ్చిన యువత ● రోడ్‌షోలో అభిమానుల కేరింతలు

సాయంత్రం 6 గంటలకు నెల్లూరుకు చేరుకున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు నేతలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి కేవీఆర్ పెట్రోల్ బంక్ కూడలికి 7 గంటలకు చేరుకున్న నేతలకు యువత, మహిళలు, అభిమానులు కేరింతలతో ఘనంగా స్వాగతించారు. రోడ్‌షోలో నేతలను చేసేందుకు, వారికి జేజేలు పలికేందుకు పోటీపడ్డారు. ఒక దశలో తోపులాటలు కూడా జరిగాయి. అయితే పార్టీ నేతలు ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడంతో తరలి వచ్చిన యువత, ప్రజలంతా కూడా కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి ఫత్తేఖాన్‌పేట, ఆర్టీసీ బస్టాండ్, మద్రాస్‌బస్టాండ్, వీఆర్‌సీ సెంటర్, గాంధీబొమ్మ, కనకమహల్ సెంటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా కిక్కిరిసిపోయారు. ఎక్కడివారు అక్కడ తమకు నచ్చిన ప్రాంతంలోనే పడిగాపులు కాశారు. నగరమంతా ఫ్లెక్సీలు, జెండాలతో నిండిపోయింది.

● అభిమానులకు చేరువయ్యే ప్రయత్నం

రోడ్‌షోలో చంద్రబాబు, పవన్‌లను అభిమానులు ప్రతిచోటా ఉక్కిరిబిక్కిరి చేశారు. చంద్రబాబు జిందాబాద్, పవన్ జిందాబాద్, జై తెలుగుదేశం, జై జనసేన అంటూ నినాదాలు చేస్తూ వారి వాహనం వెంటే తమ బైక్‌లో కేరింతలు కొడుతూ ఆత్మీయంగా ఆహ్వానం పలికారు. తమకు అడుగడుగునా లభించిన స్పందనతో అధినేతలిద్దరూ ఉబ్బితబ్బిబయ్యారు. అభిమానులు కోసం ఓపెన్ టాప్ వాహనంపై నిలబడి వారిని మరింత ఉత్సాహపరిచారు. రోడ్‌షో విజయవంతం చేయడంలో టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (నెల్లూరు ఎంపీ), పొంగూరు నారాయణ (నెల్లూరు సిటీ), కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (నెల్లూరు రూరల్), టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌లు కృషి చేశారు.

\- నెల్లూరు (విద్య)



టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి, నారాయణ, కోటంరెడ్డిలతో కలిసి అభివాదం చేస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్

నెల్లూరులో శుక్రవారం రాత్రి జరిగిన సభలో పాల్గొన్న టీడీపీ, జనసేన నాయకులు, అభిమానులు



సింహపురి తిరగబడింది..

వార్ వన్‌సైడ్ అయ్యింది!

● ఎన్నికల ప్రచార సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

'ఇంతటి ఆదరణ, ఆప్యాయత ఎప్పుడూ చూడలేదు. సింహపురి తిరగబడింది. ఎన్నికల్లో వార్ వన్ సైడ్ అయ్యింది. ప్రజల ఉత్సాహం చూస్తుంటే సింహపురిలో ఏం జరుగుతోందని వైసీపీలో వణుకు మొదలైంది. ముస్లిం ఆడబిడ్డలు రోడ్లపైకి వచ్చి సంఘీబావం తెలపడం మర్చిపోలేనిది. మీ భవిష్యత్ కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కలిశాయి. మీ బిడ్డల భవిష్యత్‌కు మాదీ గ్యారెంటీ. నెల్లూరుకు పూర్వవైభవం తీసుకొస్తాం. జిల్లాను హార్డ్‌వేర్ హబ్‌గా మారుస్తాం' అని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. నగరంలోని నర్తకీ సెంటర్లో జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడారు. నెల్లూరు-తిరుపతి-చెన్నైలను ట్రైసిటీగా కనెక్ట్ చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఇక్కడ నుంచే ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతులు, దిగుమతులు చేసుకునేలా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రాగానే దగదర్తి ఎయిర్‌పోర్టును నిర్మించి జిల్లావాసుల కల నెరవేరుస్తామని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే నెల్లూరులో తాము కట్టిన ఇళ్లన్నీ పూర్తి చేసి పేదలకు అందించడంతోపాటు నెల్లూరులో పేదలకు స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని స్పష్టం చేశారు. తాము యూజీడీ, డ్రింకింగ్ వాటర్ స్కీమ్, పార్కుల అభివృద్ధి, బారాషాహీద్ దర్గా అభివృద్ధి, నెక్లెస్ రోడ్డు నిర్మాణం, గోషా ఆసుపత్రి, షాదీ మంజిల్ నిర్మాణం, మటన్, చేపల మార్కెట్ల నిర్మాణం, ఏసీ బస్ షెల్టర్ల ఏర్పాటు, బీసీ భవన్, కాపు భవన్, అంబేద్కర్ వంటి అనేక పనులు చేపట్టామని, కానీ వైసీపీ ఐదేళ్ల పాలనలో రూపాయి అభివృద్ధి అయినా చేశారా అని ప్రశ్నించారు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి ట్యూషన్‌తో ప్రారంభించిన పొంగూరు నారాయణ జీవితం నేడు ఒక బ్రాండ్‌గా మారిందని కొనియాడారు. వ్యాపారాల్లో విజయవంతమైన వ్యక్తి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అని, పుట్టిన గడ్డకు సేవ చేయాలన్న లక్ష్యంతో ఆయన రాజకీయాల్లో వచ్చారని చెప్పారు. జగన్ అరాచకాలను చూసి రాష్ట్రం నాశనం అయిపోతోందని తిరగబడిన వ్యక్తి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని ప్రశంసించారు. ఎన్ని కేసులు పెట్టినా వీరెవరూ లెక్క చేయలేదన్నారు. ప్రజల కోసం వీరు నిలబడ్డారని, రానున్న ఎన్నికల్లో వీరు ముగ్గురిని గెలిపించాలని చంద్రబాబు అభ్యర్థించారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	113224	115729	26	228979
కావలి	117152	121465	28	238645
ఆత్మకూరు	105873	109579	8	215460
కోవూరు	129004	138374	25	267403
నెల్లూరు సిటీ	116764	122713	67	239544
నెల్లూరు రూరల్	136691	144237	20	280948
సర్వేపల్లి	112812	119196	26	232034
ఉదయగిరి	120108	121743	10	241861
మొత్తం	951628	993036	210	1944874

నారీమణులే ఎక్కువ!

● జిల్లాలో ఓటర్లు 19,44,874 మంది

● పురుషులు 9,51,628.. స్త్రీలు 9,93,036

నెల్లూరు (హరనాథపురం), మే 3: జిల్లాలో తుది ఓటర్ల జాబితా వెల్లడైంది. మొత్తం ఓటర్లు 19,44,874 మంది ఉండగా, వీరిలో పురుషులు 9,51,628 మంది, స్త్రీలు 9,93,036 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళ ఓటర్లే 41,408 మంది అధికంగా ఉన్నారు. ఇక సర్వీసు ఓటర్లు 589 మంది ఉన్నారు. వీరంతా ఈనెల 13న తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాగా, అభ్యర్థుల గెలుపోటములపై నారీమణుల ఓట్లే కీలకంగా మారనున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మహిళలే ఎక్కువ మంది ఓటరుగా నమోదై ఉన్నారు. దీంతో వారిని ప్రసన్నం చేసుకుంటే గెలుపు సులువు అవుతుందన్న ఉద్దేశంతో అభ్యర్థులు ఉన్నారు.



ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడు

హోం ఓటింగ్ ప్రారంభం

నెల్లూరు (హరనాథపురం) : భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు ఇంటివద్దనే ఓటు హక్కు కల్పించే ప్రక్రియ జిల్లాలో శుక్రవారం ప్రారంభమైంది. కావలి, నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కందుకూరు, సర్వేపల్లి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో హోం ఓటింగ్ ప్రక్రియ మొదలైంది. కోవూరు మండలంలోని పోతిరెడ్డిపాలెం గ్రామంలో అనారోగ్యంతో మంచంపై ఉన్న వృద్ధుడి ఇంటి వద్దకు వెళ్లి ఓటు స్వీకరించారు. డీఆర్వో లవన్న, రెవెన్యూ అధికారుల సమక్షంలో ఓటు సేకరించారు. కావలి ఆర్డీఓ శీనానాయక్, కందుకూరులో సబ్ కలెక్టర్ విద్యాధరి సమక్షంలో వృద్ధుల నుంచి ఓటు హక్కు సేకరించారు. జిల్లాలో ఇంటి వద్దనే ఓటు వేసేందుకు అంగీకరించిన మొత్తం 1712 మంది దివ్యాంగులు, వయోవృద్ధుల నుంచి 5వ తేదీ వరకు ఓట్లు సేకించనున్నారు.

ఆత్మకూరు ఉదయగిరి

శిక్షణ తరగతుల పరిశీలన

● వీవీఎంల పనితీరుపై ఆరా తీసిన అసిస్టెంట్ కలెక్టర్

ఉదయగిరి రూరల్, మే 3: స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పీవో, ఏపీవోలకు జరుగుతున్న శిక్షణ తరగతులను శుక్రవారం అసిస్టెంట్ కలెక్టర్ సంజనాసిన్హా పరిశీలించారు. అనంతరం స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో జరుగుతున్న వీవీఎంల కమీషనింగ్ కార్యక్రమాన్ని పరిశీలించడంతో పాటు ఆర్వో కార్యాలయాన్ని సందర్శించి అధికారులకు సలహాలు, సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్వో రాజారమేష్ ప్రేమ్ కుమార్, ఏఆర్వో నెహ్రూబాబు పాల్గొన్నారు.

రేపు ముస్లింల ఆత్మీయ సమావేశం

ఆత్మకూరు, మే 3: పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో ఆదివారం ఉదయం 10గంటలకు నియోజకవర్గస్థాయి ముస్లిం మైనార్టీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ కార్యాలయం నుంచి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, శాసనమండలి సభ్యులు ఇక్బాల్, రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు పాల్గొంటారన్నారు.

41 మంది వలంటీర్ల రాజీనామా

కలువాయి, మే 3: పోలింగ్‌కు రోజులు దగ్గర పడేకొద్దీ వలంటీర్ల రాజీనామాలు పెరుగుతున్నాయి. మండలంలో ఇప్పటివరకు 84మంది రాజీనామాలు చేయగా, శుక్రవారం 41 మంది చేశారు. దీంతో మొత్తం రాజీనామాల సంఖ్య 125మందికి చేరుకుంది. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో రాజీనామాలు కొనసాగుతున్నాయి.

రూ.1.69 లక్షల పట్టివేత

సంగ, మే 3: స్థానిక ఆనకట్ట వద్ద శుక్రవారం ఎస్ఐ నాగార్జునరెడ్డి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆల్విన్ వాహనంలో వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద రూ.1.69 లక్షలు నగదు ఉండటాన్ని పోలీసులు గుర్తించి నగదును సీజ్ చేశారు. బాధితుడు జీవాలను గూడూరులో విక్రయించి నగదుతో వస్తున్నట్లు తెలిపారు. అయితే సంబంధించిన ఆధారాలు చూపించలేదని ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

పార్టీలకతీతంగా గెలిపించాలి



సమావేశంలో పాల్గొన్న మాజీ ఐఏఎస్ సుజాతరావు

వింజమూరు, మే 3: సమాజ సేవకు పాటుపడే నాయకులను పార్టీలకతీతంగా గెలిపించుకోవాలని మాజీ ఐఏఎస్ ఆఫీసర్ సుజాతరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన రాయల్ ఫంక్షన్ ప్లాజాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పోలు రాజు హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎంతో దూరదృష్టితో ప్రజల కోసం పని చేసిన ఐఏఎస్ ఆఫీసర్‌లలో రాజు ఒకరని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో ఆమె వెంట మాజీ ఐఏఎస్‌లు పీవీ రమేష్, బీఎస్ఎన్ మూర్తి, సిద్దజీరావు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఉదయగిరి రూరల్, మే 3: గండిపాళెంకు చెందిన మాజీ సొసైటీ అధ్యక్షుడు ఉబ్బరపు సుబ్బరాయుడు అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్నలు శుక్రవారం మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బరాయుడు మృతి పార్టీకి తీరనిలోటని, వారి కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు.

వైసీపీ నాయకుల కనుసన్నల్లో హోం ఓటింగ్

సంగం : హోం ఓటింగ్ అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో జరుగుతుండగా, టీడీపీ నాయకుడు అడ్డుకోవడంతో గుట్టురట్టయ్యింది. కోలగట్లలోని 7ఓట్లు హోం ఓటింగ్ నిర్వహించేందుకు పోస్టల్ బ్యాలెట్లతో అధికారుల బృందం గ్రామానికి వెళ్లింది. వారివెంట ఇద్దరు వైసీపీ నాయకులు ఉన్నట్లు సమాచారం. వారిద్దరు ముందుగా హోం ఓటింగ్ ఉన్న ఇంట్లోకి వెళ్లారు. తరువాత అధికారులు అక్కడకు వెళ్లి నాయకుడు సమక్షంలోనే హోం ఓటింగ్ నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. ఓటు వేసిన తరువాత ఆ నాయకుడు అధికారుల సమక్షంలోనే ఫొటో కూడా తీసినట్టు తెలుస్తోంది. గొల్ల వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లగానే గ్రామానికి చెందిన టీ డీపీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి సమాచారం తెలియగానే అక్కడకు చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లడానికి ప్రయత్నించగా కానిస్టేబుల్ అడ్డుకున్నాడు. ఫొటో తీస్తుండగా వైసీపీ నాయకుడు మొబైల్ లాక్కొని పరారయ్యాడు. జరిగిన సంఘటన బయటకు తెలిస్తే తమ ఉద్యోగాలు పోతాయని శ్రీధ ర్‌రెడ్డితో అధికారుల బృందం సర్దుబాటు చేసుకున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ఎన్నికల అధికారులు సమగ్ర విచారణ జరపాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



సంగం : కోలగట్లలో హోం ఓటింగ్ వేయిస్తున్న అధికారులు

జగన్ పాలనలో అంతా దోపిడీయే..

చేజర్ల: ఎన్‌వి.కండ్రిక, ఆదురుపల్లి, కొలపనాయుడుపల్లి, నెర్నూరు మడపల్లి గ్రామాల్లో ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగన్ పాలనలో రాష్ట్రమంతా ఇసుక, మద్యం, గంజాయి పేరుతో దోచు కుంటుంటే మండలంలోని కొంతమంది నాయకులు తామేమి తీసిపోమంటూ తెల్లరాయి అక్రమ వ్యాపారంతో సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దక్షిణ కాలువ నీటిని వదలకుండా అడ్డుకంటే తాను అధికారులలో మా ట్లాడి నీరు వచ్చేలా ఏర్పాటు చేశానన్నారు. స్వార్థం కోసం నీటి సరఫరా అడ్డుకున్నట్లు తెలిపారు. మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, గిరినాయుడు పాల్గొన్నారు.

ఆత్మకూరు: కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆనం రామనారాయణరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను పట్టణ ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆనం కుమార్తె ఆనం కైవల్యారెడ్డి కోరారు. మున్సిపాలిటీలోని పేరారెడ్డిపల్లి, బీసీ కాలనీలో ఆమె ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. సూపర్‌సిక్స్



ఆదురుపల్లి మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి ఆనం



ఆత్మకూరు ప్రచారంలో ఆనం కైవల్యారెడ్డి

పథకాలు, ఉమ్మడి మెనిఫె స్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె వెంట టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, శ్రీనివాసులనాయుడు పాల్గొన్నారు.

అనంతసాగరం: తెలుగుదేశం గెలుపుతేనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత తెలిపారు. అనంతసాగరం ఎస్సీ, ఎస్టీ కాలనీ, గుంతబజార్‌లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతినాయుడు, చల్లా శివారెడ్డి, ప్రతీప్‌నాయుడు, కిరణ్ పాల్గొన్నారు. అనంతరం శంకరనగరంలో తెలుగు యువత నాయకులు కమ్మ ప్రభాకర్ నాయుడు, ప్రవీణ్ ప్రచారం చేపట్టారు.

ఏఎస్ పేట: కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి, ఆనంలను భారీ మెజార్టీతో గెలిపించాలని జమ్మవరంలో టీడీపీ, బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు, హజరత్, వెంకటేశ్వర్లు, కాలం బుజ్జిరెడ్డి, మండల అధ్యక్షుడు చెంచురెడ్డి పాల్గొన్నారు.

'ఫ్రై'డే!

నిప్పుల గుండంగా జిల్లా

మెట్టలో 47 డిగ్రీలకు ఉష్ణోగ్రత

ఆత్మకూరు/నెల్లూరు (హరనాథపురం), మే 3 : మెట్టప్రాంతం నిప్పులగుండంలా మారుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతోపాటు వడగాల్పులు వీస్తున్నాయి. ఉదయం నుంచే ఎండలు మండుతుండటంతో చిన్నారులు, వృద్ధులు తట్టుకోలేకపోతున్నారు. ఆత్మకూరులో శుక్రవారం ఉష్ణోగ్రత 47 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. ఇక ఉదయగిరిలో 45, నెల్లూరు నగరంలో 43.5, కావలిలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఈ ఉష్ణోగ్రత మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఉదయం 9 గంటలకే ఇళ్ల నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వేసవితాపం తీర్చుకునేందుకు చల్లటిపానీయాలతోపాటు కరపుచ్చ, కిరిణికాయలు పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఎండలు మండేకొద్ది వీటి ధరలు కూడా అదే రీతిలో పలుకుతున్నాయి. యువకులు వేసవితాపం తీర్చుకునేందుకు చెరువులు, కుంటల్లోకి ఈతకు వెళుతూ ఉపశమనం పొందుతున్నారు. ఉష్ణోగ్రత తీవ్రత మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ పేర్కొంది.

● ఎన్నికల ప్రచారంపై ప్రభావం :



ఈ నెల 13న పోలింగ్ జరగనుండటంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. అయితే, భగ్గుమంటున్న భానుడి ప్రతాపంతో వారితోపాటు నాయకులు, కార్యకర్తలు తల్లడిల్లిపోతున్నారు. ఎండ వేడిమి భరించలేక ఉదయం, సాయంత్రం వేళ్లలోనే ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పగటిపూట సమావేశాలు నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఎల్‌నినో బలహీన పడినా ఇంకా దాని ప్రభావం, పసిఫిక్ మహాసముద్రం నుంచి వస్తున్న వేడిగాలులు భారత ఉప ఖండంలో మరింత వేడిని పెంచుతున్నాయి. ఈ ప్రభావం జిల్లాపై ఎక్కువగా ఉంది.

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం) : వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా కార్మికులు, ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కార్మికులు, ఉద్యోగులకు ఎండ తీవ్రతను బట్టి పనివేళలు నిర్ణయించాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థ సూచించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలంతా అత్యవసరమైతేనే ఇంట్లో నుంచి బయటకు రావాలని సూచించారు.

● అప్రకటిత కోతలు

బుచ్చిరెడ్డిపాళెం : అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. బుచ్చిలో పగలు, రాత్రి తేడా లేకుండా కొన్నిరోజులుగా ఇష్టానుసారం కరెంటు తీసేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసులు మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలకుతోడు ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరగడంతో ఓవర్‌లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవుతున్నట్లు చెప్పారు. లోడు హెచ్చు, తగ్గులతో పెద్దలైన్ కూడా తెగిందన్నారు. దీంతో శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్‌లకు ట్యాంకర్‌తో నీరు పట్టినట్లు తెలిపారు.

పోలింగ్ బూత్‌ల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడండి : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ): ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల్లో విద్యుత్ అంతరాయం లేకుండా, ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను విద్యుత్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబర్ నుంచి జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్‌బూత్‌ల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి, చిన్న అంతరాయం కూడా లేకుండా ముందస్తుగా 33కేవీ, 11కేవీ ఫీడర్లను పెట్రోలింగ్ చేసుకో వాలన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఎక్కువగా డిజి టల్ చెల్లింపులు చేసేలా చైతన్యపరచాలని కోరారు. ఈఈ శేషాద్రి బాలచందర్ పాల్గొన్నారు.

మామిడి పండ్ల దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

● అత్త మృతి, కోడలికి తీవ్రగాయాలు

● ఆ కుటుంబాన్ని వెంటాడుతోన్న మృత్యువు



లారీ దూసుకుపోవడంతో ధ్వంసమైన మామిడి కాయల దుకాణం

ఉలవపాడు, మే 3 : రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని వెంటాడుతోంది. గత మామిడి పండ్ల సీజన్‌లో అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటి అల్లుడు మృతి చెందగా ఈ ఏడాది అదే సీజన్‌లో అత్త అదే రోడ్డు ప్రమాదానికి బలైయింది. దీంతో ఆ కుటుంబానికి పెద్ద దిక్కులేకుండా పోయింది. వివరాల మేరకు.. మామిడి సీజన్‌లో ఉలవపాడు సమీపంలోని జాతీయ రహదారికి ఇరువైపుల మామిడి పండ్ల దుకాణాలు వెలుస్తుంటాయి. ఈ క్రమంలో ఉలవపాడు ఎస్సీ కాలనీకి చెందిన ధన్యాసి కొండమ్మ(50) కుటుంబం గత 20 ఏళ్లుగా సీజనల్ వృత్తిగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. హైవేపై అనుకొని ఎప్పటికైనా ప్రమాదమని తెలిసి కూడా గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన వారు అంగళ్లు వేసుకొని రోడ్డుపై మామిడి పండ్ల వ్యాపారం చేసుకోవడం పరిపాటి. కొండమ్మ మామిడి పండ్ల దుకాణం ఒక వరుసలో చివరిది. ఈ క్రమంలో శుక్రవారం న్యూజివీడు నుంచి బెంగళూరుకు మామిడికాయల లోడుతో వెళుతున్న మినీ లారీ అదుపు తప్పి కొండమ్మ మామిడి పండ్ల దుకాణంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో కొండమ్మతోపాటు కోడలు ధన్యాసి వినీత కూడా ఉన్నారు. షాపులో కూర్చొని ఉన్న కొండమ్మ మీదకు లారీ దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకొని బయటపడే క్రమంలో కోడలు వినీతకు తీవ్ర గాయాలయ్యాయి. గత ఏడాది ఇదే సీజన్‌లో కొండమ్మ కుమార్తె భర్త గంగాధర్ కూడా అర్ధరాత్రి మామిడికాయల దుకాణం వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాదం జరిగిన లైన్‌లో సుమారు 15 మామిడి షాపులు ఉంటాయి. మృతురాలు షాపు చివరిది కావడంతో లారీ దూసుకెళ్లినా తరువాత షాపులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ ప్రమాదం షాపుల మధ్యలో జరిగి ఉంటే ఊహించుకోవడానికే భయంకరంగా ఉండేదని ఎస్సీ కాలనీవాసులు ఆందోళచెందారు. కొండమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఎస్సై బాజీరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన దుకాణం యజమానురాలు ధన్యాసి కొండమ్మ

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

వెంకటాచలం, మే 3 : రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన వెంకటాచలం రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. సుమారు 55 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి డౌన్ లైన్ రైల్వే ట్రాక్‌పై వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు వైట్ కలర్ ఫుల్ హాండ్స్ చొక్కా, బ్రౌన్ కలర్ కాటన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం, మే 3 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల్లో 459 మంది, మధ్యాహ్నం జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 223 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కాగా, ఉదయం జరిగిన పరీక్షల్లో కావలిలోని జవహర్‌భారతీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, మధ్యాహ్నం వెంకటగిరిలోని ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, కావలిలోని జవహర్ భారతీ డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం నలుగురు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	143
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6779
వెండి కిలో ధర	రూ. 82,500
వెండి ఒక గ్రాము	రూ. 84.50

టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయి

● ఉదయగిరి ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, మే 3: ప్రజల కష్టాలు తీరడంతో పాటు రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం అధికారంలోకి రావాలని ఉదయగిరి ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ తెలిపారు. శుక్రవారం ఉదయగిరిలోని పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఇంటింటికి వెళ్లి పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబునాయుడు అని, మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుంటే అన్నిసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం టీడీపీ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే రంజాన్‌తోఫా, దుల్హాన్ వంటి పథకాలను రద్దు చేసిందన్నారు. ఐదేళ్ల జగన్ నిరంకుశపాలనకు తెరదించి ఇంటికి పంపే సమయం వచ్చిందన్నారు. రాష్ట్రంలో వైసీపీ మద్యం, శాండ్, మైనింగ్, డ్రగ్స్ మాఫీ యాగా ఏర్పడి కోట్ల రూపాయలకు పడగలెత్తి ప్రజలను బిక్షగాళ్లను చేశారన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిలో దెబ్బతిన్న రోడ్లను నిర్మించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చి సుందరంగా తీర్చిదిద్దుతానన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. ఉదయగిరి దుర్గాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు నియోజకవర్గాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చి యువతకు ఉపాధి కల్పించి వలసలు నివారిస్తామన్నారు. సాగు, తాగునీటి కష్టాలు తీర్చి మెట్ట ప్రాంతాన్ని డెల్టాగా మార్చడమే తన ధ్యేయమన్నారు. ప్రతి 50గడపలకు ఓ శుద్ధిజల కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా తాగునీరు అందజేస్తానని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అధికా రంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. మహిళలు ఆర్థిక చైతన్యం సాధించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. టీడీపీ శ్రేణులను బెదిరించినా, దాడులు చేసినా చూస్తూ ఊరుకోబోమన్నారు. అనంతరం ఆర్యవైశ్యు లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే వారికి సముచితస్థానం కల్పిస్తామ ని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో తనతో పాటు నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయి తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందన్నారు.

టీడీపీలో చేరిన పబ్బులేటిపల్లి గ్రామస్థులు

పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీ, సీతారామపురం మండలం పబ్బులేటిపల్లి గ్రామానికి చెందిన వైసీపీ సానుభూతిపరులు టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. ఈ సందర్భంగా వారికి కాకర్ల సురేష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మె ల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు చెంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహ, సందానీ, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొండాపురం: చింతలదీవి గ్రామానికి చెందిన 100కుటుంబాలు శుక్రవారం వింజమూరులోని కాకర్ల సురేష్ క్యాంపు కార్యాలయంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కాకర్ల పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ ఓరుగంటి కొండయ్య, గుడవళ్లూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు గోరంట్ల నరసింహారావు, గోరంట్ల మాలకొండయ్యలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అనంతరం పార్లపల్లిలో టీడీపీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీకి చెందిన 80 కుటుంబాలు టీడీపీలో చేరారు. పరిశీలకుడు కే.సుబ్బారావు, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి సీహెచ్. వెంకటాద్రి, మాజీ జెడ్పీటీసీ దామా మహేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.



ఉదయగిరి రూరల్: పార్టీలో చేరిన వారితో కాకర్ల, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి, కంభం

టీడీపీ మేనిఫెస్టోలో మహిళలకు పెద్దపీట

సీతారామపురం: అయ్యవారిపల్లి, దేవిశెట్టిపల్లి గ్రామాల్లో శుక్రవారం మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కలివెల జ్యోతి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలివెల జ్యోతి మాట్లాడారు. తల్లికి వందనం పథకం కింద విద్యార్థులకు ఏటా రూ.15 వేలు, దీపం పథకం కింద ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, 18నుండి 59 సంవత్సరాల వయస్సున్న మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేస్తామన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేస్తామన్నారు. అలాగే వృద్ధాప్య పెన్షన్ రూ.3వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామన్నారు. శాసనసభ అభ్యర్థి కాకర్ల సురేష్, పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు, సూపర్ సిక్సర్ క్యాలెండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ కప్పా ప్రభకర్ రాజు, మం డల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, సీతారామపురం సర్పంచ్ భాగ్యకుమారి, నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడు తురక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

వింజమూరు: రావిపాడులో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జ్ దంతులూరు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గురజాల వెంకటరమణయ్య, ఎన్ఆర్ఐ గురజాల ప్రసాద్‌లు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచిపెట్టారు. ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. పురిటిగడ్డ రుణం తీర్చుకునేందుకు కాకర్ల సురేష్ వచ్చారని, ప్రజాసేవకే ఆయన జీవితం అంకితం చేస్తారని అలాంటి నాయకులు దొరకడం మన అదృష్టం అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు సేవ చేస్తున్నారని ఆయన్ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనదే అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: విరువూరులో శుక్రవారం రాత్రి టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ సతీమణి కాకర్ల ప్రవీణ ఇంటింటా ప్రచారం చేపట్టారు. తన భర్తతోపాటు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కరప్రతాలను పంపిణీ చేస్తూ ప్రచారం ముందుకు సాగారు. ఏళ్ల తర బడి వెనుకబడిన ఈ ప్రాంత ప్రజలు, యువతకు ఉద్యోగ, ఉపాధి, వి ద్యా, వైద్య సదుపాయాలు కలగాలంటే టీడీపీకే సాధ్యమన్నారు. అన్ని వర్గాలకు లబ్ధిచేకూరేలా టీడీపీ మేనిఫెస్టోకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్న చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, చంద్ర ఉమామహేశ్వరరావు, పాలకొల్లు భాస్కర్‌రెడ్డి, కామేపల్లి వెంక టరత్నం, గంగవరపు పుల్లయ్య, గంగవరపు శివరామయ్య, తెల్లగొర్ల వెంకటయ్య, నాదిండ్ల రాజేంద్ర, మూలె రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కొండాపురం: టీడీపీలో చేరిన చింతలదీవి గ్రామస్థులు



వింజమూరు: కరపత్రాలను ఇస్తున్న టీడీపీ నాయకులు



దేవిశెట్టిపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ జెడ్పీటీసీ కలివెల జ్యోతి

పేదల ప్రాణాలతో జగన్ చెలగాటం

● వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ

కలువాయి, మే 3: నాసిరకం మందు తయారు చేసి అమ్మి పేదల ప్రాణాలతో జగన్‌మోహన్‌రెడ్డి చెలగాటం ఆడుతున్నారని వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ ఆరోపించారు. కుల్లూరు, బ్రాహ్మణపల్లి, బద్దెవోలు, రామన్నగారిపల్లె, వెంకటరామ రాజుపేట, ఉయ్యాలపల్లి గ్రామాల్లో ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబా బునాయుడు సీఎం అయితే మళ్లీ రాష్ట్రానికి మంచిరోజులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. మన బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ అధికారంలోని రావాలన్నారు. మన బిడ్డలకు ఉపాధి, ఉద్యోగ అవ కాశాలు దొర కాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమౌతుందన్నారు. టీడీపీ అధికారంలోని రాగానే రూ.4వేలు పింఛను ఇంటికి తీసుకువచ్చి ఇస్తామని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. ఒక్క అవకాశం అంటూ అధికారంలోనిక వచ్చి ప్రజలను మోసం చేశారని మళ్లీ మోసపోవద్దని ఓటర్లను చెప్పారు. కుల్లూ రులో 20కుటుంబాల వారు కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికి కురుగొండ్ల పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ప్రతి గ్రామంలో టీడీపీ శ్రేణులు కురుగొండ్లకు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట జీ.వెంకటేశ్వర్లు నాయుడు, ఎస్ఎస్ఆర్ నాయుడు, అల్లంపాటి వేణుగోపా ల్‌రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, చల్లా బుజ్జిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, బొట్టా వెంక టేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే దాచూరు గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం రాత్రి వెంకటగిరి టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరారు. గ్రామ సర్పంచ్ రాజుల అనురాధ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పీర్ల సోమయ్య యాదవ్ ఆధ్వర్యంలో యనమల సుధాకర్‌రెడ్డి, బోరెడ్డి రమ ణారెడ్డి, షేక్.మస్తాన్‌వలి, పెరంకొండ శివకుమార్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వీరం దరికి పార్టీ కండువాలు వేసి కురుగొండ్ల ఆహ్వానించారు.



కుల్లూరులో కురుగొండ్లకు స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

కావలి కందుకూరు

కలిగిరిలో 645 పొగాకు బేళ్ల కొనుగోలు

కలిగిరి, మే 3: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 794 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 14 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 645 బేళ్లు కొనుగోలు చేశారు. నోసేల్‌-3, నోబిడ్‌-122, ఆర్‌ఆర్‌-3, సీఆర్‌-10, జంపింగ్‌లాట్స్‌-11 కారణాలతో 149 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.296, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.260.67 నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్‌ తెలిపారు.

ఆర్యవైశ్యులను గుర్తించింది ఎన్డీఏ కూటమే..

కందుకూరు, మే 3: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి మ్యానిఫెస్టోలో ఆర్యవైశ్యులను గుర్తించి గౌరవించిందని నియోజకవర్గ టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు మోదడుగు వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్యవైశ్యులకు తగిన గౌరవం కల్పించిన కూటమి అభ్యర్థులైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావుల విజయం కోసం ఆర్యవైశ్యులంతా తమవంతు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులు, పెన్షనర్ల మనోవేదనకు జగనే కారణం

● టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులకు కందుకూరులో పెన్షనర్లు, సీనియర్‌ సిటిజన్ల మద్దతు



కందుకూరు : మాట్లాడుతున్న వేమిరెడ్డి, పక్కన ఇంటూరి

కందుకూరు, మే 3: రాష్ట్రంలో పెన్షనర్లు, ఉద్యోగుల మనోవేదనకు జగనే కారణమని, జగన్‌ ఓటమే లక్ష్యంగా మేమంతా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నామని పెన్షనర్లు, సీనియర్‌ సిటిజన్లు పేర్కొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులైన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులతో శుక్రవారం పెన్షనర్లు, సీనియర్‌ సిటిజన్ల ఆత్మీయ సమావేశాన్ని కందుకూరు పట్టణంలోని కోవూరు రోడ్డు 8వ లైనులో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పెన్షనర్లు, సీనియర్‌ సిటిజన్లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తాము టీడీపీకి వ్యతిరేకంగా ఓటువేశామని, అయితే తమకు జగన్‌ చేసిన అన్యాయంతో తీవ్ర మనోవ్యధకు గురై రానున్న ఎన్నికల్లో ఆయన ఓటమే లక్ష్యంగా తమ శక్తిమేరకు పనిచేయాలని నిర్ణయించుకున్నామన్నారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబునాయుడు 44 శాతం ఫిట్‌మెంట్‌ ఇస్తే జగన్‌ 26శాతం రివర్స్‌ పీఆర్సీ ఇచ్చారని, ఇప్పటికీ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, అరియర్స్‌ కూడా చెల్లించలేదన్నారు. టీడీపీ పాలనలో ఒకటి రెండు తేదీలలో జీతాలు, పెన్షన్లు చేతికందేవని, ఇప్పుడు 15వ తేదీకి కూడా అకౌంట్లలో డబ్బులు పడటంలేదన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపటాన్ని తాను అప్పట్లోనే వ్యతిరేకించానని వివరించారు. అయితే అప్పట్లో జగన్‌ చుట్టూ ఉండే కోటరీ బలంగా పనిచేసి నెల్లూరు జిల్లాలో కలిపించారని, రాబో యే రోజుల్లో తిరిగి కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపటం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గురుసమానులైన పెన్షనర్లు, సీనియర్‌ సిటిజన్లకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, మీకు ఏకష్టం వచ్చినా కలవవచ్చని తెలిపారు. టీడీపీ ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడు నూకసాని బాలాజీ మాట్లాడారు. అనంతరం వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను పెన్షనర్లు సత్కరించారు. చిమ్మిరి నరసింహం, కేఎస్‌ వెంకటేశ్వర్లు, మంచిరాజు మురళీమోహన్‌, ఆర్‌. వెంకటేశ్వర్లు (ఆర్వీ), మద్దెల వెంకటేశ్వర్లు, నాగరాజారావు, పాల్గొన్నారు.

'బుర్రా'కు వరుస షాకులు

కందుకూరులో వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. వైసీపీ కీలకనేత కొల్లూరి కొండయ్య(గ్యాస్‌) ఆపార్టీని వీడి తెలుగుదేశం గూటికి చేరారు. వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌ వైఖరి నచ్చక ఆపార్టీని వీడుతున్నట్లు ప్రకటించి తన అనుచరులతో కలిసి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావుల సమక్షంలో టీడీపీలో చేరారు. కొండయ్యతో పాటు వైసీపీ పట్టణ యూత్‌ అధ్యక్షుడు వాకా నాగరాజారెడ్డి, మాజీకౌన్సిలర్‌ పొడపాటి నాగేశ్వరరావు, వలేటివారిపాలెం మండల మాజీఅధ్యక్షుడు దామా ప్రవీణ్‌, మహిళా నేత గుండ్లపాలెం సుజాత, కల్లూరి శ్రీ ను, చంద్రమౌళి, పలు కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారందరికీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పసుపు కండువాలు కప్పి ఆత్మీయంగా స్వాగతించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పాల్గొన్నారు.

సోమశిల నీరు తీసుకొస్తాం

లింగసముద్రం : కందుకూరు నియోజకవర్గంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని, స్థానికంగానే పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటు చేసి, తద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఇక్కడే ఉపాధి ఉద్యోగాలు సృష్టించడమే తమ మొదటి లక్ష్యమని ఏంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు ప్రకటించారు. శుక్రవారం లింగసముద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు వేముల గోపాలరావు ఆధ్వర్యంలో భారీ రోడ్‌షో జరిగింది. వాకమళ్లవారిపాలెంలో ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, నూకసాని బాలాజీలకు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి లింగసముద్రం బస్టాండ్‌ సెంటర్‌ వరకు జరిగిన రోడ్‌షోలో గజమాలలతో ఘనస్వాగతం పలికారు. వేమిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో సముద్రం తీరం, రైల్వే లైను, నేషనల్‌ హైవే ఉన్నాయని, శాశ్వత నీటి వసతి ఏర్పాటు చేసుకొని, పరిశ్రమలు తెలుసుకోవా లన్నారు. ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో వైజాగ్‌లో భూములను దోచుకున్న విజయసాయిరెడ్డి గ్యాంగ్‌, ఈ ప్రాంతాన్ని కూడా పిండి చేసేందుకు వచ్చిందన్నారు. సోమశిల నుంచి 1.5 టీఎంసీల నీటిని తీసుకొచ్చి రైతులను ఆదుకొంటామన్నారు. ఒంగోలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు నూకసాని బాలాజి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం జరిగేలా ఎన్డీఏ కూటమి మేనిఫెస్టో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దన్‌, మాజీ ఎంపీపీ జీ.కల్పన, టీడీపీ మండల యువత అధ్యక్షుడు ఏ.రంగయ్య, ఆయకులు గాలంకి ప్రసాద్‌, వంకాయలపాటి మాల్యాద్రి, కండే మాలకొండయ్య, ఎ నర్సయ్య, ఉప్పతి బాబురెడ్డి, మునగల నారపరెడ్డి, జంపాల కృష్ణయ్య పాల్గొన్నారు. కాగా లింగసముద్రంలో జరిగిన టీడీపీ ఉమ్మడి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావు, జనసేన మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహారావు, జనసేన జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా లింగసముద్రం రజక కాలనీకి చెందిన మూడు కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కామేపల్లి రమణయ్య, కామేపల్లి కృష్ణ, కామేల్లి వేణులు ఉన్నారు. వారివెంట టీడీపీ నాయకులు గాలంకి ప్రసాద్‌, ఎస్‌ నారాయణ, సర్పంచ్‌ నాగేశ్వరరావు, దేవకి సుబ్రహ్మణ్యం ఉన్నారు. మండలంలోని ఆర్‌ఆర్‌ పాలెం గ్రామస్తులతో నాగేశ్వరరావు ఆత్మీయ సమావేశం నిర్వహించారు.



లింగసముద్రం : వేమిరెడ్డి, ఇంటూరిలను గజమాలతో సన్మానం



కందుకూరు : టీడీపీలో చేరిన కొండయ్య, నాగేశ్వరరావు

టీడీపీలోకి భారీగా చేరికలు

వలేటివారిపాలెం : స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో శుక్రవారం వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరారు. వలేటివారిపాలెం పంచాయతీలో 35 కుటుంబాలు, చిన్నఅమ్మపాలెం, బంగారక్కపాలెం గ్రామాలకు చెందిన 24 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పార్టీలోకి చేరిన వారందరికీ నాగేశ్వరరావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు కాకుమాను అంజనేయులు, వలేటి శ్రీధర్‌నాయుడు, గుత్తా మహేశ్వరావు, వలేటి నరసింహం, పరిటాల భాస్కర్‌రాబు, కాకుమాను హర్ష, కొంకా రమేష్‌, వలేటి మధుసూదన్‌రావు, గుత్తా కొండయ్య, పాల్గొన్నారు. అంకభూపాలపురంలో పలువురు టీడీపీలో చేరారు. నల్లమోతు వెంకటేశ్వర్లు, ఇరపని లక్ష్మీనారాయణ, బాలశింగయ్య, మాధవ, మాల్యాద్రిలు పార్టీలో చేరారు.

ఎంపీగా కొప్పుల రాజు గెలుపు ప్రజల సామాజిక బాధ్యత

● విశ్రాంత ఐఏఎస్‌ అధికారులు సుజాతారావు, రమేష్‌

కావలిటౌన్‌, మే 3: విశ్రాంత ఐఏఎస్‌ కొప్పుల రాజు జీవితం ప్రజాసేవకే అంకితమని విశ్రాంత ఐఏఎస్‌ అధికారులు సుజాతారావు, రమేష్‌ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కొప్పుల రాజు ఐఏఎస్‌ అధికారిగా ప్రజాసేవలో తరించడమేకాక విలువలతో కూడిన వ్యక్తిత్వం కలిగి బడుగు బలహీ వర్గాల అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేశారన్నారు. కాంగ్రెస్‌ పార్టీనుంచి ఎంపీగా పోటీ చేస్తున్న రాజును గెలిపించుకోవడం ప్రజల సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ ఎమ్మెల్యే అభ్యర్థి పొదలకూరు కల్యాణ్‌, కాంగ్రెస్‌ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌ బాబు, వామపక్ష నేతలు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వలేటివారిపాలెం, మే 3 : తెలంగాణ రాష్ట్రం నల్గొండలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని పోకూరు ఎస్సీ కాలనీకి చెందిన జడ రవీంద్ర, ఎండ్లూరి శామ్యూల్‌ మృతి చెందారు. వారి మృతదేహాలను శుక్రవారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌ వారి నివాసానికి వెళ్లి పూలపార్థివ దేహాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దళితుల పథకాలు రద్దు చేసిన వైసీపీ



అంబేద్కర్‌ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న జ్యోతి బాబురావు

కావలిటౌన్‌, మే 3: వైసీపీ ప్రభుత్వం 27 దళితుల పథకాలు రద్దు చేసిందని, మళ్లీ ఏ మొఖం పెట్టుకుని దళితుల ఓట్లడుగుతారని టీడీపీ క్లస్టర్‌ ఇన్‌చార్జ్‌, పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక అంబేద్కర్‌ నగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు కావ్య కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌ రెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్‌ కోఆప్షన్‌ సభ్యురాలు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌ బ్యాంకులకు వేయడం జగన్‌ కుట్రే

చిట్రగుంట, మే 3: సామాజిక పింఛన్లు బ్యాంకులకు వేయడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల కుట్రే అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్‌.మల్లి అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం గిరిజన కాలనీలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతు నడవలేని వృద్ధులు, దివ్యాంగులు, చదువులేని గిరిజనులు బ్యాంకులకు వెళ్లి పింఛన్‌ తెచ్చుకోవడం వీలుపడదన్న సంగతి అధికారులకు తెలియదా అని ప్రశ్నించారు. కేవలం వలంటరీలు లేకపోవడం వలన ఇంటింటికి పింఛన్ల పంపిణీ జరగలేదని, అందుకు ప్రతిపక్షాలే కారణమని ప్రజలను జగన్‌ నమ్మించేందు చేస్తున్న కుట్ర అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గిరిజనులు రాపూరు చిన్నోడు, చెంచయ్య, శీనయ్య, మొలకమ్మ, వెం కమ్మ, పోలయ్య, రాములమ్మ తదితరులు ఉన్నారు.

వేమిరెడ్డి, ఇంటూరిలను గెలిపించండి

లింగసముద్రం, మే 3 : రాబోయే ఎన్నికలలో నెల్లూరు కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి ఆనగేశ్వరరావులను భారీ మెజారిటీలతో గెలిపించాలని కందుకూరు పట్టణ టీడీపీ కోశాధికారి కొత్తూరి సుధాకర్‌ చెప్పారు. కందుకూరు టీడీపీ ఆర్యవైశ్య నాయకులతో కలిసి ఆయన శుక్రవారం రాత్రి లింగసముద్రంలోని ఆర్యవైశ్య బజారులో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.సేవాభావం కలిగిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శ్రీ వాసవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని కూటిమి మేనిఫెస్టోలో చేర్చడం ఆర్యవైశ్యులను గౌరవించడమే అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌ ఉమామహేశ్వరరావు, కోట కిషోర్‌, కోటా నరసంసిహం, తాతా లక్ష్మీనానారాయణ తదితరులు పాల్గొన్నారు.

సౌజన్య సమక్షంలో టీడీపీలో చేరిక

కందుకూరు, మే 3: పట్టణంలోని 17వ వార్డు తూర్పు బలిజపాలెంలో తేలప్రోలు రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పలు కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ, జనసేన కూటమిలో చేరారు. టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య సమక్షంలో గోనుగుంట అశోక్‌కుమార్‌, తిరుమలశెట్టి వెంకటరావు, షేక్‌ ఫయాజ్‌, అచ్యుతసాయి, తేజ, గుర్రం రమేష్‌, గుర్రం రంగారావు, ముక్కాల మయూరి, చంగా కృష్ణ, చంగా సుబ్బారావు, వెంకటేశ్వర్లు, నరసింహ్మం, గజ్జిగుంట శ్రీను తదితర 48 కుటుంబాల వారు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాపుసంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్‌, జిల్లా జనసేన ఐటీ కోఆర్డినేటర్‌ యాదాల కోటి, దరిమడుగు నాగరాజు, పిడికిటి వెంకటేశ్వర్లు, దామా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు వేయండి

ఉలవపాడు : టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కందుకూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య ఓటర్లను అభ్యర్థించింది. శుక్రవారం ఉలవపాడులోని ప్రధాన రహదారి వెంబడి, ముస్లీం కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రచారంలో భాగంగా ఆర్యవైశ్య మహిళల ఆహ్వానం మేరకు వారితో ఆత్మీయ సమావేశం అయ్యారు. టీడీపీకి మద్దతుగా పని చేస్తామని ఆర్యవైశ్య మహిళలు పేర్కొన్నారు.

టీడీపీతోనే రైతు సమస్యల పరిష్కారం : బీద



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో బీద, కావ్య



కొత్తపల్లిలో ప్రజలను ఓట్లు అభ్యర్థిస్తున్న క్రిష్ణారెడ్డి

అల్లూరు, మే 3 : రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం టీడీపీ ప్రభుత్వంలోనే సాధ్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పేర్కొన్నారు. అల్లూరు పట్టణ పరిధిలోని పేటస్రతంలో నలభై ఏళ్లుగా కాంగ్రెస్‌, వైసీపీలో ఉన్న కాసల మధు, కాసల వెంకయ్య, కాసల గోపాలయ్య, కాసల మస్తానయ్య, కాసల శ్రీనివాసులు, కాసల వెంకటేశ్వర్లు, కాసల చిట్టిబాబు, కాసల బాబులు, కాసల మస్తానయ్య, కాసల మధు, కాసల చిన్న వెంకయ్య, కాసల వెంకట సురేష్‌, గండవరపు వెంకట రమణయ్య, గండవరపు వీరాస్వామి, గండవరపు రామయ్య, శ్రీనివాసులు, గోపాలయ్య, శ్రీనివాసులు అలియాస్‌ నరసయ్య, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, కుమ్మరగుంట శ్రీనివాసులు, కుమ్మరగుంట వినయ్‌, ఏలూరు చిన్నయ్య, ఏలూరు లింగరాజు తదితర వైసీపీకి నాయకుల కుటుంబాలు శుక్రవారం బీద రవిచంద్ర, కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడుల సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా బీద మాట్లాడుతూ రైతుల కోసం ఏ అభివృద్ధి కార్యక్రమం చేసింది టీడీపీ హయాంలోనే అన్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు పెరుగుతున్నాయని, కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల గెలుపే లక్ష్యంగా అందరం ముందుకు నడిచి గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.



టీడీపీలో చేరిన 2వ వార్డు వైసీపీ నేత నర్రా భాస్కర్‌

కావలి అభివృద్ధికి బీద కృషి : కావ్య

కావలి నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఎనలేని కృషి చేశారని, గత నలభై ఏళ్లుగా అల్లూరు, కావలి నియోజకవర్గాల్లో పోటీచేసే టీడీపీ అభ్యర్థి కోసం ఆయన ఎనలేని పోరాటాలు చేశారన్నారు. అదేవిధంగా తమతోపాటు పార్టీని నమ్ముకొని వచ్చేవారికి అదనపు గౌరవం అందేలా చేస్తామన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌ రెడ్డి పదేళ్లుగా ఎన్నో అరాచకాలు, అక్రమాలకు తెరలేపారని, అటువంటి దుర్మార్గుడి కారణంగా కావలి నియోజకవర్గం అభివృద్ధికి దూరమైందన్నారు. నమ్మి గెలిపించిన ప్రజలకు ఏదో ఒక విధంగా సహాయపడాలే తప్ప స్వార్థ ప్రయోజనాల కోసం ఆయన, ఆయన అనుచరులు దోచుకొని దాచుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా హ్వానించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌, బుల్లా కృష్ణారెడ్డి, పాపనబోయిన రత్తయ్య, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, రాయి నాయుడు, ఆట తిరుమల, పీజీఎం యూత్‌, మేడా రామకృష్ణారెడ్డి, గోళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆధ్వర్యంలో బోగోలు మండలం, సిద్ధవరం వెంకటేశుపాలెంకు చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. అల్లూరు పేటలో జరిగిన కార్యక్రమంలో బోగోలు మండలం తెలుగు యువత అధ్యక్షుడు అన్నంగి ఆదిశేషయ్య, ఎస్సీసెల్‌ నాయకుడు కాకి తిరుపతి, రాములు నాగరాజురెడ్డిల ఆధ్వర్యంలో రామలింగం హరికృష్ణ, గోళ్ల శ్రీహరి, గోళ్ల రవి, జడ్డా తిరుపతి, కాకి శ్రీను, పొంగులూరు బాబు, ఇష్టాటి నాగరాజులు టీడీపీలో చేరారు.

ఎమ్మెల్యే మాటలు నమ్మితే నట్టేట మునిగిపోతాం

కావలి/కావలిరూరల్‌ : రాష్ఠం సర్వతోముఖాభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ, జనసేన,జ బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలి రూరల్‌ మండలం కొత్తపల్లి, రాజువారి చింతలపాలెంలో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అరాచకాలకు, దోపిడీలకు అడ్డులేదని, మళ్లీ ఆయన మాటలు నమ్మితే నట్టేట మునిగిపోతామన్నారు. కొత్తపల్లి చెరువులో మట్టి అమ్ముకుని లక్షలు సంపాదించాడని కాని చెరువుకు సోమశిల నీరు తేలేక పోయారన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేర్చటమే ఎన్డీఏ కూటమి మేనిపెస్టో లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే అవినీతికి అంతులేదని చివరకు ఆరోగ్యం బాగాలేని వారికి ఇచ్చే సీఎం రిలీఫ్‌ ఫండ్‌లో కూడా చిల్లర దండుకుని బాధితులకు చెక్కులు ఇచ్చిన సంఘటన కొత్తపల్లిలోనే వెలుగు చూసిందన్నారు. పత్రికలలో వార్తలు వస్తే అప్పుడు తీసుకున్న సొమ్మును తిరిగి చెల్లించారన్నారు. అక్రమ సంపాదనతో ప్రతాప్‌కుమార్‌ రెడ్డి కోట్లకు పడగలెత్తారే కాని ప్రజల సమస్యలు, పేదలను పట్టించుకోలేదన్నారు. మరొకసారి ఎమ్మెల్యేకు అవకాశం ఇస్తే మీ ఆస్తులు కూడా ఆయన పేరుమీద రాసేసుకుంటారన్నారు. మాయమాటలు, మోసపూరిత వాగ్దానాలతో మీముందుకు వచ్చే ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, వైసీపీ నేతలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ ఎన్నికలలో ప్రజలు తమ ఓటు ద్వారా వైసీపీకి తగిన బుద్ధి చెప్పి టీడీపీ అభ్యర్థులైన ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని గెలిపించాలని కోరారు. కూటమి మేనిపెస్టో ద్వారా అందించే పథకాల ద్వారా అన్నివర్గాల ప్రజలకు చేకూరే లబ్ది గురించి విరించారు. ఈ కార్యక్రమంలో రూరల్‌ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంకట్రావు, రూరల్‌ పరిశీలకులు కండ్లగుంట మధుబాబునాయుడు, దగుమాటి మాల్యాద్రి రెడ్డి, స్థానిక నేతలు పొన్నగంటి రవీంద్ర, పొన్నగంటి మాల్యాద్రి, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, బత్తల శ్రీను, బోయిన చినబాబు, తలపల యువరాజు, జనసేన మండల నాయకుడు తిరుపతి స్వామి, బీజేపీ మండల నాయకుడు మామిడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీలో చేరిక

కావలి నియోజకవర్గంలో రోజురోజుకి టీడీపీలో చేరికలు పెరుగుతున్నాయి. కావలి పట్టణం 2వ వార్డుకు చెందిన వైసీపీ ముఖ్య నాయకుడు నర్రా భాస్కర్‌ యాదవ్‌ శుక్రవారం వైసీపీని వీడి స్థానిక టీడీపీ కార్యాయలంలో పట్టణ అధ్యక్షుడు గుత్తి కొండ క్రిషోర్‌ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అలాగే 23వ వార్డుకు చెందిన లెక్కల బ్రదర్స్‌ వైసీపీని వీడి పార్టీ నాయకులు ఆలా శ్రీనివాసులు, ఇస్కా విక్రమ్‌రెడ్డి, డాకా శ్రీనివాసులురెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అలాగే చెంచుగానిపాలెం వైసీపీ నేత జూపూడి దిలీప్‌కుమార్‌ స్థానిక నేత పర్రి రమణయ్య ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరందరికీ కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అలాగే బోగోలు మండల నాయకులు రమేష్‌రెడ్డి, కండ్లగుంట మధుబాబు నాయుడుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చెన్నారెడ్డి పాలెంకు చెందిన వైసీపీ నాయకుడు షేక్‌ మస్తాన్‌, నాగులవరంకు చెందిన పసుపలేటి అనుచరుడు మాలేపాటి శ్రీహరినాయుడులు టీడీపీలో చేరారు. వారికి కూటమి అభ్యర్థి క్రిష్ణారెడ్డి సోదరుడు గోపాల్‌రెడ్డి పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు.

హోమ్‌ ఓటింగ్‌ ప్రారంభం

కావలి, మే 3: సార్వత్రిక ఎన్నికలలో పోలింగ్‌ కేంద్రాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగుల కోసం ఎన్నికల కమిషన్‌ హోమ్‌ ఓటింగ్‌కు అవకాశం కల్పించింది. కావలి నియోజకవర్గంలో హోమ్‌ ఓటింగ్‌కు 186 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో శుక్రవారం హోమ్‌ ఓటింగ్‌ను ప్రారంభించగా కావలి ఆర్వో శీనానాయక్‌ పరిశీలించారు. తొలిరోజు 63 మంది ఓటింగ్‌ వేశారు. ఈ హోమ్‌ ఓటింగ్‌ 3,4,5 తేదీలలో కొనసాగించి 6వ తేదీ విరా మం ఇచ్చి మళ్లీ 7,8,9 తేదీలలో కొనసాగించనున్నట్లు ఆర్వో తెలిపారు.

రేపటి నుంచి పోస్టల్‌ బ్యాలెట్‌ ఓట్లు

ఈనెల 5,6,7 తేదీలలో మూడు రోజుల పాటు పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటింగ్‌ ఉంటుందని ఆర్వో శీనానాయక్‌ తెలిపారు. కావలి నియోజకవర్గంలో 2,900 మంది పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటర్లు ఉన్నారని, వారి కోసం కావలి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో 5 సెంటర్లు పెట్టామన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్‌, ఆర్టీసీ ఉద్యోగులు 28 మంది పోస్టల్‌ బ్యాలెట్‌ ఓటర్లు ఉండగా వారికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్వో కార్యాలయంలోనే సెంటర్‌ ఏర్పాటు చేశామన్నారు.



కందుకూరు : హోమ్‌ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టరు



కావలి : హోమ్‌ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్వో శీనానాయక్‌

కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో ప్రతి మండలానికి ఒక టీంను ఏర్పాటు చేసి ముందుగా గుర్తించిన వికలాంగులు, వృద్ధుల ఇళ్లవద్దకే పోలింగ్‌ అధికారులు వెళ్లి ఈవీఎంలలో వారి ఓటింగ్‌ ప్రక్రియను ప్రారంభించారు. ఈ ప్రక్రియను సబ్‌ కలెక్టరు జి. విద్యాధరి పర్యవేక్షించి రహస్య ఓటింగ్‌కు ఎలాంటి విఘాతం కలుగకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలని పోలింగ్‌ అధికారులకు సూచించారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

ఉలవపాడు, మే 3 : అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యంను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. గురువారం అర్ధరాత్రి కొల్లూరుపాడు జాతీయ రహదారిపై తనిఖీలు చేయగా సుమారు 2000 కేజీల అనుమతులు లేని రేషన్‌ బియ్యంను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సంబంధింత రెవెన్యూ అధికారులకు అప్పగించనట్లు తెలిపారు. కాగా ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు నిర్వహించేందుకు కేటాయించిన తమిళనాడు పోలీసులతో కలిసి స్థానిక ఎస్సై ఆత్మకూరు, మన్నేటికోట, ఉలవపాడు గ్రామాలలో కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

పాతూరులో టీడీపీ ప్రచారం

కావలి, మే 3: కావలి పట్టణం పాతూరులో శుక్రవారం సాయంత్రం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టారు. రాష్ట్ర అభివృద్ధి దృష్ట్యా టీడీపీని గెలిపించుకుని చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు జీ.భరత్‌కుమార్‌, పట్టణ అధ్యక్షుడు కే.బ్రహ్మానందం, జిల్లా ఉపాధ్యక్షురాలు పూనూరు మాధవి, పాతూరు 5వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి చిలకపాటి శ్రీనివాసులు, వాకా శ్రీనివాసులు రెడ్డి, రామిరెడ్డి క్రిష్ణారెడ్డి, అగులూరి రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో ముమ్మరంగా టీడీపీ...

అల్లూరు, మే 3 : అల్లూరు పట్టణ పరిధిలోని అల్లూరు పేట ప్రాంతంలో టీడీపీ నాయకులు ముమ్మర ప్రచారం చేపట్టారు. కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌ రెడ్డి మేనల్లుడు చందన్‌రెడ్డిలు శుక్రవారం ఇంటింటా తిరిగి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మేడా కృష్ణారెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రద్దగుంటలో టీడీపీ స్థానిక టీడీపీ నాయకుడు తోట శ్రీహరి ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌ సిక్స్‌, అదేవిధంగా మేనిఫెస్టోలోని పథకాల వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో చెముకుల చెంగయ్య, ఇజ్రాయేల్‌, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోలో మహిళలకే పెద్దపీట

కలిగిరి, మే 3: రానున్న ఎన్నికలలో టీడీపీ అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమ పథకాలకే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేసినట్లు ఆపార్టీ మండల కన్వీనర్‌ బిజ్జం క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలిగిరిలోని 247వ బూతులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు సైకిల్‌ గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కాకు మహేష్‌, ఊసా మాల్యాద్రి, కొప్పోలు కొండలరావు, కొండపల్లి వెంకటరావు, నందనవనం ప్రభాకరరావు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలి : జనసేన



సమావేశమైన జనసేన నేతలు

కావలి, మే 3: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌ రెడ్డిలకు ఓటు వేయాలని జనసేన నేతలు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం కావలి టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జనసేన నేతలు సిద్ధూ, సమ్మన వెంకటసుబ్బయ్య, తిరుపతి స్వామిలు మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న పసుపులేటి సుధాకర్‌కు గాజుగ్లాసు గుర్తు కేటాయించినంతమాత్రాన ఆయనకు జనసేనతో సంబంధంలేదన్నారు. ఆయన గాజుగ్లాస్‌ గుర్తు రావటంతో జనసేన మద్దతున్నట్లుగా చేస్తున్న ప్రచారం తగదన్నారు. ఈ సమావేశంలో కాపు నేతలు తోట వెంకటశేషయ్య, పాలడుగు వెంకటేశ్వర్లు, సురేంద్రనాయుడు, రామకృష్ణ, జయరాం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆవేదనను గుర్తించింది చంద్రబాబే...

చిట్రగుంట, మే 3: ఆంధ్రరాష్ట్రంలో దివ్యాంగుల సమస్యలు, ఆవేదనను గుర్తించిన నాయకుడు ఎవరైనా ఉన్నారా అంటే ఒక్క చంద్రబాబునాయు డు మాత్రమేనని విభిన్న ప్రతిభా వంతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ వెంకట్రావు అన్నారు. బోగోలు మండలంలోని తాళ్లూరు, బోగోలు, కప్పరాళ్లతిప్ప, తూర్పు తీరప్రాంతాల్లో ఆయన టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఉమ్మడి అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దగుమాటి క్రిష్ణారెడ్డిలను గెలిపించాలని కోరారు. ఆయన వెంట యు.రవి, కోడూరు సోమయ్య, కంజెతి మీరయ్య, అమిరిశెట్టి వెంకటేశ్వర్లు, సీహెచ్‌ ప్రసాద్‌, ప్రళయకావేరి మస్తానమ్మ ఉన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక

దగదర్తి(చిట్రగుంట), మే 3: దగదర్తి మండలంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు, ఇరిగేషన్‌ బోర్డు మాజీ డైరెక్టర్‌ మాలేపాటి రవీంద్రనాయుడు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత ఊరు వైసీపీకి చెందిన మన్నూరు ప్రసాద్‌, ఉప్పల కృష్ణ అనుచరులతో టీడీపీలో చేరారు. బోగోలు మండలం నాగులవరం పంచాయతీలో టీడీపీ నాయకుడు కాండ్ర యువనేస్తం వ్యవస్థాపకుడు సతీష్‌నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎస్‌.భాస్కర్‌, ఎం.మురళీ, ప్రేమ్‌కుమార్‌, నాగరాజులను టీడీపీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట సీనియర్‌ నేత కాండ్ర రఘురామ్‌ నాయుడు, మల్లికార్జున తదితరులు ఉన్నారు.



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాలేపాటి సోదరులు



అమ్మయ్యా.. నీడ దొరికింది !

మాడు పగిలే ఎండతో ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు అల్లాడిపోతున్నారు. మూడు నాలుగు రోజుల నుంచి జిల్లాలో సరాసరిన 45డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఈ క్రమంలో కలువాయి మండలం కుల్లూరులో వెంకటగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఉదయం 11గంటలకు ఎస్సీ కాలనీలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఎండ తీవ్రంగా ఉండటంతో పాల్గొన్న జనం కూడా ఉండలేక పరిగెత్తారు. అయితే అక్కడ పెద్ద చెట్లు కనిపించడంతో అమ్మయ్యా.. నీడ దొరికిందని సేదతీరారు.

- కలువాయి

రూ.10 వేలిచ్చి..

పదింతల దోపిడీ

వాహనమిత్ర పేరుతో ఇచ్చేది నామమాత్రమే

పథకంలో పలు కొర్రీలు





కుడిచేత్తో చేసిన దానం.. ఎడమ చేతికి కూడా తెలియకూడదంటారు పెద్దలు... కానీ జగన్ ప్రభుత్వం కుడిచేత్తో సాయం చేసి, ఎడమ చేత్తో అంతకురెట్టింపు మొత్తాన్ని లాగేసుకుంటోంది. ఇందుకు ఆటో డ్రైవర్లే ప్రత్యక్ష నిదర్శనం. వాహనమిత్ర పేరిట వారికి ఏటా రూ. 10 వేల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేలు ఇచ్చామని గొప్పలు చెబుతున్న జగన్ ప్రభుత్వం తెరవెనుక నుంచి ఎంత దోచుకుందో తెలిస్తే నోరెళ్ల బెట్టాల్సిందే...!

- ఐదేళ్లుగా జరిమానా చెల్లించలేకున్న ఆటోడ్రైవర్లు
- ఓ చేత్తో సాయం.. మరో చేత్తో బాదుడు
- ఇదేనా జగనన్న రాజ్యం ?

సంగం, మే 3 : జిల్లాలో ఎంతోమంది నిరుద్యోగులు ఆటోడ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. కొందరికి సొంత ఆటోలు ఉండగా, మరి కొంతమంది అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. జిల్లాలో వేల సంఖ్యలో ఆటోలు ఉన్నాయి. ఒక్కో ఆటోవాలాకు ప్రభుత్వం ఏడాదికి రూ. 10 వేల చొప్పున వాహనమిత్ర కింద ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. అయితే పథకం అమలులో అనేక కొర్రీలు పెట్టి ఎంతోమందికి అందకుండా చేసింది. వాస్తవానికి ఈ ఐదేళ్లల్లో ఆటోవాలాలపై వివిధ జరిమానా, లైసెన్సులు, డీజిల్‌పై బాదుడుతో ప్రభుత్వం ఏటా రూ. వేలల్లో వారి వద్ద నుంచి లాక్కుంది.

● జరిమానాల దోపిడీ ఇలా..

టీడీపీ హయాంలో జరిమానాలు చాలా తక్కువగా ఉండేవి. వైసీపీ వచ్చాక అవి భారీగా పెరిగాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 130 జరిమానా విధించేవారు. వైసీపీ వచ్చాక జరిమానా కనిష్ఠ ధర రూ. 1030 అయింది. ఏకంగా పదిరెట్లు పెరిగిందన్న మాట. నెలకు ఐదారు జరిమానాలు, ఒక్కోసారి పది వరకూ జరిమానాలు వేస్తున్నారు. దీంతో ఒక్క నెలలోనే ఒక్కో ఆటోవాలా నుంచి ప్రభుత్వం జరిమానాల రూపంలో సుమారు రూ. 10వేల వరకూ లాగేస్తుంది. ఒకవేళ నెలకు ఒక్క జరిమానా అనుకున్నా.. ఏడాదికి రూ. 10 వేలు ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోంది. పైగా గతంలో మాదిరిగా ట్రాఫిక్ డ్రైవ్స్ లేవు. ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి చలానాలు ఆన్‌లైన్‌లో పంపుతున్నారు. తప్పు చేయకపోయినా ఫొటో చూపి, ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా పేర్కొంటున్నారు. ఇలాంటి చలానాలు నాలుగైదు నెలలకు ఒకసారి వస్తాయి. ఈ భారమంతా ఆటోవాలాలపై ఒకేసారి పడుతోంది.

● కొందరికే అర్హత

పథకం అమలులో లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం అనేక కొర్రీలు పెట్టింది. లబ్ధిదారుల సంఖ్యను బాగా తగ్గించింది. రేషన్ కార్డు ఉంటేనే పథకానికి అర్హుడు. మూడు ఎకరాల పొలం ఉంటే లేదు. ఆటోకు అన్ని లైసెన్సుతోపాటు, డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. పల్లెల్లో చాలామంది ఒకటి, రెండు తరగతులు చదువుకున్నవారు ఆటోలపై జీవనం సాగిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు రావాలంటే ఎనిమిదో తరగతి చదివి ఉండాలి. ఈ కారణం చేత చాలామందికి డ్రైవింగ్ లైసెన్సు లేదు. దీంతో పథకానికి అనర్హుడవుతున్నారు. అలాగే అద్దె ఆటోలు నడిపేవారు ఉన్నారు. ఆటో ఇతడి పేరుపై లేకపోవడంతో వాహనమిత్ర అనర్హుడవుతున్నాడు.

● పన్నులు, పర్మిట్లతో పేరుతో గుంజుడు



ఆటోవాలాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నుల పెంపు, పర్మిట్ల భారాన్ని మోపింది. ఇన్సూరెన్స్ ఫీజులను తగ్గించమని ఆటోవాలాలు మొత్తుకుంటున్నా వినలేదు. హరిత పన్నును అమాంతం నాలుగైదు రెట్లు పెంచేసింది. పదిహేనేళ్ల కాలపరిమితి దాటిన వాహనాలకు విధించే పన్ను భారాన్ని తగ్గించాలని ఆటోవాలా లు కోరినా పట్టించుకోలేదు. ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆటోవాలాల నెత్తిన గుదిబండను మోపింది. ఇలా.. సగటున ఒక్కో ఆటోవాలాకు ఏడాదికి రూ. 10వేలకు పైగానే అదనపు భారం పడుతుంది.

● సీఎన్‌జీ బాదుడు మరోలా...

టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎన్‌జీ ధర రూ. 55గా ఉంది. ప్రస్తుతం రూ. 85కు చేరింది. ఏటా రూ. 5, రూ. 10, రూ.15 మేర పెరుగుతూ వస్తుంది. డీజిల్ ధరలకు అత్యంత దగ్గరగా సీఎన్‌జీ ధర చేరింది. పెట్రోలు, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీని ఉపయోగించి నాలుగు డబ్బులు వెనకేసుకుందామనుకునే ఆటోవాలాలకు అది పెద్ద భారంగానే మారింది. రోజూ ఓ ఆటోవాలా సగటున 200 -250 కిలోమీటర్ల మేర ఆటో నడుపుతారు. ఇందుకు 6 కేజీల సీఎన్‌జీ అవసరం. పెరిగిన సీఎన్‌జీ భారం రూ. 30తో రోజుకు రూ. 180 చొప్పున నెలకు రూ. 5,400 అదనపు భారం పడుతుంది. ఏడాదికి వచ్చేసరికి రూ. 64,800 భారం అవుతుంది. కాగా సీఎన్‌జీపై రాష్ట్ర ప్రభుత్వం కిలోమీటరుకు రూపాయి చొప్పున రోడ్డు సెస్సు వసూలు చేస్తుంది. ఈ సేకరణ ఒక్కో ఆటోవాలా నుంచి ఏడాదికి రూ. 2,160 అదనంగా తీసుకుంటుంది.



నెలకు పది కేసులు రాస్తున్నారు...

ఆటోడ్రైవర్లకు ఈ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదు. వాహనమిత్ర కింద ఏడాదికి రూ. 10 వేలు ఇస్తున్న మాట వాస్తవమే. ఆ 10 వేలను తిరిగి వివిధ రూపం లో లాక్కుంది. నెలకు సగటున రూ. 10 వేల జరిమానా కేసులు నమోదవుతున్నాయి. గతంలో ఉన్న జరిమానా ఫీజులను పెంచి రూ. వెయ్యి చేశారు. ఇక్కడే రూ.10 వేలు ప్రభుత్వానికి వసూలవుతున్నాయి.

- నరసింహులు, డ్రైవర్



సీఎన్‌జీ ధరను పెంచారు..

గతంలో పెట్రోల్ ఆటోను తోలే వాడిని ఆ తర్వాత డీజిల్ వైపు వెళ్లా. ఆ తర్వాత కాలంలో సీఎన్‌జీ ఆటోలు వచ్చాయి. సీఎన్‌జీ కేజీ రూ. 35 ఉన్నప్పుడు ఆటోలను ఎక్కువ మంది కొన్నారు. ఇప్పుడు రూ. 80 కు చేరింది. ఇది డీజిల్ ధరతో పోటీ పడుతుంది. ఈ పరిస్థితుల్లో ఆటో డ్రైవర్లు సంక్షోభంలోకి వెళ్లారు.

- మల్లి, డ్రైవర్

మా రోజుల్లో



అబ్బో.. చాలా తేడా!

మా చిన్నప్పటి రాజకీయాలకు, ఇప్పటి రాజకీయాలకు చాలా తేడా ఉంది. అప్పట్లో ప్రజాసేవ కోసం మాత్రమే రాజకీయాలు చేసేవారు. అప్పటి నాయకులకు ఎలాంటి నేరచరిత్ర ఉండేది కాదు. కానీ నేడు అందుకు పూర్తి భిన్నం. నేతలు వారి ఆస్తులను కాపాడుకునేందుకు, పెంచుకునేందుకే రాజకీయాల్లోకి వస్తున్నారు. ఫలితంగా రాజకీయరంగం వ్యాపారరంగంగా మారిపోయింది. ఓటర్లకు ఓటే ఆయుధం. ఆ హక్కు ద్వారా నిజాయితీపరులను ఎన్నుకుందాం. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకుందాం...

- బాణా నాగిరెడ్డి, ఏఎస్ కండ్రిక, సంగం మండలం

సాయిపేట నుంచి ప్రచారం శుభప్రదం !



సెంటిమెంట్

భౌగోళికంగా ఉదయగిరి నియోజకవర్గ విస్తీర్ణం చాలాపెద్దది. ఇక్కడ నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేసిన వ్యక్తులకు సెంటిమెంట్ ఎక్కువ. వాస్తుపరంగా చూస్తే నియోజకవర్గానికి కొండాపురం మండలంలోని సాయిపేట పంచాయతీ ఈశాన్య దిక్కువ తుంది. 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసిన బొల్లినేని వెంకట రామారావు తన ప్రచారాన్ని సాయిపేట పంచాయతీ ఇస్కపాలెం నుంచి ప్రారంభించారు. అప్పట్లో ఆయన ఘన విజయం సాధించారు. తాజా ఎన్నికలలో టీడీపీ నుంచి పోటీ చేస్తున్న కాకర్ల సురేష్ కూడా సాయిపేట నుంచే ప్రచారం ప్రారంభించారు. ఈశాన్యం సెంటిమెంట్ వర్కౌట్ అవుతుందో.. లేదో మరి...!?

- కొండాపురం

నిస్వార్థ నేత పాలడుగు రంగారావు

- నేడు క్రియాశీలక రాజకీయాలకు దూరం
- 28 ఏళ్లు టీడీపీ మండల నేతగా..
- కడవరకు ఆ పార్టీతోనే అనుబంధం



టీడీపీ కావలి మండలాధ్యక్షుడిగా 28 ఏళ్లపాటు పనిచేసిన పాలడుగు రంగారావు నేడు క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. నిస్వార్థనేతగా ఉన్న ఆయన... ఉన్నత స్థానంలో ఉన్న బీద మస్తాన్‌రావు (రాజ్యసభ సభ్యులు) లాంటి ఎంతోమంది నేతలతో రంగన్నా... అని ఆప్యాయంగా పిలిపించుకున్న 75 ఏళ్ల రాజకీయ కురువృద్ధుడు రంగారావు. వేమిరెడ్డి అయ్యపరెడ్డి తరుపున 1970లో సర్పంచిగా పోటీచేసిన రంగారావు, 1983లో టీడీపీ ఆవిర్భావంతో క్రియాశీల సభ్యుడిగా, తుమ్మలపెంట గ్రామ కమిటీ అధ్యక్షుడిగానూ పనిచేశారు. 1987లో కావలి సింగిల్‌విండో ప్రెసిడెంట్‌గా, సెంట్రల్ బ్యాంక్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. 1987 నుంచి 28 ఏళ్ల కావలి మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీ సీనియర్ నాయకుడిగా 2010, 2017 మహానాడుల్లో నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2017లో నుడా డైరెక్టరుగా పనిచేసిన రంగారావు 2019 ఎన్నికల్లో ఓటు వేసి వచ్చినప్పటి నుంచి కొత్తవారికి అవకాశా లు కల్పించాలని భావించి, క్రియాశీల రాజకీయాలకు దూరం గా ఉంటున్నారు. కడ వరకు టీడీపీతోనే పయనమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

- కావలి రూరల్

స్వార్థమెరుగని ప్రజాసేవకుడు పాటూరి రామయ్య



జలదంకి, మే 3 : 'ఒక్కసారైనా, ఒక్కరోజైనా.. కమ్యూనిస్టుగా బతుకు నేస్తమా... ఆ గొప్ప నీకు తెలుస్తుంది.. మిత్రమా... వర్గరహిత స్వర్గమది నేస్తమా..! అచట మానవతే విలసిల్లను మిత్రమా'... అంటూ చదువుకునే రోజుల్లోనే ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకుని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకుడిగా ఎదిగాయన. అంతేకాక విజయవాడ కేంద్రంగా వెలువడుతున్న కమ్యూనిస్టు పత్రికలు జనశక్తి, ప్రజాశక్తి దినపత్రికల్లో 13ఏళ్ల పాటు సబ్‌ఎడిటర్‌గా పనిచేశారు. భూసంస్కరణల ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించారు. వేలాది ఎకరాల మిగులు భూములను పేదలకు పంపిణీ జరిగేలా చేసిన ఉద్యమవీరుడు. ఆయనే పాటూరి రామయ్య.

● దళిత కుటుంబంలో జన్మించి..

జలదంకి మండలం జమ్మలపాలెంలో 1941 అక్టోబరు 9న నిరుపేద దళితకుటుంబంలో రామయ్య జన్మించారు. కావలిలో విద్యాభ్యాసం పూర్తిచేశారు. చదువుకునే రోజుల్లోనే ఎస్ఎఫ్ఐ చేరి ప్రభుత్వ హాస్టళ్లలో వసతులు సరిగా లేవని పోరాటం చేశారు. ఈ క్రమంలో హాస్టల్ నుంచి గెంటేయబడ్డారు. అప్పటి నుంచి పేదల కోసం పలు పోరాటాలు చేస్తూ కమ్యూనిస్టు నేతలను ఆకర్షించారు. అనంతరం ఆ పార్టీ సభ్యత్వం తీసుకుని జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగారు. జిల్లాకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకున్న రామయ్య... తనకు సంతానం కలిగితే స్వార్థం పెరుగుతుందని భార్య మహాలక్ష్మమ్మను ఒప్పించి పిల్లలు లేకుండా శస్త్రచికిత్స చేయించుకున్నారు. సుందరయ్య సూచనతో కృష్ణాజిల్లా నిడుమోలు ఎస్సీ రిజర్వు నియోజకవర్గం నుంచి సీపీఎం అభ్యర్థిగా 1984లో పోటీచేసి ఘనవిజయం సాధించారు. ఎమ్మెల్యేగా ఆ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవలు చేసి, ఎన్టీఆర్‌కి బాగా దగ్గరయ్యారు. సొంత పార్టీ పెద్దలతో కూడా శెభాష్ అని అనిపించుకున్నారు. ఆ తర్వాత 1989, 2004, 2009 ఎన్నికల్లో కూడా వరుసగా నిడుమోలు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ఎన్టీఆర్, వైఎస్ఆర్, చంద్రబాబుల వద్ద నియోజకవర్గ సమస్యలు వివరించి, వాటిని పరిష్కరించారు.

● నేటికీ సాధారణ జీవితం

నేటికీ పాటూరి రామయ్య సాధారణ శేషజీవితాన్ని గడుపుతున్నారు. ఒక్కసారి ఎమ్మెల్యే అయితేనే బెంజి కార్లలో తిరిగే నేటి రాజకీయ నాయకులతో పోల్చితే రామయ్య ఎందరికో ఆదర్శంగా చెప్పుకో వచ్చు. పార్టీ నిబంధనలను అనుసరించి ఎమ్మెల్యేలకు హైదరాబాద్‌లో ఇచ్చే ఇళ్లస్థలం కూడా తీసుకోకుండా వెనక్కి ఇచ్చేశారు. మాజీ ఎమ్మెల్యేగా ఆయనకు వచ్చే పింఛన్‌లో కొంతభాగాన్ని పార్టీకి ఇచ్చి, మిగిలిన దాంతో జీవనం గడుపుతున్నారు. తనకంటూ గజం స్థలం కూడా లేకుండా కొంతకాలం ఆయన వృద్ధాశ్రమంలో గడిపారు. ప్రస్తుతం పెంపుడు కూతురు వద్ద శేషజీవితం గడుపుతున్నారు.

- నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన జమ్మలపాలెం వాసి
- కృష్ణాజిల్లా నిడుమోలు నుంచి ప్రాతినిధ్యం
- పుచ్చలపల్లి సుందరయ్య అడుగుజాడల్లో నడిచిన ఆదర్శప్రాయుడు

● మా ఊరివాడు రామయ్య

జన్మనిచ్చిన గ్రామానికేకాక ప్రజాప్రతినిధిని చేసిన నియోజకవర్గానికి కూడా గర్వంగా నిలిచారు పాటూరి రామయ్య. రామయ్య మా ఊరి వాడు... అని గర్వంగా జమ్మలపాలెం వాసులు చెప్పుకుంటుండగా, కాదు.. కాదు.. రామయ్య... మావాడు.. మా ఊరివాడు... మాకు ఎమ్మెల్యేగా నాలుగుసార్లు చేశాడు.. అని నిడుమోలు వాసులు కూడా గొప్పగా చెప్పుకుంటారు. అదే ఆయన సంపాదించుకున్న నిజమైన ఆస్తి.

అభ్యర్థుల తటపటాయింపు

- పోలింగ్ ఏజెంట్ల పేర్లు ముందే ఇవ్వాలంటున్న అధికారులు
- అలా ఇస్తే (అ)రాజకీయం చేస్తారేమో...?



కావలి, మే 3 : సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ఏజెం ట్లుగా నియమించుకునే వారి పేర్లను ముందుగా తమకు ఇవ్వాలని ఎన్నికల అధికారులు కావలి నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థులపై ఒత్తిడి తెస్తున్నారు. అలా ముందుగా పేర్లు ఇస్తే వారేమి (అ)రాజ కీయాలు చేస్తారోనని అభ్య ర్థులు తటపటాయిస్తున్నా రు. ఎన్నికల్లో ఎత్తులకు పైఎత్తులలో భాగంగా ఏజెంట్ల పేర్లు ముం దుగా ఇస్తే వారికి అధికారపార్టీ నుంచి ఎలాంటి ఒత్తిడిలు వస్తాయో.. లేక కేసుల పేరుతో పోలీసుల నుంచి బెదిరిం పులు వస్తాయోననే భయంతో ముం దుగా ఏజెంట్ల పేర్లు ఇచ్చేందుకు అభ్యర్థులు భయపడుతు న్నారు. కాగా పెద్ద నేతల నుంచి చోటా నేతల వరకు కొంతమంది ప్యాకేజీలతో.. మరికొంతమంది వ్యక్తిగత కారణాలతో నిత్యం పార్టీలు మారుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏజెంట్ల పేర్లు ముందుగా ఎన్నికల అధికారులకు ఇస్తే ఆ వివరాలు పార్టీల నేతల తెలిసిపోయి ఆ ఏజెంట్లను పోలింగ్‌కు ఒక రోజు ముందు ప్రత్యర్థి పార్టీల వారు కొనుగోలు చేస్తారేమోనన్న ఆందోళన లో అభ్యర్థులు ఉన్నారు. ఒకవేళ ముందుగా పేర్లు ఇస్తే వారికి బెదిరింపులు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. నకిలీ ఓటరు ఐడీ కార్డులు సృష్టించి తిరుపతి ఉప ఎన్నికలలో భారీగా దొంగ ఓట్లు వేసుకున్నారు అధికారపార్టీ నేతలు. ఈ ఎన్నికలలో ఏజెంట్లను లేకుండా చేసి దొంగ ఓట్లు వేయించుకోవటంలో భాగంగా అధికారులను అడ్డం పెట్టుకుని ఈ ఎత్తుగడకు దిగారా ? అనే అనుమానాలు కూడా లేకపోలేదు. ఈ క్రమంలో పోలింగ్ ఏజెంట్లుగా సమర్థులైనవారు ఎవరు? అని అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. ప్యాకేజీలకు ఆశపడకుండా, కేసులు, ఇతర బెదిరింపులకు భయపడకుండా ఉండే వారి కోసం నేతలు గాలిస్తున్నారు.



నువ్వటు.. నేనిటు !

- వేర్వేరు పార్టీల్లో తండ్రీకొడుకులు, అన్నదమ్ములు
- అంతర్గతంగా ఫోన్ సంభాషణలు

ఎన్నికలవేళ పలువురు తండ్రీకొడుకులు, అన్నదమ్ముళ్లు, బావ,బావమరుదులు వ్యూహాత్మకంగా వేర్వేరు పార్టీల్లో ఉంటూ పబ్బం గడుపుకుంటున్నారు. వారు ముమ్మరంగా ప్రచారాల్లోనూ పాల్గొంటున్నారు. ఇలాంటి వారు ఉదయం, సాయంత్రం ఎప్పుడు వీలైతే అప్పుడు ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తాము చేసే అక్రమాలకు, అవినీతికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు ఆయా వ్యక్తులు తమ సన్నిహితులు వద్ద చెబుతుండడం గమనార్హం. ఈ తతంగాన్ని గమనిస్తున్న కొందరు ఇలాంటివారు డబుల్ గేమ్ ఆడుతున్నారని అనుకుంటున్నారు. అంతేకాక వారు ఆయా అభ్యర్థులతో సన్నిహితంగా మెలుగుతూ తమ ప్రాధాన్యతను పెంచుకుంటున్నారు. వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీల తరుపున అభ్యర్థుల వద్ద అన్నదమ్ములు, వారి బంధుగణం వ్యవహరించే తీరు రాజకీయ వర్గాల్లో చర్చానీయాంశమైంది.

- ఉదయగిరి

నిత్యం ప్రజల్లోనే ఉంటేనే నాయకుడు !



వెంకయ్య: అరే కొండయ్యా.. చంద్రబాబు వయసు ఎంతుంటుందిరా?

కొండయ్య : ఓ 74 ఏళ్లు ఉంటాయి..

వెంకయ్య ఆ వయసులో ఆయన రోజుకు ఎన్ని గంటలు ప్రచారం చేస్తున్నాడురా..?

కొండయ్య: ఉదయం నుంచి రాత్రి వరకు మండు టెండను లెక్కచేయకుండా రోజుకు సుమారుగా 15 గంటలు ప్రచారం చేస్తున్నారు..

వెంకయ్య పార్టీ గెలుపు, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన ఎంత కష్టపడుతున్నాడో గదా!

కొండయ్య: అదే మన ఊరూరి నాయకుడు వయసు ఎంతుంటుందిరా?

వెంకయ్య: చంద్రబాబు వయసులో సగం ఉంటుందేమో!

కొండయ్య: ఆయనగారు పార్టీ అభివృద్ధికి ఏమాత్రం కృషిచేస్తున్నాడో కాస్తచెప్పరా?

వెంకయ్య: నన్నెందుకు అడుగుతావు నువ్వు చూస్తున్నావుగా?

కొండయ్య: చూస్తున్నానులే..ఆ నాయకుడు చేసే పనులన్నీ నాతోపాటు గ్రామ ప్రజలంతా చూస్తున్నారులే.

వెంకయ్య: అదేదో చెప్పు మరీ!

కొండయ్య: చెప్తాను...ఆ నాయకుడు ఎన్నికలప్పుడు మాత్రమే ఉదయం నుంచి నలుగురిని వెంటబెట్టుకొని కార్లలో తిరుగుతూ కాలక్షేపం చేస్తుంటాడే తప్ప మిగిలిన రోజుల్లో అసలు కనిపించడు. స్వలాభం చూసుకుంటాడే తప్ప పజల గురించి అసలు పట్టించుకోడు.



వెంకయ్య: నాయకుడనేవాడు ప్రతిరోజు ప్రజలను కలిస్తేనే కదా..? వారి కష్టాలు తెలిసేది. ఎలక్షన్లప్పుడే కనిపిస్తే ఓట్లేస్తారా మరి.

కొండయ్య: అందుకేకదా...! ఓసారి గెలిచిన నాయకుడు మరోసారి ఓడిపోతున్నాడు. గెలిచినా, ఓడినా ప్రజల్లోనే ఉండి వారి కష్టాలు తీరిస్తేనే.. ఆ నాయకుడు ప్రజల మదిలో ఉంటాడు.

వెంకయ్య ఆ.. దీన్ని బట్టి నాకేమర్థం అయిందంటే... ఎప్పుడూ ప్రజలతోనే ఉంటేనే మంచి నాయకుడు అవుతాడు. చంద్రబాబులా నిత్యం ప్రజల గురించి ఆలోచిస్తేనే ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతుంది. మన బిడ్డల భవిష్యత్తు బాగుంటుంది.

- కొండాపురం

మతాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే సహించం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్ద ఖాదర్‌బాషా, వేగూరు చంద్రారెడ్డి

విడవలూరు, మే 3 : మతాల మధ్య చిచ్చుపెట్టాలని కుట్రలు చేస్తే సహించబోమని ముస్లిం మతపెద్ద ఖాదర్‌బాషా, టీడీపీ నాయకుడు వేగూరు చంద్రారెడ్డిలు వైసీపీ నాయకులను హెచ్చరించారు. పార్లపల్లి గ్రామంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామంలో నిర్మాణంలో ఉన్న మసీదును గత నెల 23వ తేదీన గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేస్తే అందుకు టీడీపీ నాయకులే కారణమని వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. పార్లపల్లి గ్రామం మత సామరస్యానికి ప్రతీకని, హిందువులు, ముస్లింలు అన్నాదమ్ముల వలె కలిసిమెలిసి ప్రతి కార్యక్రమంలో పాల్గొం టారన్నారు. అయితే ఈ ఘటనపై వైసీపీకి చెందిన పత్రికలో స్థానిక టీడీపీ నాయకులపై, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలపై బురదజల్లే విధంగా కథనాలు ప్రచురించడం సిగ్గుచేటన్నారు. మసీదును కూలదోసిన వ్యవహారంలో వేమిరెడ్డి దంపతులకు సంబంధం లేదన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో వైసీపీ నాయకులు మతాల మధ్య గొడవలు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇటువంటి నీచ రాజకీయాలు చేస్తే రానున్న ఎన్నికల్లో ప్రజలే వారికి బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ చిలిజిషా, షేక్.రఫీ, హుస్సేన్, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, శ్రావన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాకాణి ధనదాహంతో సర్వేపల్లి సర్వనాశనం : సోమిరెడ్డి



వెంకటాచలం: టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి

వెంకటాచలం, మే 3 : వైసీపీ ఐదేళ్ల పాలనలో కాకాణి గోవర్ధన్ రెడ్డి ధనదాహంతో సర్వేపల్లి నియోజకవర్గం సర్వనాశనమై పోయిందని మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని పూడిపర్తి, తిక్కవరప్పాడు, ఈదగాలి పంచాయతీ శ్రీకాంత్ కాలనీ నుండి 65 కుటుంబాలు వైసీపీని వీడి సోమిరెడ్డి సమక్షంలో శుక్రవారం టీడీపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రూర్బన్ పనులతో పల్లెల్లన్నీ కళకళలాడాయని, ఇప్పుడు మైనింగ్ మాఫియా తీసిన గుంతలతో దినదిన గండంగా ప్రజలు బతుకుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, ఉపాధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి, నాయకులు హరిరెడ్డి, లక్ష్మమ్మ, తదితరులున్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే రైతులకు న్యాయం చేస్తా

వెంకటాచలంలోని సీతమ్మ చలివేంద్రం భూములకు సంబంధించిన రైతులందరికీ టీడీపీ అధికారంలోకి రాగానే న్యాయం చేస్తానని సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. వెంకటాచలంలో శుక్రవారం సాయంత్రం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే వైసీపీ నాయకుల అవినీతి, అక్రమాలను లెక్కలతో సహా బయటకు తీస్తామని హెచ్చరించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మాట్లాడుతూ సర్వేపల్లిలో ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు తెరదించుతూ సోమిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలున్నారు.

మాటమీద నిలబడితే కాకాణి ఓట్లు అడగకూడదు

మనుబోలు : మాట మీద నిలబడితే ఈ ఎన్నికల్లో కాకాణి ఓట్లు అడగకూడదని, కానీ ఆయన సంగతి అందరికీ తెలిసిందేనని టీడీపీ సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని వీరంపల్లి, కొండుపాళెం దళితవాడ గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డేగపూడి -బండేపల్లి కాలువ చేయలేకపోతే 2024లో ఓట్లు అడగనని, ఇప్పుడు ప్రచారాలు ఎలా చేస్తారన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని, సీఎంగా చంద్ర బాబు ప్రమాణస్వీకారం చేయనున్నారన్నారు. పవన్‌కల్యాణ్ రియల్ హీరో అన్నారు.

10 కుటుంబాల చేరిక

సోమిరెడ్డి ప్రచారంలో భాగంగా వైసీపీ నుంచి మోదుబోయిన వెంకటరమణయ్య, ఆయనతో పాటు పది కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి కండువాలు కప్పి సోమిరెడ్డి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామకృష్ణయ్య, రామకృష్ణారెడ్డి, మస్తాన్ నాయుడు, యానాదినాయుడు, రఘురామయ్య, పొట్టేళ్ళ ప్రసాద్, రామకృష్ణ, నాగరాజు, రవీంద్ర రెడ్డి, కోదండరామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటుతో కాకాణికి గుణపాఠం చెప్పండి

తోటపల్లి గూడూరు: సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజాధనాన్ని దోచుకున్న మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డికి ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని పాపిరెడ్డిపాలెంలో శుక్రవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి టీడీపీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ఎన్నికల్లో సోమిరెడ్డిని గెలిపించాలని కోరారు. ముందుగా వైసీపీని వీడి 10 కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొమ్మి సురేంద్ర, సురేష్‌రెడ్డి, మేనాటి సీనయ్య, పరుచూరి హరిబాబు, కోడూరు చంద్రశేఖర్ రెడ్డి, రామసుబ్బారెడ్డి, పరంధామయ్య, విజయ్, ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో హోం ఓటింగ్



చెర్లోపల్లి హోం ఓటింగ్‌లో ఓటు వేస్తున్న వృద్ధుడు

మనుబోలు, మే 3: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల కమిషన్ ఆదేశాలతో గ్రామాల్లో శుక్రవారం నుంచి హోమ్ ఓటింగ్ ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. మండలవ్యాప్తంగా 85 ఏళ్ల పైబడిన వృద్ధులు హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆరు గ్రామాల్లో 19 మందితో హోమ్ ఓటింగ్ చేయించినట్లు పీవో శివప్రసాద్ తెలిపారు. మరో రెండు రోజుల పాటు మిగతా గ్రామాల్లో పర్యటించి మిగిలిన వయోవృద్ధుల నుంచి హోమ్ ఓటింగ్ పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు అరుణ్‌కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు దోచుకుని మోసం చేశారు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చౌకచర్ల అరుంధతీయవాడ వాసులు

విడవలూరు, మే 3: గ్రామీణాభివృద్ధికి విడుదలైన నిధులను వైసీపీ నాయకులు దోచుకుని ప్రజలను నిలువునా మోసం చేశారని చౌకచర్ల పంచాయతీ ఆరుందతీయ వాడ కాలనీ వాసులు ఆరోపించారు. కాలనీలో ఉన్న సమస్యలపై వారు శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకుడు బద్దిపూడి సుధీర్ మాట్లాడుతూ వైసీపీ నాయకులు విడుదలైన పంచాయతీ నిధులతో కాలనీలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండా గాలికి వదిలేశారని విమర్శించారు. అంతేకాకుండా కాలనీలో వేయాల్సిన బోర్లని వారికి ఇష్టం వచ్చిన చోట వేసుకుని బిల్లులు మంజూరు చేసుకున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుందతీయ వాడ కాలనీ వాసులు బద్దిపూడి కిశోర్, ప్రసాద్, రాము, వెంకి, సుబ్బారావు పాల్గొన్నారు.

బీసీలను విస్మరించిన వైసీపీ

తోటపల్లిగూడూరు, మే 3 : వైసీపీ ప్రభుత్వంలో బీసీ కులాలకు చేసింది శూన్యమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మన్నెం రాము గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లిగూడూరులో శుక్రవారం మీడియా సమావేశంలో రాము గౌడ్ మాట్లాడుతూ వైసీపీ బీసీలను విస్మరించిందని, కల్లు గీత కార్మికులకు కనీసం భీమా కూడా ఇవ్వలేదని మాటలు చెప్పారే తప్ప చేసింది శూన్యమన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలోనే బీసీలను అన్ని విధాలుగా ఆదుకుని వారికి ఆర్థికంగా అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఈ ఎన్నికల్లో బీసీ కులాలు ఐక్యంగా ఉండి సర్వేపల్లి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని గెలిపించుకుని తీరుతామని తెలిపారు.

కల చెదిరినా.. కర్తవ్యం మరువక!

- నాడు టికెట్టు దినేష్‌కు కేటాయించిన టీడీపీ అధిష్ఠానం
- మారిన సమీకరణలతో బరిలో ప్రశాంతి
- అధిష్ఠానం ఆదేశాలతో అభ్యర్థి ప్రచారం



ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి దంపతులతో దినేష్‌రెడ్డి

నెల్లూరు, మే 3 (ఆంధ్రజ్యోతి) : యువకుడి కోటాలో మూడేళ్ల క్రితమే టీడీపీ అధిష్ఠానం ఆయనకు టికెట్ కేటాయించింది. గెలుపే లక్ష్యంగా ఈ మూడేళ్ల ఆయన ఊరూరా.. ఇల్లిల్లూ తిరిగారు. తీరా ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో పార్టీ అధిష్ఠానం మరొకరికి టికెట్టు కేటాయించింది. పార్టీ పెద్దల మనసు నొప్పించక ఆ అభ్యర్థి విజయం కోసం ఇప్పుడు ఊరూరా తిరుగుతున్నారు. ఆయనే టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు పొలంరెడ్డి దినేష్‌రెడ్డి. మూడేళ్ల క్రితం తెలుగుదేశం అధినేతల ఆహ్వానం మేరకు కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తనయుడు దినేష్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటివరకు తన తండ్రి శ్రీనివాసులు రెడ్డి నాయకత్వం వహిస్తున్న కోవూరు బాధ్యతలను నారా లోకేష్ ఆదేశాల మేరకు స్వీకరించారు. యువకుడి కోటాలో టికెట్టు ఆయనకే అన్నారు. గడిచిన మూడేళ్లపాటు కోవూరు నియోజక వర్గంలో గడప గడపకు దిరిగి ఎన్నికలకు సిద్ధమయ్యాడు. చివరి నిమిషంలో సమీకరణలు మారాయి. టికెట్టు చేజారింది. పార్టీ పెద్దలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని అభ్యర్థిగా నిలబెట్టారు. పార్టీ నిర్ణయమే శిరోధార్యమని ప్రకటించారు. ఆ రోజు నుంచి క్షణం తీరిక లేకుండా ప్రశాంతి రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తున్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు దినేష్ వ్యక్తిత్వాన్ని హర్షిస్తున్నారు.

సేవాభాగ్యం కల్పించండి

- ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు, మే 3: నియోజకవర్గ ప్రజలకు సేవచేసే భాగ్యాన్ని కల్పించాల్సిందిగా ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. కోవూరు గమళ్లపాళెం, గుమ్మళ్ళదిబ్బ, పడుగుపాడు కాలనీల్లో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడారు. మహాలక్ష్మమ్మ ఆలయంలో పూజల అనంతరం ఆమె మాట్లాడారు. పెన్నానది పొర్లుకట్టల్ని సైతం నాయకులు దిగమింగడంతో వరదల వల్ల కోవూరు, పడుగుపాడు ప్రాంత ప్రజానీకం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పంట కాలువల మరమ్మతులకు ప్రాధాన్యతనిస్తామన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామ న్నారు. పార్లమెంటు స్థానానికి పోటీ చేస్తున్న తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆమె కోరారు. ప్రచారంలో సర్పంచు విజయమ్మ, టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, జానా శేషమ్మ, యేనేటి నిరంజన్, తదితరులు పాల్గొన్నారు. నిమ్మల శ్రీనివాసులు నాయకత్వంలో యువకులు టీడీపీలో చేరారు. లేగుంటపాడులో జరిగిన బీసీ సదస్సులోనూ ప్రశాంతి పాల్గొని మాట్లాడారు. టీడీపీ రాష్ట్రకమిటీ కార్యదర్శి చెముకుల కృష్ణచైతన్య అధ్యక్షత వహించిన సభలో నియోజకవర్గ పరిధిలోని వెనుకబడిన తరగతుల వర్గాల నాయకులు పాల్గొన్నారు.



కోవూరు: గమళ్లపాలెంలో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

కాలువ దుస్థితిని పట్టించుకోరా!?

బజారు కూడలికి సమీపంలోని పారుదల కాలువ దుస్థితిపై టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్పందించారు. గమళ్ళపాలెం, గుమ్మళ్ళ దిబ్బ ప్రచారానికి వెళ్తున్న ప్రశాంతిరెడ్డికాలువను చూసి ఆగిపోయారు. పూడిన కాలువ, పడిపోయిన కల్వర్టు, రహదారిపై రాకపోకలకు ఆటం కంగా మారడాన్ని గుర్తించారు. వెంటనే కారుదిగి స్థానికులతో మాట్లా డారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువను విస్తరించి వారధి నిర్మిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

నిరుద్యోగ సమస్య పరిష్కారమే వీపీఆర్ ధ్యేయం

బుచ్చిరెడ్డిపాళెం : జిల్లాలో నిరుద్యోగ సమస్య పరిష్కారమే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ధ్యేయం అని, ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన వెంటనే ఆయన ఖచ్చితంగా చేస్తారని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శుక్ర వారం బుచ్చి నగర పంచాయతీలోని 3, 4, 5 వార్డుల్లో ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇఫ్కో సెజ్, షుగర్ ఫ్యాక్టరీ, విద్యుత్‌స్టేషన్ (ఎన్‌టీపీఎస్) 3 ప్రాంతాలను కలిపి శ్రీసిటి తరహాలో పారిశ్రామిక వాడలుగా చేసుకుంటే యువతకు ఉద్యోగాలు వచ్చి నిరుద్యోగ సమస్య తీరుతుందన్నారు. అందుకోసం నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, ఎంవీ శేషయ్య, హరికృష్ణ, సూరా శ్రీనివాసులురెడ్డి, పుట్టా సుబ్రమణ్యంనాయుడు, లక్ష్మీకాంతమ్మ, గుత్తా శ్రీనివాసులు ధనలక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఖాజానగర్ నుంచి 25 మంది మైనారిటీ నాయకులు వైసీపీని వీడి సూరా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

● నాగమాంబాపురంలో నాయకులు వంటేరు గిరి పుట్టా సుబ్రమణ్యం నాయుడు, రాఘవరెడ్డి, మహేష్ తదితరులు ప్రచారం చేశారు.

అవినీతి నిర్మూలన ప్రశాంతిరెడ్డితోనే సాధ్యం : నీలిమారెడ్డి

కొడవలూరు: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమాలకు అడ్డాగా మారిన నియోజకవర్గంలో అవినీతిని నిర్మూలించాలంటే కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితోనే సాధ్యమని ఆమె కుమార్తె నీలిమారెడ్డి అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో కమ్మపాళెంలో ఆమె ఇంటింటికీ తిరిగి కరప త్రాలు పంచిపెట్టారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలో ప్రచారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె కిషోర్ నాయుడు, నాపా బాలకృష్ణ, బోయపాటి సుధాకర్, నాపా చిట్టియ్య, కుందుర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపుతారని ప్రశాంతిరెడ్డి కోడలు ఐషితారెడ్డి అన్నారు. యల్లయ పాళెంలో ఏకోల్లు వంశీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో ఆమె పాల్గొని టీడీపీ అధికారం చేపడితే జరగబోయే అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేతూ వెంకటరమణారెడ్డి, బడుగు శ్రీనివాసులు, ఫయాజ్ బాషా, జయరాంరెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.

● మిక్కిలింపేట పంచాయతీలో టీడీపీ మండల కమిటీ ఉపాధ్యక్షుడు కోడూరు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో ప్రశాంతిరెడ్డి అల్లుడు నన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆ గ్రామంలో ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోడూరు బుజ్జిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం నేతల ప్రచారం

ఇందుకూరుపేట : వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాలని కోరుతూ గౌడ సంఘం నాయకులు ఇందుకూరుపేట మండలంలోని కొమరిక, నిడుముసలి, నాగరాజుతోపు గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకుడు బండ్ల బాబయ్య, నాయకులు దాసరి విజయ్‌కుమార్, నిమ్మల శ్రీనివాసులు, దాసరి విజయ్, తిరకాల సుబ్బారావు, బండ్ల సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు మహిళల ప్రచారం

విడవలూరు: వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని తెలుగు మహిళా అధ్యక్షురాలు చలంచర్ల కామేశ్వరి, నీరుగట్టు భవానీల ఆధ్వర్యంలో విడవలూరులో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకురాళ్లు రుష్మేంద్రమ్మ, మహేశ్వరి, ప్రవల్లిక, విజయ, అన్నపూర్ణ పాల్గొన్నారు.



కొడవలూరు: నీలిమారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాపా వెంకటేశ్వర్లు నాయుడు

కోవూరు సర్వేపల్లి

పోలింగ్ కేంద్రాల పరిశీలన



వీరంపల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

మనుబోలు, మే 3: ఎన్నికల వేళ సమస్యాత్మక గ్రామాలపై అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు డీఎస్పీ వీరంజనేయరెడ్డి అన్నారు. మండలంలోని వీరంపల్లి, మడమనూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అల్లర్లు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఆయన వెంట ఎస్ఐ అజయ్ కుమార్ ఉన్నారు.

బుచ్చిలో ఓటరు హెల్ప్‌లైన్ ఏర్పాటు

బుచ్చిరెడ్డిపాళెం, మే 3: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని పోలీస్ ఔట్‌పోస్టు పక్కన శుక్రవారం ఓటరు హెల్ప్‌లైన్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఎన్నికల స్వీప్ అధికారులు, స్థానిక నగర పంచాయతీ కమిషనర్ రమణ బాబు, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్నికల స్వీప్ నోడల్ అధికారి పి వెంకటరత్నం, సభ్యులు రవిశంకర్‌రెడ్డి, బుచ్చి ఏపీఎం లలిత పాల్గొన్నారు.

వలంటీరుపై ఎంపీడీవోకి ఫిర్యాదు

మనుబోలు, మే 3: మండలంలోని పల్లిపాళెం గిరిజన కాలనికి చెందిన వలంటీర్ ఆళ్వార్‌శెట్టి సుమన్‌పై శుక్రవారం గ్రామస్థులు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్య ఈవోఆర్‌డి జీవిఎస్‌వి ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కోడ్ ఉంటే వలంటీర్ మంత్రి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారంటూ ఫిర్యాదులో తెలపగా, వలంటీర్ రాజీనామా పత్రం ముందుగానే ఇచ్చారని, దానిని ఆమోదించామని ఈవోఆర్‌డి తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పొదలకూరు, మే 3: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పొదలకూరు సీఐ రాంబాబు, ఎస్ఐ రామకృష్ణ ఆవిష్కరించారు. అనంతరం క్యాలెండరులను పోలీసు సిబ్బంది, ఎంపీడీవో, తహసీల్దారు, వారి సిబ్బందికి, బ్యాంకు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ఇందూజ్ఞాన వేదిక, ప్రబోధసేవా సమితి పొదలకూరు కమిటీ అధ్యక్షులు, సభ్యులు పెంచలనరసయ్య, కొండయ్య, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

బండ్ల బాట స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పొదలకూరు, మే 3 : బండ్ల బాట స్థలాన్ని ఆక్రమించుకుని ఓ సర్పంచ్ భర్త ఇల్లు నిర్మిస్తున్నారని, దీనివల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని మండలంలోని చాటగొట్ల గ్రామస్థులు శుక్రవారం స్థానిక తహసీల్దారు వీరవసంతరావుకు ఫిర్యాదు చేశారు. మండలంలోని చాటగొట్ల గ్రామంలో బండ్ల బాట ద్వారా పూర్వీకుల కాలం నుంచి రాకపోకలు సాగుతున్నాయి. అయితే గ్రామానికి చెందిన అధికార పార్టీ సర్పంచ్ భర్త ఇక్కడ స్థలాన్ని ఆక్రమించుకుని నూతన భవనాన్ని నిర్మిస్తున్నారని, ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలు నిలుపుదల చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల నిబంధనలు బేఖాతర్

- చౌకిచర్లలో కొత్తగా వీధిలైట్ల ఏర్పాటు

విడవలూరు, మే 3: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని చౌకిచర్ల గ్రామంలో కొత్తగా వీధిలైట్లు ఏర్పాటుచేయడం శుక్రవారం గ్రామంలో దుమారం రేపింది. కొన్ని నెలలుగా వీధిలైట్లు లేవని గ్రామస్థులు మొరపెట్టుకున్నా పట్టించుకోని పంచాయతీ పాలకులు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటే వీధిలైట్లు ఎలా వేస్తారని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం ముందుగా తెలిసే పంచాయతీ కార్యదర్శి శెలవు పెట్టారని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారులు విచారణ జరిపి పంచాయతీ సర్పంచు, కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

'ఫ్రై'డే!

నిప్పుల గుండంగా జిల్లా

మెట్టలో 47 డిగ్రీలకు ఉష్ణోగ్రత

ఆత్మకూరు/నెల్లూరు (హరనాథపురం), మే 3 : మెట్టప్రాంతం నిప్పులగుండంలా మారుతోంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతోపాటు వడగాల్పులు వీస్తున్నాయి. ఉదయం నుంచే ఎండలు మండుతుండటంతో చిన్నారులు, వృద్ధులు తట్టుకోలేకపోతున్నారు. ఆత్మకూరులో శుక్రవారం ఉష్ణోగ్రత 47 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. ఇక ఉదయగిరిలో 45, నెల్లూరు నగరంలో 43.5, కావలిలో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఈ ఉష్ణోగ్రత మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఉదయం 9 గంటలకే ఇళ్ల నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వేసవితాపం తీర్చుకునేందుకు చల్లటిపానీయాలతోపాటు కరపుచ్చ, కిరిణికాయలు పెద్దఎత్తున కొనుగోలు చేస్తున్నారు. ఎండలు మండేకొద్దీ వీటి ధరలు కూడా అదే రీతిలో పలుకుతున్నాయి. యువకులు వేసవితాపం తీర్చుకునేందుకు చెరువులు, కుంటల్లోకి ఈతకు వెళుతూ ఉపశమనం పొందుతున్నారు. ఉష్ణోగ్రత తీవ్రత మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ పేర్కొంది.

● ఎన్నికల ప్రచారంపై ప్రభావం :



ఈ నెల 13న పోలింగ్ జరగనుండటంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. అయితే, భగ్గుమంటున్న భానుడి ప్రతాపంతో వారితోపాటు నాయకులు, కార్యకర్తలు తల్లడిల్లిపోతున్నారు. ఎండ వేడిమి భరించలేక ఉదయం, సాయంత్రం వేళ్లలోనే ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పగటిపూట సమావేశాలు నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఎల్‌నినో బలహీన పడినా ఇంకా దాని ప్రభావం, పసిఫిక్ మహాసముద్రం నుంచి వస్తున్న వేడిగాలులు భారత ఉప ఖండంలో మరింత వేడిని పెంచుతున్నాయి. ఈ ప్రభావం జిల్లాపై ఎక్కువగా ఉంది.

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం) : వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా కార్మికులు, ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కార్మికులు, ఉద్యోగులకు ఎండ తీవ్రతను బట్టి పనివేళలు నిర్ణయించాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. రాష్ట్ర ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థ సూచించిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రాకుండా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలంతా అత్యవసరమైతేనే ఇంట్లో నుంచి బయటకు రావాలని సూచించారు.

● అప్రకటిత కోతలు

బుచ్చిరెడ్డిపాళెం : అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు విలవిల్లాడుతున్నారు. బుచ్చిలో పగలు, రాత్రి తేడా లేకుండా కొన్నిరోజులుగా ఇష్టానుసారం కరెంటు తీసేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసులు మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలకుతోడు ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరగడంతో ఓవర్‌లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ట్రిప్ అవుతున్నట్టు చెప్పారు. లోడు హెచ్చు, తగ్గులతో పెద్దలైన్ కూడా తెగిందన్నారు. దీంతో శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్త్‌లకు ట్యాంకర్‌తో నీరు పట్టినట్లు తెలిపారు.

పోలింగ్ బూత్‌ల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడండి : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ): ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల్లో విద్యుత్ అంతరాయం లేకుండా, ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను విద్యుత్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబర్ నుంచి జిల్లా అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్‌బూత్‌ల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించి, చిన్న అంతరాయం కూడా లేకుండా ముందస్తుగా 33కేవీ, 11కేవీ ఫీడర్లను పెట్రోలింగ్ చేసుకో వాలన్నారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఎక్కువగా డిజి టల్ చెల్లింపులు చేసేలా చైతన్యపరచాలని కోరారు. ఈఈ శేషాద్రి బాలచందర్ పాల్గొన్నారు.

మామిడి పండ్ల దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

- అత్త మృతి, కోడలికి తీవ్రగాయాలు
- ఆ కుటుంబాన్ని వెంటాడుతోన్న మృత్యువు



లారీ దూసుకుపోవడంతో ధ్వంసమైన మామిడి కాయల దుకాణం

ఉలవపాడు, మే 3 : రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని వెంటాడుతోంది. గత మామిడి పండ్ల సీజన్‌లో అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటి అల్లుడు మృతి చెందగా ఈ ఏడాది అదే సీజన్‌లో అత్త అదే రోడ్డు ప్రమాదానికి బలైయింది. దీంతో ఆ కుటుంబానికి పెద్ద దిక్కులేకుండా పోయింది. వివరాల మేరకు.. మామిడి సీజన్‌లో ఉలవపాడు సమీపంలోని జాతీయ రహదారికి ఇరువైపుల మామిడి పండ్ల దుకాణాలు వెలుస్తుంటాయి. ఈ క్రమంలో ఉలవపాడు ఎస్సీ కాలనీకి చెందిన ధన్యాసి కొండమ్మ(50) కుటుంబం గత 20 ఏళ్లుగా సీజనల్ వృత్తిగా వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. హైవేపై అనుకొని ఎప్పటికైనా ప్రమాదమని తెలిసి కూడా గ్రామంలోని అన్ని వర్గాలకు చెందిన వారు అంగళ్లు వేసుకొని రోడ్డుపై మామిడి పండ్ల వ్యాపారం చేసుకోవడం పరిపాటి. కొండమ్మ మామిడి పండ్ల దుకాణం ఒక వరుసలో చివరిది. ఈ క్రమంలో శుక్రవారం న్యూజివీడు నుంచి బెంగళూరుకు మామిడికాయల లోడుతో వెళుతున్న మినీ లారీ అదుపు తప్పి కొండమ్మ మామిడి పండ్ల దుకాణంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో కొండమ్మతోపాటు కోడలు ధన్యాసి వినీత కూడా ఉన్నారు. షాపులో కూర్చొని ఉన్న కొండమ్మ మీదకు లారీ దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకొని బయటపడే క్రమంలో కోడలు వినీతకు తీవ్ర గాయాలయ్యాయి. గత ఏడాది ఇదే సీజన్‌లో కొండమ్మ కుమార్తె భర్త గంగాధర్ కూడా అర్ధరాత్రి మామిడికాయల దుకాణం వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాదం జరిగిన లైన్‌లో సుమారు 15 మామిడి షాపులు ఉంటాయి. మృతురాలు షాపు చివరిది కావడంతో లారీ దూసుకెళ్లినా తరువాత షాపులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఈ ప్రమాదం షాపుల మధ్యలో జరిగి ఉంటే ఊహించుకోవడానికే భయంకరంగా ఉండేదని ఎస్సీ కాలనీవాసులు ఆందోళచెందారు. కొండమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. ఎస్సై బాజీరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన దుకాణం యజమానురాలు ధన్యాసి కొండమ్మ

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

వెంకటాచలం, మే 3 : రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన వెంకటాచలం రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. సుమారు 55 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి డౌన్ లైన్ రైల్వే ట్రాక్‌పై వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు వైట్ కలర్ ఫుల్ హాండ్స్ చొక్కా, బ్రౌన్ కలర్ కాటన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం, మే 3 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల్లో శుక్రవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల్లో 459 మంది, మధ్యాహ్నం జరిగిన నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో 223 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. కాగా, ఉదయం జరిగిన పరీక్షల్లో కావలిలోని జవహర్‌భారతీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, మధ్యాహ్నం వెంకటగిరిలోని ఈఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో ఒకరు, కావలిలోని జవహర్ భారతీ డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం నలుగురు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	143
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	284
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6779
వెండి కిలో ధర	రూ. 82,500
వెండి ఒక గ్రాము	రూ. 84.50

నెల్లూరు సిటీ
నెల్లూరు రూరల్

ఎన్నికల పర్వం

ఇంటి నుంచే ఓటు!


అల్లీపురంలో ఇంటిలోనే ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

నెల్లూరు రూరల్, మే 3 : కదలలేని వారు, దివ్యాంగులు, వయో వృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునే సదుపాయాన్ని ఈ దఫా కేంద్ర ఎన్నికల సంఘం కల్పించడంతో పలువురు వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేశారు. నెల్లూరు నగరం, రూరల్లో ముందుగా గుర్తించిన వయోవృద్ధుల ఇంటికి శుక్రవారం అధికారుల బృందం వెళ్లి ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేందుకు ఏర్పాట్లు చేశారు. బ్యాలెట్ పేపర్ ద్వారా వృద్ధులు ఓటు వేసే అవకాశం కల్పించారు. అనంతరం బ్యాలెట్ బాక్సుల్లో ఆ పత్రాలను వేయించి స్ట్రాంగ్ రూంకు తరలించారు. ఈ విధంగా నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలో 153 మంది వృద్ధులు ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, డీకే కళాశాలలో జరుగుతున్న ఎన్నికల అధికారుల శిక్షణలో సిటీ ఆర్వో వికాస్ మర్మత్ పాల్గొని ఈవీఎంలపై అవగాహన కల్పించారు.

ఈవీఎంల కమీషనింగ్

నెల్లూరు(హరనాథపురం), మే 3 : ఈనెల 13న నిర్వహించే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నెల్లూరు రూరల్ పరిధిలోని కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంల కమీషనింగ్ జరిగింది. ఈ ప్రక్రియను శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మలోల పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పోస్టల్ బ్యాలెట్ గందరగోళం : పీఆర్‌టీయూ

ఎన్నికల విధులు కేటాయించిన ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ విషయం గందరగోళంగా ఉందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీ వెంకట రాజు, ప్రధాన కార్యదర్శి నాటకం తిరుమలయ్య ఓ ప్రకటనలో ఆరోపించారు. జిల్లాలో దాదాపు 35 వేల మంది ప్రభుత్వ సిబ్బందిని ఎన్నికల విధులకు కేటాయించారన్నారు. వారు హోదాను బట్టి ఈ నెల 5, 6, 7 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోమని ఎన్నికల డ్యూటీ ఆర్డర్ ఇచ్చారన్నారు. కానీ దీనికి భిన్నంగా 5వ తేదీ వారికి 7వ తేదీ, 7వ తేదీ వారికి 5వ తేదీ ఓటు హక్కు వినియోగించుకోవాలని వ్యక్తిగత ఫోన్లకు సమాచారం ఇచ్చారన్నారు. దీంతో ఉద్యోగులు గందరగోళంలో ఉన్నారని, అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు.

ఓ ఐఏఎస్‌కు ఇద్దరు ఐఏఎస్‌ల బాసట

● కొప్పుల రాజును గెలిపించండి : సుజాతారావు, పీవీ రమేష్



మాట్లాడుతున్న సుజాతారావు, పక్కన పీవీ రమేష్

నెల్లూరు (వైద్యం), మే 3 : నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కొప్పుల రాజును గెలిపించాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, జిల్లా మాజీ కలెక్టర్ సుజాతా రావు పిలుపునిచ్చారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కొప్పుల రాజు ఐఏఎస్ అధికారిగా ఎన్నో సంస్కరణలు చేపట్టారన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రాజు రూపొందించినదే అన్నారు. మహిళా పొదుపు సంఘాలను ప్రవేశపెట్టి అది దేశవ్యాప్తంగా అమలు అయ్యేందుకు ఆయన చేసిన కృషే కారణమన్నారు. నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు సారా ఉద్యమం, వయోజన విద్య వంటి కార్యక్రమాల్లో ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. అలాంటి వ్యక్తిని పార్లమెంట్ సభ్యుడిగా ఎంచుకుంటే ఆయన నెల్లూరు జిల్లా అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందిస్తారని చెప్పారు. రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మాజీ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన నాలుగేళ్లలో రాజు జిల్లాలో అనేక సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. ఒక మంచి ఐఏఎస్ అధికారి ఎంపీ ఎన్నికల్లో నిలిచారని, అలాంటి వ్యక్తికి చేయూత నందించేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. రాజుకు నెల్లూరు జిల్లాతో తీరని అనుబంధం ఉందని, అలాంటి మేధావిని గెలిపించాలని కోరారు.

తమిళ కుటుంబాలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలి

● కాంగ్రెస్ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు సెల్వీ పెరుందరై

నెల్లూరు (వైద్యం), మే 3 : నెల్లూరు నగరంలో తమిళులు ఎక్కువగా ఉన్నారని, వారు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు సెల్వీ పెరుందరై పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నో తమిళ కుటుంబాలు వ్యాపారం కోసం నెల్లూరు జిల్లాలో నివసిస్తున్నాయని చెప్పారు. నగరం లోనే పెద్ద సంఖ్యలో తమిళులు ఉన్నారని, వారికి ప్రభుత్వం ఓటు హక్కు కూడా కల్పించింద న్నారు. వారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు అండగా నిలిచి ఓటు హక్కును వినియోగించుకోవా లని కోరారు. ఎంపీగా కొప్పుల రాజు, రూరల్ ఎమ్మెల్యేగా షేక్ ఫయాజ్‌ను గెలిపించాలన్నారు. తమిళ కుటుంబాలతోపాటు తెలుగువారు కూడా పార్టీ అభ్యర్థులకు మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థి ఫయాజ్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం కోసమే కూటమి : టీడీపీ నేత అబ్దుల్ అజీజ్

నెల్లూరు (వైద్యం), మే 3 : వ్యక్తిగత లాభాలు పక్కన పెట్టి, రాష్ట్ర ప్రజల కోసం టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమిగా ఏర్పడ్డాయని టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ తెలిపారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, రాష్ట్ర ప్రజల మనోభావాలతో జగన్మోహన్‌రెడ్డి ఆడుకుంటున్నారని విమర్శించారు. యువత, వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారన్నారు. వైసీపీ నాయకుల అరాచకాలకు అనేక పరిశ్రమలు వెనక్కు వెళ్లాయని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమానికి సమానంగా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. టీడీపీ, జనసేన అధినేతలు నెల్లూరుకు రావటం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సుందరరామిరెడ్డి, జనసేన సుజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు గుర్తింపునిస్తా : శ్రీధర్‌రెడ్డి


సాజిద్ మిత్రబృందాన్ని పార్టీలోకి ఆహ్వానిస్తున్న రూరల్ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మే 3 : ఎన్నికలకు ముందు తనను నమ్మి కష్టాలను ఎదిరించి అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు అధికారంలోకి వచ్చాక తగిన గుర్తింపునిస్తానని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని ఆయన కార్యాలయంలో 23వ డివిజన్ పడారుపల్లికి చెందిన మదీనా ఆటోమొబైల్స్ అధినేత సయ్యద్ సాజిద్ మిత్రబృందాన్ని కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలోనే టీడీపీకి బలమైన పునాదులున్న నియోజకవర్గాల్లో నెల్లూరు రూరల్ ఒకటన్నారు. ఇందుకు కష్టపడి పని చేసే కార్యకర్తలుండటమే కారణమని తెలిపారు. తనను ఎమ్మెల్యేగా కాకుండా కుటుంబ సభ్యుడిగా చూసుకునే ప్రజలు దొరకడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఒక్కరు సైకిల్ గుర్తుకు ఓటేసి రాష్ట్రంలో చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువు తీరాక ఏపీలో ప్రజారంజక పాలన సాగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం కలివెలపాళేనికి చెందిన దేవిరెడ్డి దశరథ రామిరెడ్డి, పాములూరు శ్రీనివాసులు, 17వ డివిజన్‌కు చెందిన నాసిన శ్రీహరి, దాసరి రమేష్, మల్లిపెద్ది నాగరాజు, అన్నం మనోజ్‌లను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

● **చంద్రబాబు రోడ్ షోకు భారీగా శ్రేణులు**

నెల్లూరులో శుక్రవారం నిర్వహించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రోడ్ షోకు ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. నెల్లూరు రూరల్‌లోని గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో నెల్లూరుకు చేరుకున్నారు. కేవీఆర్ పెట్రోల్ బంకు కూడలి నుంచి వీఆర్సీ సెంటరు వరకు జరిగిన రోడ్ షోలో వీరంతా పాల్గొన్నారు.

ఆహ్లాదం.. అధ్వానం!



● టీడీపీ హయాంలో భారీగా పార్కుల అభివృద్ధి
● నిర్లక్ష్యం చేసిన వైసీపీ పాలకులు
● నాడు సందడి.. నేడు శిథిలం

నగర వాసులకు ఆహ్లాదాన్ని, ఆటవిడుపును అందించాల్సిన పార్కులు పాలకుల నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా, కళావిహీనంగా మారాయి. టీడీపీ గత ప్రభుత్వంలో నగరంలో పెద్ద ఎత్తున పార్కులను అభివృద్ధి చేశారు. నుడా ఆధ్వర్యంలో 24 చోట్ల ఖాళీ స్థలాలను పార్కులు గా మార్చడమేకాక వాటిలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌తోపాటు పిల్లల ఆటవస్తువులను ఏర్పాటు చేశారు. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో సేదతీరేందుకు, వ్యాయామానికి ఈ పార్కులు ఎంతో ఉపయోగపడేవి. వ్యాయామం కోసం ప్రైవేటు జిమ్‌లకు వెళ్లి ఫీజులు చెల్లించే అవసరం లేకుండా ఈ పార్కులు వ్యాయామానికి సౌకర్యంగా ఉండేవి. దీంతో అధిక సంఖ్యలో నగరవాసులు పార్కులకు తరలివచ్చేవారు. ఉదయం సాయంత్రం వేళల్లో పిల్లలు, పెద్దలతో పార్కులు సందడిగా ఉండేవి. అయితే వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నగరంలోని నెక్లెస్‌రోడ్డుతోపాటు పార్కులపైనా నిర్లక్ష్యపు నీడ అలుముకుంది. పార్కుల అభివృద్ధిని, నిర్వహణను పాలకులు విస్మరించారు. ఫలితంగా చాలా పార్కులు శిథిలావస్థకు చేరుకున్నాయి.

నగరంలోని ఎఫ్‌సీఐ కాలనీ, ఎన్టీఆర్ నగర్, జగదీష్ నగర్ తదితర ప్రాంతాల్లోని పార్కులు కళాహీనంగా మారాయి. పలు పార్కులలోని ఆట వస్తువులు, ఓపెన్ జిమ్ పరికరాలు దెబ్బతిని నిరుపయోగంగా మారాయి. యంత్రాంగం వాటిని పట్టించుకోకపోవడంతో మూలనపడ్డాయి. తగిన పర్యవేక్షణ లేకపోవడం వల్ల పార్కులు రాత్రివేళ మందుబాబులు, అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయి.

- నెల్లూరు (జడ్పీ)

మినీ బైపాస్‌లోని ఎన్టీఆర్ థీమ్ పార్కును టీడీపీ హయాంలో 90 శాతంపైగా పూర్తి చేయగా అప్పట్లో ఎన్నికలు రావడంతో మిగిలిన పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ నాయకులు నాలుగేళ్లు ఈ పార్కును పట్టించుకోలేదు. ఎట్టకేలకు ఇటీవల దాన్ని ప్రారంభించినప్పటికీ ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసిన థీమ్‌పార్కు సైతం నిరుపయోగంగానే ఉంటోంది.



ఇదీ పార్కే!

నగరంలో బారా షహీద్ దర్గా ప్రాంగణంలో స్వర్ణాల చెరువు తీరాన పర్యాటక శాఖ బోటింగ్ క్లబ్ ఆవరణలోనిది ఈ పార్కు. ఒకప్పుడు చల్లటి నీడనిచ్చే చెట్లు, మెత్తని తివాచీ లాంటి పచ్చిక, కూర్చునే బల్లలు, ఆట వస్తువులతో అందంగా ఉండేది. ఇప్పుడు విరిగిన చెట్ల కొమ్మలు, దెబ్బతిన్న పిల్లల ఆట పరికరాలు, గుబురుగా పెరిగిన పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తోంది. దీంతో సేదతీరడానికి ఈ పార్కువైపు ఏ కుటుంబమూ రావడం లేదు.

భగవద్రామానుజుల తిరునక్షత్ర ఉత్సవాలు ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), మే 3 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో భగవద్రామానుజుల స్వామి తిరునక్షత్ర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తిరుమంజనం సేవలు జరిగాయి. సాయంత్రం మంగళ శాసనోత్సవాలు, అనంతరం పేట ఉత్సవం జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు, సహాయ కమిషనర్ ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

లౌకికత్వాన్ని కాపాడటమే జాకీర్‌హుస్సేన్‌కు నివాళి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు (వైద్యం), మే 3 : లౌకికత్వాన్ని కాపాడటమే మాజీ రాష్ట్రపతి జాకీర్‌హుస్సేన్‌కు ఇచ్చే ఘన నివాళి అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ వెల్లడించారు. శుక్రవారం జాకీర్‌హుస్సేన్ 55వ వర్ధంతి సందర్భంగా వెంకటేశ్వరపురంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాలర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మాగాంధీ, నెహ్రూతో కలిసి జాకీర్ హుస్సేన్ పోరాడారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మూడవ రాష్ట్రపతిగా పనిచేశారని చెప్పారు. అవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ మాట్లాడుతూ జాకీర్‌హుస్సేన్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి చంద్ర రాజగోపాల్, అవాజ్ నాయకులు రియాజ్, షబ్బీర్, సయ్యద్ రహంతుల్లా, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల నివాళి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మే 3 : వెంకటేశ్వరపురం కూడలిలో గల జాకీర్‌హుస్సేన్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసాపురం ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. భారతదేశం నా ఇల్లు, ప్రజలందరూ నా కుటుంబం అని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి జాకీర్‌హుస్సేన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరిముల్లా, బాబు, మీరా మొహిద్దీన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌కు ఓటెయ్యండి

నారాయణ కుమార్తెలు సింధూర, శరణి


మహిళకు కరపత్రమిచ్చి ఓటు కోరుతున్న సింధూర


ఎన్నికల ప్రచారంలో శరణి


నెల్లూరు (వైద్యం), మే 3 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పొంగూరు నారాయణ విజనరీ లీడర్స్ అని వారి సారథ్యంలోని టీడీపీ అభ్యర్థులకు ఓటెయ్యాలని నారాయణ కుమార్తె పొంగూరు సింధూర కోరారు. శుక్రవారం నగరంలోని 7వ డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటు వెయ్యాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీ పాలనలో మహిళలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోలో మహిళలకు ఎన్నో వరాలు ప్రకటించారని చెప్పారు. నెల్లూరులో నారాయణ ముస్లిం మహిళల కోసం ప్రత్యేక కళాశాల ప్రారంభించిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఐదేళ్లుగా ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వలేదని, వారికి రావాల్సిన బెనిఫిట్స్ రాలేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని సక్రమంగా అందిస్తామని చెప్పారు. ఈ నెల 13న జరిగే ఓటింగ్‌లో సైకిల్ గుర్తుపై ఓటేసి ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణను గెలిపించాలని కోరారు.

పిల్లల భవిష్యత్తు కోసం...

మీ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు, నారాయణను గెలిపించాలని నారాయణ మరో కుమార్తె పొంగూరు శరణి ఓటర్లను కోరారు. నగరంలోని 9వ డివిజన్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సైకిల్ గుర్తుకు ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు. కరోనాతో మరణించిన వారి కుటుంబానికి వైసీపీ ప్రభుత్వం కనీసం బీమా నగదు కూడా అందించలేదని విమర్శించారు. నగరంలో ఎక్కడ చూసినా కాలువలు, రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. గతంలో తనతండ్రి మంత్రిగా ఉన్నప్పుడు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని ఏర్పాటు చేసి దోమల రహిత నగరంగా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. 90 శాతం పూర్తయిన ఆ పనులను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే పెండింగ్ పనులు పూర్తి చేస్తారని చెప్పారు. టీడీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా పొంగూరు నారాయణ, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామవరపు రాజశేఖర్, కువ్వారపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మోదీ, జగన్ అధికారంలోకి రారు..

● కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



నెల్లూరు (సాంస్కృతికం), మే 3 : ప్రజల్లో మార్పు వచ్చిందని కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో జగన్ తిరిగి అధికారంలోకి రారని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ తెలిపారు. శుక్రవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేజ్రీవాల్‌ని అరెస్టు చేసిన తర్వాత మోదీ విలువ పూర్తిగా దిగజారిపోయిందని తెలిపారు. ఆయన కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని, ప్రజల్లో మార్పు వచ్చిందన్నారు. ప్రధాని చేస్తున్న ప్రసంగాలు సర్పంచి స్థాయికి దిగజారిపోయాయన్నారు. రాష్ట్రంలో జగన్ పరిస్థితి కూడా అలాగే ఉందన్నారు. బాబాయిని హత్య చేసిన సంఘటనపై సొంత చెల్లెలు అడుగుతున్న ప్రశ్నలకు జవాబు చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. మైనారిటీలు, క్రిస్టియన్లు, ఇతర బలహీన వర్గాల ప్రజలు జగన్‌కు దూరమవుతున్నారని చెప్పారు. పట్టణ ప్రాంత ఓటర్లు జగన్‌కు పూర్తిగా వ్యతిరేకంగా మారారన్నారు. గతంలో 150 సీట్లు సాధించిన వైసీపీ, ఈ సారి 30లోపు సీట్లకే పరిమితం కాబోతోందని జోస్యం చెప్పారు. 100 ఏళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ కావాలని ప్రజలు కోరుతున్నారన్నారు. ఈ సమావేశంలో సర్వేపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నరకానికి సిద్ధం

● నేటి సాయంత్రం సీఎం నగరానికి రాక
● జగనన్న కోసం బారికేడ్ల ఏర్పాటు
● భారీగా పోలీసు బందోబస్తు ● ప్రజలకు తప్పని ఇక్కట్లు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట). మే 3: అన్న వస్తే ప్రజలకు అవస్థలు తప్పవు... ఇప్పటివరకు అన్న వస్తే అన్ని మూసేస్తాం.. పరదాలు కట్టేస్తాం.... అన్న కథనాలను మీడియోలో మాత్రమే చూసిన నెల్లూరు నగర ప్రజలు శనివారం ఆ ఇబ్బందులను ప్రత్యక్షంగా అనుభవిం చనున్నారు. శుక్రవారం నగరంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల రోడ్‌షో కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి నర్తకి సెంటర్ వరకు సాగింది. నర్తకి సెంటర్‌లో సభ నిర్వహించగా ప్రశాంతంగా సాగింది. రోడ్డుకు అటువైపు ఇటువైపు డివైడర్లపై ప్రజలు నిల్చొని ఎంతో ఆనందంగా చేతులు ఊపుతూ కన్పించారు. అయితే జగనన్న శనివారం సాయంత్రం నగరానికి వస్తుండటంతో శుక్రవారం రాత్రి నుంచే నగరంలో బారికేడ్లు ఏర్పాటు చేయడం ప్రారంభించారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు రోడ్డు దాటే అవకాశం లేకుండా పోయింది.దీంతో వైద్యశాలలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శనివారం సాయంత్రం జగన్మోహన్‌రెడ్డి పర్యటన ఉంటే శుక్రవారం రాత్రి నుంచే బ్యారికేడ్లు ఏర్పాటు చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంకటరమణ హోటల్ సెంటర్‌లో బారికేడ్ల ఏర్పాటును స్థానికులు అడ్డుకున్నారు. ఇక జగన్మోహన్‌రెడ్డి పర్యటన కోసం భారీగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.






పొరపాట్లు లేకుండా ఎన్నికలు

● కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(హరనాథపురం), మే 3 : సాధారణ ఎన్నికలను ఎలాంటి పొరపాట్లు లేకుండా సజావుగా నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరం లోని డీకే కళాశాలలో పోలింగ్ అధికారులు, సహాయపోలింగ్ అధికారులకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, వీవీ ప్యాట్స్ నిర్వహణపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో అన్ని విషయాలను క్షుణ్ణంగా తెలుసుకొని, ఎన్నికలను పొరపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వెంకటేశ్వరపురంలోని ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును తనిఖీ చేశారు కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా, జేసీ సేతుమాధవన్ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీకి ఈసీ షాక్

తిరుపతి, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వంద శాతం వెబ్ కాస్టింగ్‌కు ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయం వైసీపీ వర్గాలకు షాక్ ఇచ్చింది.అదే సమయంలో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు, శ్రేణులకు మాత్రం భారీ ఊరట కల్గించింది. ఈ రెండు నియోజకవర్గాల్లో 13వ తేదీన జరిగే పోలింగ్ సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేయనున్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద టాప్ ప్రయారిటీతో కేంద్ర బలగాలను నియమించనున్నారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అక్రమాలు, శాంతిభద్రతల సమస్యలూ తలెత్తకుండా కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం మేరకు సంబంధిత ఏర్పాట్లలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఈసీ ఆదేశాలతో చంద్రగిరి, తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





- తిరుపతి, చంద్రగిరిల్లో వంద శాతం వెబ్ కాస్టింగ్
- గత చరిత్ర, పరిశీలకుల సిఫార్సుతో ఈసీ నిర్ణయం
- పారదర్శకంగా పోలింగ్ జరిగేందుకు అవకాశం

వెబ్ కాస్టింగ్ అంటే....

రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల పరిశీలకులు తమ కార్యాలయాల నుంచే ఎక్కడో వున్న పోలింగ్ కేంద్రాల్లో జరిగే పోలింగ్ ప్రక్రియ మొత్తాన్నీ ప్రత్యక్ష ప్రసారం ద్వారా పరిశీలించే అవకాశం వెబ్ కాస్టింగ్ ద్వారా కలుగుతుంది. పోలింగ్ కేంద్రాల్లోకి ఓటు వేయడానికి వచ్చే ఓటర్లను వెబ్ కెమెరా ద్వారా అధికారులు తమ కార్యాలయాల నుంచే చూడగలుగుతారు.ఓటర్ల రాకపోకల సరళిని తెలుసుకోగలుగుతారు. బూత్ కాప్చరింగ్, నగదు పంపిణీ, బోగస్ ఓటింగ్ వంటివి జరిగితే గుర్తించే వీలుంటుంది. రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారి, పరిశీలకులు వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో జరిగే పోలింగ్ ప్రక్రియను లైవ్‌లో చూడగలిగే అవకాశమున్నందున అటు పోలింగ్ అధికారులు, సిబ్బంది, ఇటు ఆ ప్రాంతంలో ప్రాబల్యమున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఎలాంటి తప్పిదాలకూ పాల్పడకుండా అప్రమత్తంగా వ్యవహరించడానికి దోహదపడుతుంది. ఒకవేళ తప్పిదాలకు పాల్పడినా ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకునే వీలుంటుంది.

ఈసీ ఆదేశించక మునుపే....

చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో వెబ్ కాస్టింగ్‌కు ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయకమునుపే జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు చేసింది. జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 2140 వుండగా అందులో 696 కేంద్రాలు సమస్యాత్మకమైనవని జిల్లా యంత్రాంగం గుర్తించింది. అంతకంటే ఎక్కువగానే 1237 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ప్రతిపాదించింది. 890 మంది వీడియోగ్రాఫర్లు కూడా అవసరమని గుర్తించింది. చంద్రగిరి నియోజకవర్గంలో 397 పోలింగ్ కేంద్రాలుంటే అందులో 202 సమస్యాత్మకంగానూ, మరో 15 అత్యంత సమస్యాత్మకంగానూ వున్నాయి. అయితే 330 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు యంత్రాంగం మునుపే ప్రతిపాదించింది. ఈ నియోజకవర్గంలో 220 మంది వీడియోగ్రాఫర్ల అవసరముందని గుర్తించింది. అలాగే తిరుపతి నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలుంటే అందులో 86 సమస్యాత్మకం. ఈ సెగ్మెంట్‌లో కూడా 177 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ అవసరమని జిల్లా యంత్రాంగం ప్రతిపాదించింది. 110 మంది వీడియోగ్రాఫర్లను ఏర్పాటు చేయాల్సి వుందని కూడా ప్రతిపాదనలు పంపించింది.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు ఇలా...

పోలింగ్ కేంద్రాల నుంచీ పర్యవేక్షక అధికారులకు లైవ్ బ్రాడ్‌కాస్టింగ్ జరపడమే వెబ్ కాస్టింగ్ పనిగా వుంటుంది. పోలింగ్ కేంద్రాల్లో మూడు రకాలుగా వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయవచ్చు. ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ పర్సనల్ కంప్యూటర్‌ను వెబ్ కెమెరా, ఇంటర్నెట్‌లతో వినియోగించవచ్చు. అలాగే సీసీటీవీ హైబ్రిడ్ సెటప్ మరియు ల్యాప్‌టాప్ లేదా పర్సనల్ కంప్యూటర్ ద్వారా అయినా వెబ్ కాస్టింగ్ చేయవచ్చు. మరో విధంగా ల్యాప్‌టాప్ లేదా పర్సనల్ కంప్యూటర్‌ను ఇంటర్నెట్ సదుపాయం కలిగిన మొబైల్ ఫోన్‌తో కనెక్ట్ చేసి వాడచ్చు. కాగా పోలింగ్ కేంద్రంలో ఇంటర్నెట్ సదుపాయం లేకుంటే యూఎస్‌బీ మోడెమ్ గానీ లేదా మొబైల్ ఇంటర్నెట్ గానీ వాడడానికి వీలుంటుంది.

వంద శాతం వెబ్ కాస్టింగ్‌కు కారణాలివే!

చంద్రగిరి, తిరుపతి నియోజకవర్గాల్లో వంద శాతం వెబ్ కాస్టింగ్‌కు ఈ రెండు నియోజకవర్గాలలో నెలకొన్న అరాచక పరిస్థితులే కారణమయ్యాయి. చంద్రగిరి విషయానికొస్తే 50 శాతం పోలింగ్ కేంద్రాలు ఇప్పటికే సమస్యాత్మకంగా వున్నాయి. మరో 15 కేంద్రాలు తీవ్ర సమస్యాత్మకం. ఈ 15 కేంద్రాల్లో గత ఎన్నికల్లో ఘర్షణలు, రీ పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ కారణంగా ఈసీ నిర్ణయానికి మునుపే జిల్లా యంత్రాంగం మొత్తం 397 కేంద్రాలకు గానూ 85 శాతం అంటే 330 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు ప్రతిపాదించింది. మరోవైపు అధికార పార్టీ నేతలు ఓటర్ల జాబితా తయారీ దశ నుంచీ అక్రమాలకు పాల్పడుతున్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు పెద్దఎత్తున ఆధారాలతో ఈసీకి ఫిర్యాదులు చేశారు. కింది స్థాయి ఉద్యోగుల నుంచీ డివిజన్ స్థాయి అధికారుల వరకూ అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని కూడా ఫిర్యాదులు చేశారు. ఇక తిరుపతి విషయానికొస్తే ఎంపీ ఉప ఎన్నికల్లో 36 వేల ఎపిక్ కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేయడం, వాటికి డూప్లికేట్ కార్డులు తయారు చేయడం, భారీ ఎత్తున దొంగ ఓటర్లను రంగంలోకి దించి వారితో ఓట్లు వేయించడం తెలిసిందే. అధికార పార్టీ నేతలు రూపొందించిన ఈ ప్రణాళికలో కంప్యూటర్ ఆపరేటర్లు మొదలుకుని, డీటీ, తహసిల్దారు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, చివరికి అప్పట్లో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన కలెక్టర్ స్థాయి అధికారి వరకూ సస్పెన్షన్ వేటుకు గురయ్యారు. దొంగ ఓటర్ల విషయంలో నమోదైన కేసుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు పోలీసు అధికారులు కూడా సస్పెండయ్యారు. ఎపిక్ కార్డుల డౌన్‌లోడ్, డూప్లికేట్ ఓటరు కార్డుల తయారీకి సంబంధించి పలు కేసులు కూడా నమోదయ్యాయి. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తిరుపతి కేంద్రంగా పలు అక్రమాలు జరిగిన సంగతి తెలిసిందే. తాజా ఎన్నికల్లో కూడా అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలకు, అక్రమాలకు పాల్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష నేతలు, అభ్యర్థులు ఈసీకి ఫిర్యాదు చేశారు. మరోవైపు జిల్లాలో ఇటీవల పర్యటించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు కూడా ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఈసీ చంద్రగిరి, తిరుపతిలలో వంద శాతం వెబ్‌కాస్టింగ్‌కు ఆదేశాలిచ్చింది.

ఈసీ ఆదేశాలతో మారుతున్న సమీకరణలు

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఈసీ ఆదేశాలతో వంద శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాటు, గరిష్ఠ స్థాయిలో కేంద్ర సాయుధ బలగాలను మొహరించనుండడంతో ఆ మేరకు రాజకీయ సమీకరణలు కూడా మారనున్నాయి. ఈసీ ఆదేశాలు అధికార పార్టీ నేతలకు మింగుడు పడడం లేదు. పోలింగ్ కేంద్రాల వద్ద కండబలంతో పైచేయి సాధించడానికి, దొంగ ఓటర్లను రంగంలోకి దింపడానికి అవకాశాలుండవు. స్థానికంగా అధికార పార్టీ నాయకులు ఎవరో, కార్యకర్తలెవరో కేంద్ర బలగాలు గుర్తించే పరిస్థితి వుండదు. అధికార పార్టీ నేతల ఆదేశాలను ఖాతరు చేసే పరిస్థితి అంతకంటే వుండదు. దీనివల్ల పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలు నియంత్రణలో వుండే అవకాశముంది. వెబ్ కాస్టింగ్ వల్ల దొంగ ఓట్లు, రిగ్గింగ్ వంటివాటికి వీల్లేకుండా పోతోంది. ఈ పరిణామాలు వారికి ఏమాత్రం మింగుడుపడడం లేదు. అదే సమయంలో ఈసీ నిర్ణయంతో ప్రతిపక్షపార్టీల అభ్యర్థులు, శ్రేణులు ఊపిరి తీసుకుంటున్నాయి. ఇది వారికి పెద్ద ఊరటగా మారుతోంది. వీరి అభిప్రాయాలెలా వున్నా పారదర్శకంగా పోలింగ్ జరిగే పరిస్థితులు నెలకొనడం పట్ల సామాన్య జనంలో కూడా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గరిష్ఠంగా కేంద్ర బలగాలు

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులను గుర్తించిన ఈసీ ఆ రెండు చోట్లా స్థానిక పోలీసు బలగాలతో పాటు కేంద్ర బలగాలను నియమించాలని ఆదేశించింది. అది కూడా పోలింగ్ రోజున కేంద్ర బలగాలను గరిష్ఠస్థాయిలో ఈ రెండు చోట్లా వినియోగించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే జిల్లాలో సివిల్ పోలీసులు, హోమ్ గార్డులకు అదనంగా బీఎస్ఎఫ్ మూడు కంపెనీలు (240 మంది), సీఆర్‌పీఎఫ్ మూడు కంపెనీలు (అండమాన్ నుంచీ వచ్చిన 225 మంది), సీఐఎస్ఎఫ్ మూడు కంపెనీలు (230 మంది) చొప్పున మొత్తం 695 మందితో కూడిన కేంద్ర బలగాలు విధుల్లో వున్నాయి. తాజాగా ఈసీ ఆదేశాలతో మరిన్ని కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు వచ్చే అవకాశముంది.

రెక్కలు రాలుతున్న ఫ్యాను

- ఎన్నికలకు ముందు నగరి వైసీపీకి కోలుకోలేని దెబ్బ
- పార్టీకి రాజీనామా చేసిన శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ తదితరులు
- త్వరలోనే టీడీపీ తీర్థం పుచ్చుకునే అవకాశం?



పుత్తూరు అర్బన్, మే 3: ఎన్నికలకు ముందు నగరి వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. కీలక నాయకులు వరుసపెట్టి పార్టీని వీడుతుండడంతో వైసీపీ పునాదులు కదులుతున్నాయి. ఇటీవల పుత్తూరుకు చెందిన మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై మొదలియార్ వైసీపీకి రాంరాం చెప్పి చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం రాత్రి వడమాలపేటకు చెందిన జడ్పీటీసీ మురళీధర రెడ్డిని పట్టుబట్టి మరీ వైసీపీ అభ్యర్థి, మంత్రి రోజా పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సంచలనం కలిగించే పరిణామం చోటు చేసుకుంది. మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి అన్న కుమారుడు శ్రీశైలం ఆలయ మాజీ చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, విజయపురానికి చెందిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీపతి రాజు,జడ్పీటీసీ మురళీధర రెడ్డి, నిండ్ర మండలానికి చెందిన కొప్పేడు ఎంపీటీసీ రెడ్డివారి భాస్కరరెడ్డి, చవరంబాకం ఎంపీటీసీ టి.విజయ, శ్రీరామాపురం సర్పంచ్ జయమ్మ,ఈఎన్ కండ్రిగ సర్పంచ్ జయచంద్రారెడ్డి, కైపాకం సర్పంచ్ ఏజే ప్రభాకర్, కొప్పేడు సర్పంచ్ సంపూర్ణమ్మ వైసీపీకి గుడ్‌బై చెప్పారు.ఈ నెల 5వ తేదీన తామంతా టీడీపీలో చేరుతున్నట్టు తిరుపతిలో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు.పైగా వడమాల పేట టోల్ గేట్ వద్ద స్థలాలను రోజా కబ్జా చేయడాన్ని ప్రశ్నించినందుకే తమపై ఆమె కక్ష కట్టారని, సీఎం రిలీఫ్ ఫండ్‌లోనూ బాధితుల నుంచీ రోజా కమీషన్ల రూపంలో దండుకున్నారని ఆరోపించారు. రోజా చేసిన అవినీతి అక్రమాలపై కాణిపాక వినాయకుడి సన్నిధిలో తాము ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. చంద్రముఖిలా మారిన రోజాను నగరి నుంచీ ఓటు అనే ఆయుధంతో తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు.దీంతో నగరి నియోజకవర్గంలో వైసీపీకి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయనే అభిప్రాయాలు పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నాయి.



వైసీపీకి రాజీనామా చేసినట్లు చూపుతున్న పత్రాలతో వైసీపీ నేతలు

భాను వ్యూహం ముందు రోజా చిత్తు

నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ వ్యూహం ముందు మంత్రి రోజా విలవిల్లాడుతున్నట్టవుతోంది.అసమ్మతి నాయకులను టీడీపీ వైపు ఆకర్షించడంలో ఆయన సక్సెస్ అయ్యారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ముందస్తు ప్రణాళికతో వ్యవహరిస్తూ వైసీపీని చావు దెబ్బ కొట్టారనే ప్రచారం నియోజకవర్గవ్యాప్తంగా సాగుతోంది.

రోజా వ్యవహారశైలితోనే

ఐదేళ్ల నుంచి మంత్రి రోజా వ్యవహారశైలితో విసుగు చెందిన నాయకులు కీలకమైన ఎన్నికలకు ముందు ఒక్కొక్కరుగా బయటకు వెళుతుండడం అధికార పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఐదు మండలాలకు చెందిన కీలక నాయకులు మూడు మాసాల నుంచి రోజా అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ అధిష్ఠానానికి పలుమార్లు మొరపెట్టుకున్నారు.అయితే వీరి అభిప్రాయాలను తోసిపుచ్చిన వైసీపీ పెద్దలు తిరిగి రోజాకే నగరి టికెట్ ఇవ్వడంతో జీర్ణించుకోలేకపోయారు. దీనికి తోడు వైసీపీ అధిష్ఠానం కూడా అసమ్మతి నాయకులతో సయోధ్య కుదుర్చుకునేందుకు రోజాను ఒప్పించడంలో ఘోరంగా విఫలమైంది. రోజా కుటుంబ దౌర్జన్యాలు ,అవినీతి, బెదిరింపుల నుంచి నియోజకవర్గ ప్రజలను కాపాడుకోవాలనే లక్ష్యంతోనే వైసీపీని వీడుతున్నట్లు శుక్రవారం రాజీనామాలు చేసిన నాయకులు తిరుపతి మీడియా సమావేశంలో ప్రకటించడం విశేషం. తాము రోజా ఓటమికి కీలకం కానున్నామనే పరోక్ష సంకేతాలను వారు స్పష్టంగా ఇచ్చారు.

మాకేం మేలు చేశారని వచ్చారు?

మంత్రి రోజా ప్రచారాన్ని అడ్డుకున్న వేమాపురంవాసులు





వైసీపీ నేతలను అడ్డుకుంటున్న వేమాపురంవాసులు - ఇళ్ల తలుపులు మూసుకుని గ్రామస్తుల నిరసన

వడమాలపేట, మే 3 : వైసీపీ ప్రచారాన్ని గ్రామస్తులంతా కలసి అడ్డుకున్న సంఘటన శుక్రవారం రాత్రి వడమాలపేట మండల పరిధిలో జరిగింది.పూడి పంచాయతీ వేమాపురం గ్రామానికి ఎన్నికల ప్రచారంలో భాగంగా వైసీపీ అభ్యర్థి రోజా వస్తున్నారని తెలపడానికి ముందుగా ప్రచార రథం వచ్చింది.అయితే తమ గ్రామానికి ఆమె ఏమి మేలు చేసిందని ప్రచారానికొస్తుందని గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రచారరథాన్ని గ్రామంలోకి రాకుండా అడ్డుకున్నారు. ఈ విషయం తెలిసి పక్క గ్రామంలో ఉన్న రోజా వేమాపురంలో ప్రచారం నిర్వహించేందుకు పోలీసులు సహాయం తీసుకున్నట్లు సమాచారం. అప్పటికీ గ్రామస్తులు శాంతించకపోవడంతో ప్రచారరథం వెనుదిరిగింది.ఇంత జరిగినా రోజా శుక్రవారం 9.30గంటలకు వేమాపురంలోకి అడుగు పెట్టింది. పోలీసుల సహాయంతో ప్రచార రథం పైకెక్కి ఓట్లను అభ్యర్థించే ప్రయత్నం చేసింది.అయితే అప్పటికే గ్రామస్తులు ఇళ్లలోకి వెళ్లిపోయి తలుపులు మూసేసి నిరసన తెలిపారు.దీంతో రోజా వెనుదిరిగారు.

చిన్న గాలివానకే కూలిన జగనన్న ఇళ్లు



డక్కిలి, మే 3 : చిన్న గాలివానకే జగనన్న కాలనీలో ఇళ్ల గోడలు కూలాయి. డక్కిలి మండలం నాగవోలు గ్రామానికి చెందిన వేముల శిల్ప, ఏరుక మస్తాన్, శివకుమార్‌కు ఈ ఏడాది జగనన్న కాలనీ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిని కట్టించే బాధ్యతను సచివాలయంలో పని చేసే ఇంజనీరింగ్ అసిస్టెంటు చంద్రశేఖర్ తీసుకున్నారు. స్లాబ్ మట్టం వరకు పనులు పూర్తయ్యాయి. శుక్రవారం సాయంత్రం గాలితో పాటు చిన్న పాటి వర్షం కురిసింది. దీనికే మూడు ఇళ్ల గోడలు ఒక వైపు కిందపడిపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. చిన్నపాటి గాలికే గోడలు కూలిపోతే ఇక ఇల్లు పూర్తి చేస్తే ఎలా నివాసం ఉంటామంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

పింఛను తిప్పలు



నాయుడుపేటలో బ్యాంకులు తెరవకముందే పడిగాపులు కాస్తున్న వృద్ధులు

తిరుపతి(కలెక్టరేట్), మే 3:పింఛను తిప్పలు శుక్రవారం కూడా కొనసాగాయి.పెన్షన్ తీసుకుందామని బ్యాంకుల వద్దకు వచ్చిన వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు ఎండల దెబ్బకు విలవిలలాడిపోయారు.శుక్రవారం నాటికి 69,522మందికి గాను 66వేలమందికి ఇంటి వద్దే పింఛను అందజేసినట్లు డీఆర్డీఏ అధికారులు తెలిపారు. బ్యాంకు ఖాతాల ద్వారా 1,97,500మందికి నగదు జమయిందని చెప్పారు.మరో 3,500మందికి బ్యాంకు ఖాతాలకు జమ కాలేదని, వారికి శనివారం పంపిణీ చేస్తామని వివరించారు.

8న ప్రధాని రాక

తిరుపతి(కలెక్టరేట్), మే 3: ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 8న తిరుపతికి రానున్నారు. బుధవారం మధ్యాహ్నం రేణిగుంటలోని విమానాశ్రయం చేరుకునే ఆయన అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గ పరిధిలో జరిగే సభలో చంద్రబాబు,పవన్‌కల్యాణ్‌లతో కలిసి పాల్గొంటారు.



అమ్మయ్యా.. నీడ దొరికింది !

మాడు పగిలే ఎండతో ఎన్నికల ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు అల్లాడిపోతున్నారు. మూడు నాలుగు రోజుల నుంచి జిల్లాలో సరాసరిన 45డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఈ క్రమంలో కలువాయి మండలం కుల్లూరులో వెంకటగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఉదయం 11గంటలకు ఎస్సీ కాలనీలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఎండ తీవ్రంగా ఉండటంతో పాల్గొన్న జనం కూడా ఉండలేక పరిగెత్తారు. అయితే అక్కడ పెద్ద చెట్లు కనిపించడంతో అమ్మయ్యా.. నీడ దొరికిందని సేదతీరారు.

- కలువాయి

రూ.10 వేలిచ్చి.. పదింతల దోపిడీ

వాహనమిత్ర పేరుతో ఇచ్చేది నామమాత్రమే

పథకంలో పలు కొర్రీలు

కుడిచేత్తో చేసిన దానం.. ఎడమ చేతికి కూడా తెలియకూడదంటారు పెద్దలు... కానీ జగన్ ప్రభుత్వం కుడిచేత్తో సాయం చేసి, ఎడమ చేత్తో అంతకురెట్టింపు మొత్తాన్ని లాగేసుకుంటోంది. ఇందుకు ఆటో డ్రైవర్లే ప్రత్యక్ష నిదర్శనం. వాహనమిత్ర పేరిట వారికి ఏటా రూ. 10 వేల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేలు ఇచ్చామని గొప్పలు చెబుతున్న జగన్ ప్రభుత్వం తెరవెనుక నుంచి ఎంత దోచుకుందో తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే...!





- ఐదేళ్లుగా జరిమానా చెల్లించలేకున్న ఆటోడ్రైవర్లు
- ఓ చేత్తో సాయం.. మరో చేత్తో బాదుడు
- ఇదేనా జగనన్న రాజ్యం ?

సంగం, మే 3 : జిల్లాలో ఎంతోమంది నిరుద్యోగులు ఆటోడ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. కొందరికి సొంత ఆటోలు ఉండగా, మరి కొంతమంది అద్దెకు తీసుకుని నడుపుతున్నారు. జిల్లాలో వేల సంఖ్యలో ఆటోలు ఉన్నాయి. ఒక్కో ఆటోవాలాకు ప్రభుత్వం ఏడాదికి రూ. 10 వేల చొప్పున వాహనమిత్ర కింద ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. అయితే పథకం అమలులో అనేక కొర్రీలు పెట్టి ఎంతోమందికి అందకుండా చేసింది. వాస్తవానికి ఈ ఐదేళ్లల్లో ఆటోవాలాలపై వివిధ జరిమానా, లైసెన్సులు, డీజిల్‌పై బాదుడుతో ప్రభుత్వం ఏటా రూ. వేలల్లో వారి వద్ద నుంచి లాక్కుంది.

● జరిమానాల దోపిడీ ఇలా..

టీడీపీ హయాంలో జరిమానాలు చాలా తక్కువగా ఉండేవి. వైసీపీ వచ్చాక అవి భారీగా పెరిగాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 130 జరిమానా విధించేవారు. వైసీపీ వచ్చాక జరిమానా కనిష్ఠ ధర రూ. 1030 అయింది. ఏకంగా పదిరెట్లు పెరిగిందన్న మాట. నెలకు ఐదారు జరిమానాలు, ఒక్కోసారి పది వరకూ జరిమానాలు వేస్తున్నారు. దీంతో ఒక్క నెలలోనే ఒక్కో ఆటోవాలా నుంచి ప్రభుత్వం జరిమానాల రూపంలో సుమారు రూ. 10వేల వరకూ లాగేస్తుంది. ఒకవేళ నెలకు ఒక్క జరిమానా అనుకున్నా.. ఏడాదికి రూ. 10 వేలు ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోంది. పైగా గతంలో మాదిరిగా ట్రాఫిక్ డ్రైవ్స్ లేవు. ఫొటోలు తీసి అప్‌లోడ్ చేసి చలానాలు ఆన్‌లైన్‌లో పంపుతున్నారు. తప్పు చేయకపోయినా ఫొటో చూపి, ఉల్లంఘనలకు పాల్పడినట్టుగా పేర్కొంటున్నారు. ఇలాంటి చలానాలు నాలుగైదు నెలలకు ఒకసారి వస్తాయి. ఈ భారమంతా ఆటోవాలాలపై ఒకేసారి పడుతోంది.

● కొందరికే అర్హత

పథకం అమలులో లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం అనేక కొర్రీలు పెట్టింది. లబ్ధిదారుల సంఖ్యను బాగా తగ్గించింది. రేషన్ కార్డు ఉంటేనే పథకానికి అర్హుడు. మూడు ఎకరాల పొలం ఉంటే లేదు. ఆటోకు అన్ని లైసెన్సుతోపాటు, డ్రైవింగ్ లైసెన్సు ఉండాలి. పల్లెల్లో చాలామంది ఒకటి, రెండు తరగతులు చదువుకున్నవారు ఆటోలపై జీవనం సాగిస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు రావాలంటే ఎనిమిదో తరగతి చదివి ఉండాలి. ఈ కారణం చేత చాలామందికి డ్రైవింగ్ లైసెన్సు లేదు. దీంతో పథకానికి అనర్హుడవుతున్నారు. అలాగే అద్దె ఆటోలు నడిపేవారు ఉన్నారు. ఆటో ఇతడి పేరుపై లేకపోవడంతో వాహనమిత్ర అనర్హుడవుతున్నాడు.

● పన్నులు, పర్మిట్లతో పేరుతో గుంజుడు

ఆటోవాలాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నుల పెంపు, పర్మిట్ల భారాన్ని మోపింది. ఇన్సూరెన్స్ ఫీజులను తగ్గించమని ఆటోవాలలు మొత్తుకుంటున్నా వినలేదు. హరిత పన్నును అమాంతం నాలుగైదు రెట్లు పెంచేసింది. పదిహేనేళ్ల కాలపరిమితి దాటిన వాహనాలకు విధించే పన్ను భారాన్ని తగ్గించాలని ఆటోవాలాలు కోరినా పట్టించుకోలేదు. ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆటోవాలాల నెత్తిన గుదిబండను మోపింది. ఇలా.. సగటున ఒక్కో ఆటోవాలాకు ఏడాదికి రూ. 10వేలకు పైగానే అదనపు భారం పడుతుంది.



● సీఎన్‌జీ బాదుడు మరోలా...

టీడీపీ ప్రభుత్వ హయాంలో సీఎన్‌జీ ధర రూ. 55గా ఉంది. ప్రస్తుతం రూ. 85కు చేరింది. ఏటా రూ. 5, రూ. 10, రూ.15 మేర పెరుగుతూ వస్తుంది. డీజిల్ ధరలకు అత్యంత దగ్గరగా సీఎన్‌జీ ధర చేరింది. పెట్రోలు, డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా సీఎన్‌జీని ఉపయోగించి నాలుగు డబ్బులు వెనకేసుకుందామనుకునే ఆటోవాలాలకు అది పెద్ద భారంగానే మారింది. రోజూ ఓ ఆటోవాలా సగటున 200 -250 కిలోమీటర్ల మేర ఆటో నడుపుతారు. ఇందుకు 6 కేజీల సీఎన్‌జీ అవసరం. పెరిగిన సీఎన్‌జీ భారం రూ. 30తో రోజుకు రూ. 180 చొప్పున నెలకు రూ. 5,400 అదనపు భారం పడుతుంది. ఏడాదికి వచ్చేసరికి రూ. 64,800 భారం అవుతుంది. కాగా సీఎన్‌జీపై రాష్ట్ర ప్రభుత్వం కిలోమీటరుకు రూపాయి చొప్పున రోడ్డు సెస్సు వసూలు చేస్తుంది. ఈ సేకరణ ఒక్కో ఆటోవాలా నుంచి ఏడాదికి రూ. 2,160 అదనంగా తీసుకుంటుంది.

నెలకు పది కేసులు రాస్తున్నారు...



ఆటోడ్రైవర్లకు ఈ ప్రభుత్వం చేస్తున్నదేమీ లేదు. వాహనమిత్ర కింద ఏడాదికి రూ. 10 వేలు ఇస్తున్న మాట వాస్తవమే. ఆ 10 వేలను తిరిగి వివిధ రూపం లో లాక్కుంది. నెలకు సగటున రూ. 10 వేల జరిమానా కేసులు నమోదవుతున్నాయి. గతంలో ఉన్న జరిమానా ఫీజులను పెంచి రూ. వెయ్యి చేశారు. ఇక్కడే రూ.10 వేలు ప్రభుత్వానికి వసూలవుతున్నాయి.

- నరసింహులు, డ్రైవర్

సీఎన్‌జీ ధరను పెంచారు..



గతంలో పెట్రోల్ ఆటోను తోలే వాడిని ఆ తర్వాత డీజిల్ వైపు వెళ్లా. ఆ తర్వాత కాలంలో సీఎన్‌జీ ఆటోలు వచ్చాయి. సీఎన్‌జీ కేజీ రూ. 35 ఉన్నప్పుడు ఆటోలను ఎక్కువ మంది కొన్నారు. ఇప్పుడు రూ. 80 కు చేరింది. ఇది డీజిల్ ధరతో పోటీ పడుతుంది. ఈ పరిస్థితుల్లో ఆటో డ్రైవర్లు సంక్షోభంలోకి వెళ్లారు.

- మల్లి, డ్రైవర్

మా రోజుల్లో



అబ్బో.. చాలా తేడా!

మా చిన్నప్పటి రాజకీయాలకు, ఇప్పటి రాజకీయాలకు చాలా తేడా ఉంది. అప్పట్లో ప్రజాసేవ కోసం మాత్రమే రాజకీయాలు చేసేవారు. అప్పటి నాయకులకు ఎలాంటి నేరచరిత్ర ఉండేది కాదు. కానీ నేడు అందుకు పూర్తి భిన్నం. నేతలు వారి ఆస్తులను కాపాడుకునేందుకు, పెంచుకునేందుకే రాజకీయాల్లోకి వస్తున్నారు. ఫలితంగా రాజకీయరంగం వ్యాపారరంగంగా మారిపోయింది. ఓటర్లకు ఓటే ఆయుధం. ఆ హక్కు ద్వారా నిజాయితీపరులను ఎన్నుకుందాం. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కు వినియోగించుకుందాం...

- బాణా నాగిరెడ్డి, ఏఎన్ కండ్రిక, సంగం మండలం

సాయిపేట నుంచి ప్రచారం శుభప్రదం !



సెంటిమెంట్

భౌగోళికంగా ఉదయగిరి నియోజకవర్గ విస్తీర్ణం చాలాపెద్దది. ఇక్కడ నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేసిన వ్యక్తులకు సెంటిమెంట్ ఎక్కువ. వాస్తుపరంగా చూస్తే నియోజకవర్గానికి కొండాపురం మండలంలోని సాయిపేట పంచాయతీ ఈశాన్య దిక్కువు తుంది. 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీచేసిన బొల్లినేని వెంకట రామారావు తన ప్రచారాన్ని సాయిపేట పంచాయతీ ఇస్కపాలెం నుంచి ప్రారంభించారు. అప్పట్లో ఆయన ఘన విజయం సాధించారు. తాజా ఎన్నికలలో టీడీపీ నుంచి పోటీ చేస్తున్న కాకర్ల సురేష్ కూడా సాయిపేట నుంచే ప్రచారం ప్రారంభించారు. ఈశాన్యం సెంటిమెంట్ వర్కౌట్ అవుతుందో.. లేదో మరి...!?

- కొండాపురం

నిస్వార్థ నేత పాలడుగు రంగారావు

- నేడు క్రియాశీలక రాజకీయాలకు దూరం
- 28 ఏళ్లు టీడీపీ మండల నేతగా..
- కడవరకు ఆ పార్టీతోనే అనుబంధం

ఏమయ్యారు?



టీడీపీ కావలి మండలాధ్యక్షుడిగా 28 ఏళ్లపాటు పనిచేసిన పాలడుగు రంగారావు నేడు క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. నిస్వార్థనేతగా ఉన్న ఆయన... ఉన్నత స్థానంలో ఉన్న బీద మస్తాన్‌రావు (రాజ్యసభ సభ్యులు) లాంటి ఎంతోమంది నేతలతో రంగన్నా... అని ఆప్యాయంగా పిలిపించుకున్న 75 ఏళ్ల రాజకీయ కురువృద్ధుడు రంగారావు. వేమిరెడ్డి అయ్యపరెడ్డి తరుపున 1970లో సర్పంచిగా పోటీచేసిన రంగారావు, 1983లో టీడీపీ ఆవిర్భావంతో క్రియాశీల సభ్యుడిగా, తుమ్మలపెంట గ్రామ కమిటీ అధ్యక్షుడిగానూ పనిచేశారు. 1987లో కావలి సింగిల్‌విండో ప్రెసిడెంట్‌గా, సెంట్రల్ బ్యాంక్ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. 1987 నుంచి 28 ఏళ్లు కావలి మండల పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీ సీనియర్ నాయకుడిగా 2010, 2017 మహానాడుల్లో నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. 2017లో నుడా డైరెక్టరుగా పనిచేసిన రంగారావు 2019 ఎన్నికల్లో ఓటు వేసి వచ్చినప్పటి నుంచి కొత్తవారికి అవకాశా లు కల్పించాలని భావించి, క్రియాశీల రాజకీయాలకు దూరం గా ఉంటున్నారు. కడ వరకు టీడీపీతోనే పయనమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

- కావలి రూరల్

అభ్యర్థుల తటపటాయింపు

- పోలింగ్ ఏజెంట్ల పేర్లు ముందే ఇవ్వాలంటున్న అధికారులు
- అలా ఇస్తే (అ)రాజకీయం చేస్తారేమో...?



కావలి, మే 3 : సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ఏజెం ట్లుగా నియమించుకునే వారి పేర్లను ముందుగా తమకు ఇవ్వాలని ఎన్నికల అధికారులు కావలి నియోజకవర్గంలో బరిలో ఉన్న అభ్యర్థులపై ఒత్తిడి తెస్తున్నారు. అలా ముందుగా పేర్లు ఇస్తే వారేమి (అ)రాజ కీయాలు చేస్తారోనని అభ్య ర్థులు తటపటాయిస్తున్నా రు. ఎన్నికల్లో ఎత్తులకు పైఎత్తులలో భాగంగా ఏజెంట్ల పేర్లు ముం దుగా ఇస్తే వారికి అధికారపార్టీ నుంచి ఎలాంటి ఒత్తిడిలు వస్తాయో.. లేక కేసుల పేరుతో పోలీసుల నుంచి బెదిరిం పులు వస్తాయోననే భయంతో ముం దుగా ఏజెంట్ల పేర్లు ఇచ్చేందుకు అభ్యర్థులు భయపడుతు న్నారు. కాగా పెద్ద నేతల నుంచి చోటా నేతల వరకు కొంతమంది ప్యాకేజీలతో... మరికొంతమంది వ్యక్తిగత కారణాలతో నిత్యం పార్టీలు మారుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏజెంట్ల పేర్లు ముందుగా ఎన్నికల అధికారులకు ఇస్తే ఆ వివరాలు పార్టీల నేతల తెలిసిపోయి ఆ ఏజెంట్లను పోలింగ్‌కు ఒక రోజు ముందు ప్రత్యర్థి పార్టీల వారు కొనుగోలు చేస్తారేమో నన్న ఆందోళన లో అభ్యర్థులు ఉన్నారు. ఒకవేళ ముందుగా పేర్లు ఇస్తే వారికి బెదిరింపులు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. నకిలీ ఓటరు ఐడీ కార్డులు సృష్టించి తిరుపతి ఉప ఎన్నికలలో భారీగా దొంగ ఓట్లు వేసుకున్నారు అధికారపార్టీ నేతలు. ఈ ఎన్నికలలో ఏజెంట్లను లేకుండా చేసి దొంగ ఓట్లు వేయించుకోవటంలో భాగంగా అధికారులను అడ్డం పెట్టుకుని ఈ ఎత్తుగడకు దిగారా ? అనే అనుమానాలు కూడా లేకపోలేదు. ఈ క్రమంలో పోలింగ్ ఏజెంట్లుగా సమర్థులైనవారు ఎవరు? అని అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. ప్యాకేజీలకు ఆశపడకుండా, కేసులు, ఇతర బెదిరింపులకు భయపడకుండా ఉండే వారి కోసం నేతలు గాలిస్తున్నారు.



నువ్వటు.. నేనిటు !

- వేర్వేరు పార్టీల్లో తండ్రీకొడుకులు, అన్నదమ్ములు
- అంతర్గతంగా ఫోన్ సంభాషణలు

కుటుంబమైత్రి

ఎన్నికలవేళ పలువురు తండ్రీ కొడుకులు, అన్నదమ్ముళ్లు, బావ,బావమరుదులు వ్యూహాత్మకంగా వేర్వేరు పార్టీల్లో ఉంటూ పబ్బం గడుపుకుంటున్నారు. వారు ముమ్మరంగా ప్రచారాల్లోనూ పాల్గొంటున్నారు. ఇలాంటి వారు ఉదయం, సాయంత్రం ఎప్పుడు వీలైతే అప్పుడు ఫోన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తాము చేసే అక్రమాలకు, అవినీతికి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు ఆయా వ్యక్తులు తమ సన్నిహితులు వద్ద చెబుతుండడం గమనార్హం. ఈ తతంగాన్ని గమనిస్తున్న కొందరు ఇలాంటివారు డబుల్ గేమ్ ఆడుతున్నారని అనుకుంటున్నారు. అంతేకాక వారు ఆయా అభ్యర్థులతో సన్నిహితంగా మెలుగుతూ తమ ప్రాధాన్యతను పెంచుకుంటున్నారు. వైసీపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీల తరుపున అభ్యర్థుల వద్ద అన్నదమ్ములు, వారి బంధుగణం వ్యవహరించే తీరు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

- ఉదయగిరి

స్వార్థమెరుగని ప్రజాసేవకుడు పాటూరి రామయ్య



- నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన జమ్మలపాలెం వాసి
- కృష్ణాజిల్లా నిడుమోలు నుంచి ప్రాతినిధ్యం
- పుచ్చలపల్లి సుందరయ్య అడుగుజాడల్లో నడిచిన ఆదర్శప్రాయుడు

నాడు మేము

జలదంకి, మే 3 : 'ఒక్కసారైనా, ఒక్కరోజైనా.. కమ్యూనిస్టుగా బతుకు నేస్తమా... ఆ గొప్ప నీకు తెలుస్తుంది.. మిత్రమా... వర్గరహిత స్వర్గమది నేస్తమా..! అచట మానవతే విలసిల్లను మిత్రమా'... అంటూ చదువుకునే రోజుల్లోనే ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకుని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకుడిగా ఎదిగాయన. అంతేకాక విజయవాడ కేంద్రంగా వెలువడుతున్న కమ్యూనిస్టు పత్రికలు జనశక్తి, ప్రజాశక్తి దినపత్రికల్లో 13ఏళ్ల పాటు సబ్‌ఎడిటర్‌గా పనిచేశారు. భూసంస్కరణల ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించారు. వేలాది ఎకరాల మిగులు భూములను పేదలకు పంపిణీ జరిగేలా చేసిన ఉద్యమవీరుడు. ఆయనే పాటూరి రామయ్య.

● దళిత కుటుంబంలో జన్మించి..

జలదంకి మండలం జమ్మలపాలెంలో 1941 అక్టోబరు 9న నిరుపేద దళితకుటుంబంలో రామయ్య జన్మించారు. కావలిలో విద్యాభ్యాసం పూర్తిచేశారు. చదువుకునే రోజుల్లోనే ఎస్ఎఫ్ఐ చేరి ప్రభుత్వ హాస్టళ్లలో వసతులు సరిగా లేవని పోరాటం చేశారు. ఈ క్రమంలో హాస్టల్ నుంచి గెంటేయబడ్డారు. అప్పటి నుంచి పేదల కోసం పలు పోరాటాలు చేస్తూ కమ్యూనిస్టు నేతలను ఆకర్షించారు. అనంతరం ఆ పార్టీ సభ్యత్వం తీసుకుని జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగారు. జిల్లాకు చెందిన ప్రముఖ కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకున్న రామయ్య... తనకు సంతానం కలిగితే స్వార్థం పెరుగుతుందని భార్య మహాలక్ష్మమ్మను ఒప్పించి పిల్లలు లేకుండా శస్త్రచికిత్స చేయించుకున్నారు. సుందరయ్య సూచనతో కృష్ణాజిల్లా నిడుమోలు ఎస్సీ రిజర్వు నియోజకవర్గం నుంచి సీపీఎం అభ్యర్థిగా 1984లో పోటీచేసి ఘనవిజయం సాధించారు. ఎమ్మెల్యేగా ఆ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవలు చేసి, ఎన్టీఆర్‌కి బాగా దగ్గరయ్యారు. సొంత పార్టీ పెద్దలతో కూడా శెభాష్ అని అనిపించుకున్నారు. ఆ తర్వాత 1989, 2004, 2009 ఎన్నికల్లో కూడా వరుసగా నిడుమోలు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ఎన్టీఆర్, వైఎస్ఆర్, చంద్రబాబుల వద్ద నియోజకవర్గ సమస్యలు వివరించి, వాటిని పరిష్కరించారు.

● నేటికీ సాధారణ జీవితం

నేటికీ పాటూరి రామయ్య సాధారణ శేషజీవితాన్ని గడుపుతున్నారు. ఒక్కసారి ఎమ్మెల్యే అయితేనే బెంజి కార్లలో తిరిగే నేటి రాజకీయ నాయకులతో పోల్చితే రామయ్య ఎందరికో ఆదర్శంగా చెప్పుకో వచ్చు. పార్టీ నిబంధనలను అనుసరించి ఎమ్మెల్యేలకు హైదరాబాద్‌లో ఇచ్చే ఇళ్లస్థలం కూడా తీసుకోకుండా వెనక్కి ఇచ్చేశారు. మాజీ ఎమ్మెల్యేగా ఆయనకు వచ్చే పింఛన్‌లో కొంతభాగాన్ని పార్టీకి ఇచ్చి, మిగిలిన దాంతో జీవనం గడుపుతున్నారు. తనకంటూ గజం స్థలం కూడా లేకుండా కొంతకాలం ఆయన వృద్ధాశ్రమంలో గడిపారు. ప్రస్తుతం పెంపుడు కూతురు వద్ద శేషజీవితం గడుపుతున్నారు.

● మా ఊరివాడు రామయ్య

జన్మనిచ్చిన గ్రామానికేకాక ప్రజాప్రతినిధిని చేసిన నియోజకవర్గానికి కూడా గర్వంగా నిలిచారు పాటూరి రామయ్య. రామయ్య మా ఊరి వాడు... అని గర్వంగా జమ్మలపాలెం వాసులు చెప్పుకుంటుండగా, కాదు.. కాదు.. రామయ్య... మావాడు.. మా ఊరివాడు... మాకు ఎమ్మెల్యేగా నాలుగుసార్లు చేశాడు.. అని నిడుమోలు వాసులు కూడా గొప్పగా చెప్పుకుంటారు. అదే ఆయన సంపాదించుకున్న నిజమైన ఆస్తి.

నిత్యం ప్రజల్లోనే ఉంటేనే నాయకుడు !



వెంకయ్య: అరే కొండయ్యా.. చంద్రబాబు వయసు ఎంతుంటుందిరా?

కొండయ్య : ఓ 74 ఏళ్లు ఉంటాయి..

వెంకయ్య ఆ వయసులో ఆయన రోజుకు ఎన్ని గంటలు ప్రచారం చేస్తున్నాడురా..?

కొండయ్య: ఉదయం నుంచి రాత్రి వరకు మండు టెండను లెక్కచేయకుండా రోజుకు సుమారుగా 15 గంటలు ప్రచారం చేస్తున్నారు..

వెంకయ్య పార్టీ గెలుపు, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన ఎంత కష్టపడుతున్నాడో గదా!

కొండయ్య: అదే మన ఊరూరి నాయకుడు వయసు ఎంతుంటుందిరా?

వెంకయ్య: చంద్రబాబు వయసులో సగం ఉంటుందేమో!

కొండయ్య: ఆయనగారు పార్టీ అభివృద్ధికి ఏమాత్రం కృషిచేస్తున్నాడో కాస్తచెప్పరా?

వెంకయ్య: నన్నెందుకు అడుగుతావు నువ్వు చూస్తున్నావుగా?

కొండయ్య: చూస్తున్నానులే..ఆ నాయకుడు చేసే పనులన్నీ నాతోపాటు గ్రామ ప్రజలంతా చూస్తున్నారులే.

వెంకయ్య: అదేదో చెప్పు మరీ!

కొండయ్య: చెప్తాను...ఆ నాయకుడు ఎన్నికలప్పుడు మాత్రమే ఉదయం నుంచి నలుగురిని వెంటబెట్టుకొని కార్లలో తిరుగుతూ కాలక్షేపం చేస్తుంటాడే తప్ప మిగిలిన రోజుల్లో అసలు కనిపించడు. స్వలాభం చూసుకుంటాడే తప్ప పజల గురించి అసలు పట్టించుకోడు.

ఇద్దరు ముచ్చట



వెంకయ్య: నాయకుడనేవాడు ప్రతిరోజు ప్రజలను కలిస్తేనే కదా..? వారి కష్టాలు తెలిసేది. ఎలక్షన్లప్పుడే కనిపిస్తే ఓట్లేస్తారా మరి.

కొండయ్య: అందుకేకదా...! ఓసారి గెలిచిన నాయకుడు మరోసారి ఓడిపోతున్నాడు. గెలిచినా, ఓడినా ప్రజల్లోనే ఉండి వారి కష్టాలు తీరిస్తేనే.. ఆ నాయకుడు ప్రజల మదిలో ఉంటాడు.

వెంకయ్య ఆ.. దీన్ని బట్టి నాకేమర్థం అయిందంటే... ఎప్పుడూ ప్రజలతోనే ఉంటేనే మంచి నాయకుడు అవుతాడు. చంద్రబాబులా నిత్యం ప్రజల గురించి ఆలోచిస్తేనే ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతుంది. మన బిడ్డల భవిష్యత్తు బాగుంటుంది.

- కొండాపురం



మచ్చా..ఈయచ్చే గెలుస్తాడంటావా?

'మచ్చా రేయ్.....ఎవర్రా వీళ్లంతా?' వీధిలో జేజేలు పలుకుతూ వెళ్తున్న ఎన్నికల ప్రచారం బృందాన్ని చూస్తూ అడిగాడు సుబ్బయ్య. 'ఉత్తరా దోడంటనే.. ప్యానోళ్లు, సైకిలోళ్లతో పోటీపడి సందడి చేస్తావుండాడు' నవ్వుతూ టీ గ్లాసు అందుకున్నాడు రామయ్య. 'దుడ్లు బలే సెలవుజేస్తావుండారంటలే. బాగా వున్నోడంట మామా..' సుబ్బయ్య గొంతులో కాస్త అసూయ ధ్వనించింది. 'ఔను యా మామా.. ఎవరు ఎన్ని ఓట్లు ఏపిస్తారో అన్ని వేలు ఇచ్చేస్తా.. అని చెప్తున్నాడంటగదా?' ఆశగా అడిగాడు రామయ్యని. 'అవును మచ్చా.. ఆపార్టీలో, ఈపార్టీలో అలిగినోళ్లంతా ఎగబడి ఈయబ్బతో తిరగతావుండారంటలే. దుడ్లు దండిగా పడతావుళ్లా.' అని నవ్వాడు రామయ్య. 'అట్టయితే గెలిచిపోతాడంటావా?' అమాయకంగా అడిగాడు సుబ్బయ్య. పకపకా నవ్వి చెప్పాడు రామయ్య. 'మామా మనూర్లో జనాలు యేమన్నా తెలివిమానినోళ్లా యేమి.. దుడ్లు చేదా.. ఎవురిచ్చినా కాదనకుండా తీసుకుంటారు. ఎవరు పిలిచినా ప్రచారానికి పోతారు. ఓట్లదినం.. లోపలికి పొయ్యి ఎవరికి గుద్దాల్నో వాళ్లకు సైగ్గా గుద్దేసి వచ్చేస్తారు.'

- సత్యవేడు



ఇదీ మందుల




రండి.. రండి.. రండి.. దయచేయండి

పొట్టచేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారిపై రాజకీయ నాయకులకు ఎక్కడ లేని ప్రేమా పుట్టుకొచ్చింది. ఇన్నాళ్లూ వాళ్లెక్కడున్నారో తెలియకపోయినా, కనీసం ముఖ పరిచయం లేకపోయినా వారికి తెగ ఫోన్లు చేసేస్తున్నారు. హలో అన్నా.... తెలుసు కదా....13న ఓట్ల పండగ వుంది. తప్పకుండా రండి.. మీ ఓటు ఫలానా గుర్తుకు వేసి వెళ్ళండని అభ్యర్థిస్తున్నారు. బెంగళూరు, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు వలస వెళ్ళిన వేలాది మంది జిల్లా ఓటర్లపై తిరుపతి నాయకులు దృష్టి పెట్టారు. స్థానికంగా ఇలాంటి వారి వివరాలు సేకరించి వరుస పెట్టి ఫోన్లు చేసి రప్పించే పనిలో బిజీగా ఉన్నారు. ముక్కూమొఖం చూడకపోయినా మాట కలిపి వీరు ఫోన్లో ప్రేమ ఒలకబోస్తున్నారు. ప్రతి ఓటూ కీలకంగా భావించిన పార్టీలు ఈ పనిని ప్రత్యేకించి స్థానికంగా కొందరికి అప్పగించాయి. వలస ఓటర్లను రకరకాలుగా ఆకర్షించి రప్పించేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. బస్సు, రైళ్ళలో రిజర్వేషన్లు చేసి టికెట్లు పంపుతున్నట్టు సమాచారం. నాయకుల నుంచి అదేపనిగా ఫోన్లు వస్తుండటంలో ఈ వలస జీవులు విస్తుపోతున్నారు.

- తిరుపతి(నేరవిభాగం)

మా ఊర్లో మీ పెత్తనమేంటి!



ఎన్నికల ఇన్‌చార్జిల తీరు వైసీపీ లోకల్ కేడరుకు సుతరామూ నచ్చడం లేదు. మామీద మీ బోడి పెత్తనమేంటంటూ తిరుగుబాటు చేస్తున్నారు. ఎన్నికల కోసం రేణిగుంట మండలానికి వైసీపీ నాయకత్వం బయట ప్రాంతాలకు చెందిన ముగ్గురిని ఇటీవల మండల ఇన్‌చార్జిలుగా నియమించింది. అయితే వీరు స్థానికంగా ప్రతి పనిలోనే వేలు పెడుతున్నారంటూ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు గుర్రు మీదున్నారు. మీడియా వార్తల వల్ల గ్రాఫ్ పడిపోతోందని, తమకు చెప్పకుండా ఏ పనీ చేయకూడదని హుకుం జారీ చేయడాన్ని వీరు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకరిద్దరు చేసిన తప్పులను సాకుగా చూపుతూ సదరు ఇన్‌చార్జిలు అందరినీ దోషులుగా చూడడం అసలుకే మోసం వస్తుందని ఆందోళన చెందుతున్నారు. అయినా స్థానికంగా అవగాహన ఉన్న తమను కాదని బయట వ్యక్తులను పరిశీలకులుగా నియమించడమేంటని మండిపడుతున్నారు. ఇలాంటి 'సారథు'లు విజయానికి కాకుండా ఓడించేలా వ్యవహరిస్తున్నారని తలపట్టుకుంటున్నారు. పార్ట్‌టైం పరిశీలకులకు,స్థానిక నాయకులకు మధ్య ఏర్పడిన అంతరం రోజురోజుకూ పార్టీకి తలనొప్పిగా తయారయింది.

- రేణిగుంట



పాదయాత్రే తనను నాయకుడిగా మలచిందని ఆయన చెబుతాడు. రాష్ట్రం దుస్థితి, ప్రజల కష్టాలు కళ్ల చూసిన తర్వాతనే వైసీపీ మేనిఫెస్టో రూపొందించానని అంటారు.
నిజమేనా? నమ్మచ్చా?
జగన్ మాటలకూ చేతలకూ నడుమ అగాధాలు ఉన్నాయనేందుకు సాక్ష్యమే ఈ కథనం..

జగన్ నడిచిన దారులు

ఇప్పుడిలా ఉన్నాయి



2018 జనవరి 10న చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలం అనుప్పల్లిలో జిల్లాలోకి ప్రవేశించిన జగన్.. నగరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల మీదుగా జనవరి 30న నెల్లూరు జిల్లాలోకి నడక సాగించారు. జిల్లాలో మొత్తం 184 కిలోమీటర్లు నడిచారు. ఎందరితోనో మాట్లాడారు. అధికారంలోకి రాగానే అన్నీ మార్చేస్తానంటూ హామీలెన్నో ఇచ్చారు. తలలు నిమిరి, నుదుట ముద్దులు పెట్టి, బుగ్గలు గిల్లి ఆయన చెప్పిన మాటలు నమ్మిన ప్రజలు ఒక్క ఛాన్స్ ఇచ్చారు. అంతే ఆ తర్వాత నడిచి వచ్చిన దారులనే జగన్ మరచిపోయారు. గాల్లో తప్ప నేలమీదకు దిగడం మానేశారు. మళ్లీ ఎన్నికలొచ్చాకే బస్సెక్కారు. మాట తప్పనూ, మడమ తిప్పనూ, చేసేదే చెబుతానూ.. అని వేదికలమీద దబాయించి అబద్ధాలు చెప్పే ఈ నాయకుడి పాలనలో అభివృద్ధి ఎలా ఉందో ఆయన నడిచిన దారులే సాక్ష్యం. పాదయాత్ర సమయంలో సవ్యంగా ఉన్న ఈ రోడ్లు ఇప్పుడు ఇలా ఉన్నాయి...

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వైసీపీ పాలనకు అద్దం పడుతూ దుస్థితిలో రోడ్లు

నియోజకవర్గం: సత్యవేడు

పాదయాత్ర: 2018 జనవరి 22

నడిచిన గ్రామాలు: బుచ్చినాయుడు కండ్రిగ మండలం చల్లమాంబపురం, పార్లపల్లి, పల్లమాల, ఆలత్తూరు.

నడిచిన దూరం: 15 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్లు స్థితి: పల్లమాల నుంచీ ఆలత్తూరు వరకూ ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్వహణకు, మరమ్మతులకు నోచుకోక దారుణంగా తయారైంది. కంకర, మట్టి తప్ప తారు రోడ్డన్నదే కనిపించడం లేదు. ఈ మార్గంలో ప్రయాణానికి వాహనదారులు నరకం చూస్తున్నారు.



బుచ్చినాయుడు కండ్రిగ మండలం పల్లమాల నుంచీ ఆలత్తూరు వరకూ శిథిలమైన రోడ్డు

నియోజకవర్గం: శ్రీకాళహస్తి



ఏర్పేడు మండలం మడిబాక నుంచీ రాజుల కండ్రిగ వరకూ రోడ్డు అధ్వానంగా వున్న దృశ్యం

పాదయాత్ర: 2018 జనవరి 16 నుంచీ 22 వరకు

నడిచిన మండలాలు: ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు

నడిచిన దూరం: 42 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్ల స్థితి: మడిబాక నుంచీ రాజుల కండ్రిగ వరకూ ఒకటిన్నర కిలోమీటరు, సదాశివపురం నుంచీ మోదుగులపాలెం వరకూ నాలుగున్నర కిలోమీటర్ల దూరం, అలాగే కోబాక నుంచీ ఏర్పేడు దాకా మూడు కిలోమీటర్లు రోడ్డు పరమ అధ్వానంగా ఉన్నాయి.

ఏర్పేడు మండలం సదాశివపురం నుంచీ మోదుగులపాలెం నడుమ రోడ్డు దెబ్బతిన్న దృశ్యం

నియోజకవర్గం: నగరి

పాదయాత్ర తేదీలు: 2018 జనవరి 14 నుంచీ 16 వరకు

నడిచిన గ్రామాలు: వడమాలపేట మండలం పత్తిపుత్తూరు, అప్పలాయగుంట, ఎనమలపాలెం, తిరుమణ్యం, వడమాలపేట, పాదిరేడు, టీసీ అగ్రహారం.

నడిచిన దూరం: 18 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్ల స్థితి: పరమ అధ్వానంగా వున్నాయి. ఎనమలపాలెం నుంచీ తిరుమణ్యం వరకూ తీవ్ర దుస్థితిలో వుంది.



వడమాలపేట మండలం ఎనమలపాలెం నుంచీ తిరుమణ్యం వరకూ రోడ్డు దుస్థితి.

నియోజకవర్గం: సూళ్ళూరుపేట

పాదయాత్ర: 2018 జనవరి 23 నుంచీ 26 వరకు

నడిచిన మండలాలు: పెళ్ళకూరు, నాయుడుపేట, ఓజిలి

నడిచిన దూరం: 45 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్లు స్థితి: శిరసనంబేడు రాజుపాలెం నుంచీ చావలి చెక్‌పోస్టు వరకూ ఆరు కిలోమీటర్ల దూరం భారీ గోతులు ఏర్పడ్డాయి. తారు, కంకర పూర్తిగా తొలగిపోయి మట్టిరోడ్డుగా మారింది. దుమ్ము రేపుతూ వాహనదారులకు నరకం చూపుతోంది.



పెళ్ళకూరు మండలం శిరసనంబేడు రాజుపాలెం నుంచీ చావలి చెక్‌పోస్టు నడుమ మట్టిరోడ్డుగా మారిన తారు రోడ్డు.

నియోజకవర్గం: గూడూరు

పాదయాత్ర: 2018 జనవరి 27 నుంచీ 29 వరకూ

నడిచిన గ్రామాలు: గూడూరు మండలం కాండ్ర, తిమ్మసముద్రం, కొండాగుంట, ఆరిచెర్ల, గాంధీనగర్, మాలవ్యనగర్, గూడూరు, నెల్లకూరు, చెన్నూరు, తిప్పవరప్పాడు.

నడిచిన దూరం: 24 కిలోమీటర్లు

జగన్ నడిచిన రోడ్లు స్థితి: నెల్లకూరు నుంచీ చెన్నూరు వరకూ నాలుగు కిలోమీటర్ల పొడవునా రోడ్డు అధ్వానంగా మారింది. తారు, కంకర లేచిపోయి వెడల్పాటి గోతులు ఏర్పడి వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి.



నెల్లకూరు నుంచీ చెన్నూరు నడుమ ఛిద్రమైన రోడ్డు

● నోట్ దిస్ పాయింట్

అక్కడ ఓటు వేయకపోతే నేరమే!

ప్రజాస్వామ్యంలో ఓటు అన్నది పౌరుల హక్కు అని చెబుతారు. నిజానికి ఓటు అన్నది పౌరుల బాధ్యత కూడా. నాయకులంతా ఇంతే.. నేనెందుకు ఓటు వేయాలి అని మనదేశంలో చాలామంది ఓటు వేయడానికి ఇష్టపడరు. అందుకే పోలింగ్ శాతం 60 శాతం నమోదవుతూ ఉంటుంది. కొన్ని దేశాల్లో ఓటు వేయకపోవడాన్ని నేరంగా పరిగణిస్తారు. ఆస్ట్రేలియాలో ఓటు వేయకుంటే చిన్నపాటి నేరమే. అందుకు తగ్గ కారణం, అక్కడ ప్రభుత్వానికి చూపించాల్సిందే. లేదంటే రూ.1000 జరిమానా చెల్లించాలి. లేకపోతే నేరస్తుడిగా పరిగణిస్తారు. అర్జెంటినాలో ఓటు వేయనివారికి సంవత్సర కాలంపాటు ప్రభుత్వ పథకాలు తొలగిస్తారు. పెరూ దేశంలో ఓటు వేయని వారికి పెద్దశిక్షలు అమలు చేస్తారు. వారి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తారు. బెల్జియంలో ఓటు హక్కు వినియోగించుకోని వారిని కోర్టులో హాజరుపరుస్తారు. నాలుగు పర్యాయాలు ఓటు వేయనివారికి పదేళ్లపాటు ఓటు హక్కు రద్దు చేస్తారు. ఈ కారణంగా ఓటు వేయని వారు ప్రభుత్వ ఉద్యోగ అర్హత కోల్పోతారు. గ్రీస్, ఈజిప్టు దేశాల్లో ఓటుహక్కు వినియోగించుకోని వారిని కోర్టులో హాజరుపరుస్తారు. న్యాయస్థానంలో సరైన కారణం చూపని వారిని జైలుకు పంపుతారని ఆయా దేశాల్లో ఉన్న ఎన్‌ఆర్‌ఐలు అంటున్నారు. మన దేశంలో కూడా వందశాతం పోలింగ్ అయ్యేందుకు ఇలాంటి చట్టాలు ఎప్పుడు వస్తాయో వేచి చూడాల్సిందే.

- గూడూరు అర్బన్



ఓటు ఎక్కడుందో తెలుసుకోండిలా..

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ గడువు దగ్గరకొస్తోంది. చాలామందిలో ఓటు ఎక్కడ ఉంది...? ఏ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయాలి? లాంటి సందేహాలుంటాయి. వీటిని నివృత్తి చేసేందుకు తిరుపతి కలెక్టరేట్‌లో అధికారులు కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. 1950 నంబరుకు ఫోన్ చేసి ఓటరు పేరు, నియోజకవర్గం, కార్డు నెంబరు(ఎపిక్ నెంబర్) చెబితే పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. 0877-2236007 నంబరుకు ఫోన్ చేసినా ఈ సమాచారం అందిస్తారు. ఎన్నికల ప్రవర్తనావళి ఉల్లంఘనలు, రాజకీయ పార్టీ నేతల ప్రలోభాలు, తాయిలాలు లాంటి సమాచారం ఈ నంబరుకు తెలియజేయవచ్చు. మొబైల్ ఫోన్‌లో 1950ఈసీఐ అని టైప్ చేసి స్పేస్ ఇచ్చి ఓటరుకార్డు(ఎపిక్)నెంబరు నమోదు చేస్తే కొద్ది సమయంలో పేరు,బూత్ నెంబరు, ఓటు సీరియల్ నెంబరు వివరాలతో సహా సంక్షిప్త సమాచారం వస్తుంది. ఓటర్ హెల్ప్‌లైన్ అనే యాప్‌లోనూ ఫోన్ నంబరు, ఎపిక్ నెంబర్‌తో వివరాలు తెలుసుకోవచ్చు.

- తిరుపతి (కలెక్టరేట్)

మత్స్యకారులకు కిలివేటి వల

● మూణ్ణాళ్ల ముచ్చటగా తమిళ పాఠశాల

తెలిసో వనివ్వా

మేం అధికారంలోకి వస్తే పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం... తమిళ పాఠశాలను ఏర్పాటు చేస్తాం...

2019 ఎన్నిలకు ముందు వైసీపీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తడ మండలం ఇరకందీవి పాళెంతోపుకుప్పంలో మత్స్యకారులకు ఇచ్చిన హామీ ఇది.

ఇరకందీవిలోని పాళెంతోపు కుప్పంలో తమిళ పాఠశాల ఏర్పాటు మూణ్ణాళ్ల ముచ్చటే అయింది. ఎన్నికల్లో గెలిచాక 2019 సెప్టెంబరు 16న అధికారపార్టీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, అప్పటి సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బ్రహ్మానందరెడ్డి, ఇతర అధికారులను వెంటబెట్టుకుని పాళెంతోపు కుప్పం వెళ్లారు. ఆదరాబాదరాగా తమిళ పాఠశాలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించి రిబ్బన్ కట్ చేశారు. ఇక్కడున్న 45 మంది విద్యార్థుల చదువుల కోసం ఇద్దరు తమిళ విద్యావలంటీర్లను నియమించినట్లు ఆయన చెప్పారు. త్వరలోనే తమిళ మీడియం రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమిస్తామని హామీ ఇచ్చారు. ఇక పడవల్లో తమిళనాడు పాఠశాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. అంతటితో ఆగకుండా వచ్చే విద్యాసంవత్సరానికి పిల్లలంతా ఇక్కడే తమిళ మీడియంలో చదువుకునేలా రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తాన్నారు. దాంతో ఆ రోజు మత్స్యకార కుటుంబాలు [illegible] వారి ఆనందం పట్టుమని పది రోజులు కూడా నిలవలేదు. విద్యావలంటీర్లు పది రోజు[illegible]మిస్తామన్న ఎమ్మెల్యే మాట నెరవేరలేదు. దీంతో నెలరోజుల్లోనే పాఠశాల మూతపడింది. [illegible] పువ్వు పెట్టారని ఇరకం కుప్పం గ్రామస్తులు గుర్తించారు. ఎప్పటిలాగే ఇక్కడి పిల్లలు ఉసూరంటూ పడవలో తమిళనాడు పాఠశాలకు వెళ్తున్నారు.

- తడ



పాళెంతోపుకుప్పంలో అధికారులు ఏర్పాటు చేసిన తమిళ పాఠశాల

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కూటమి అభ్యర్థులను గెలిపించండి

గూడూరు, మే 3: ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర, దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటుపడాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణమనాయుడు అన్నారు. గాంధీబొమ్మ, బజారువీధుల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్‌ను గెలిపించాలన్నారు. దయాకర్, బిందురెడ్డి, శ్రీనివాసరావు, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



గూడూరు, మే 3: టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ నివాసం వద్ద శుక్రవారం కోట మండలానికి చెందిన పలువురు టీడీపీలోకి చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు మద్దాలికి చెందిన సుమంత్‌తేజానాయుడు, సతీష్, జయచంద్ర, వెంకటరమణ, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు.

సూళ్లూరుపేట: దొరవారిసత్రం మండలానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకుడు పిల్లి చెంగయ్య ఆధ్వర్యంలో సుమారు 200 మంది టీడీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్ నివాసంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సమక్షంలో కల్లూరుకండ్రిగ, తొగరాముడి, చందనమూడి గ్రామాలకు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీడీపీ కార్యాయలంలో వేనాటి సతీష్ రెడ్డి సమక్షంలో నాయుడుపేట మండలం అన్నమేడుకు చెందిన 150 మంది వైసీపీ కార్యకర్తలు నాయుడుపేట మాజీ మండల ఉపాధ్యక్షుడు వర్మ ఆధ్వర్యంలో టీడీపీ చేరారు. డి.సుధాకర్ రెడ్డి, టి.శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి

చిల్లకూరు, మే 3: ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించు కోవాలని ఎస్ఐ అంజి రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బల్లవోలు, చింత వరం, ఏరూరు గ్రామాల్లో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తూ పోలీసులు, పారామిలటరీ సిబ్బంది కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు ఏలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు ఏలాంటి ఇబ్బందులు జరగకుండా సజావుగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. ఎవరైనా ఓటర్లను భయాందోళనకు గురి చేసినా, ప్రలోభాలకు గురి చేసినా చర్యలు తీసుకుంటామన్నారు.

గడియారానికి మరమ్మతులు చేయించండి

నాయుడుపేట, మే 3: పట్టణం నడిబొడ్డున పోలేరమ్మ గుడి వద్ద 1956లో ఏర్పాటు చేసిన పెద్ద గడియారానికి మరమ్మతులు చేపట్టాలని పట్టణ యువకులు మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాజేష్, పవన్, హేమంత్, నరేష్, ప్రసన్న, వంశీ, ఆసీమ్ తదితరులు ఉన్నారు.

జగన్‌కు జీవితాంతం శిక్ష వేసినా సరిపోదు
టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్

సూళ్లూరుపేట, మే 3: సీఎం జగన్ చేసిన అవినీతికి జైలులో పెట్టి జీవితాంతం శిక్ష వేసినా సరిపోదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. శుక్రవారం సూళ్లూరుపేట టీడీపీ కార్యాలయంలో ఆయన పార్టీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆనాడు తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని వేలకోట్ల అవినీతికి పాల్పడ్డారని, నేడు ఒక్క చాన్సుపేరుతో అధికారంలోకి వచ్చి ప్రకృతిని సైతం వదలకుండా అక్రమార్జనకు దిగిన జగన్‌కు జీవితాంతం శిక్ష వేసినా తప్పులేదన్నారు. అధికారంలో ఉండగా ఏ తప్పు చేయని చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసిన జగన్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలను వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. 13న జరిగే ఎన్నికల సునామీలో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. అవినీతికి పాల్పడిన జగన్‌తో పాటు వైసీపీ పెద్దలెవరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని తెలిపారు. అరాచక ప్రభుత్వాన్ని గద్దెదిం చేందుకు నాయకులు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. వేనాటి సతీష్ రెడ్డి మాట్లాడుతూ... ప్రశాంతతకు పేరుగాంచిన సూళ్లూరుపేటలో వైసీపీ నాయకులు వీధి రౌడీల్లా బజారులో బాహాబాహీకి దిగి మళ్లీ ప్రజలను ఓట్లు అడగటం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో వేనాటి అశోక్‌రెడ్డి, కొక్కు శంకరయ్య, వేనాటి జనార్ధన రెడ్డి, నాపా మునిరాజా, జిసుబ్రమణ్యం, పర్వతరెడ్డి చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోండి

గూడూరు అర్బన్, మే 3: ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు ఉత్తర్వులు పొందిన వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామని ఆర్వో కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... గూడూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి జడ్పీబాలుర ఉన్నత పాఠశాలలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫారం-12 దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరూ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేవారు ఎన్నికల విధుల ఉత్తర్వులు, ఐడీకార్డు, ఓటరు గుర్తింపుకార్డు, ఆధార్‌కార్డు తెచ్చుకోవాలన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో జాతీయ సదస్సు



కోట, మే 3: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్నోసిస్ సదస్సు జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పలు విభాగాలకు చెందిన 125 మంది విద్యార్థులు సామాజిక అంశాలపై పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ చేశారు. పైథాన్ క్విజ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లను అందజేశారు. విభాగాధిపతులు విక్రమ్ కుమార్, శ్రీనివాసులు, శ్రీహరిరెడ్డి, విజయశేఖర్, నాగేంద్ర, ఉదయకుమార్, రామ్‌ప్రసాద్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో పేదలకు మేలు
● మాజీ ఎమ్మెల్యేలు నెలవల సుబ్రహ్మణ్యం, పరసారత్నం



విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడికి సత్కారం - అత్తివరం గోపాల్‌రెడ్డికి టీడీపీ కండువా కప్పుతున్న నెలవల తదితరులు

పెళ్లకూరు/ నాయుడుపేట, మే 3: సూపర్ సిక్స్ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని కూటమి మేనిఫెస్టో చూసి వైసీపీకి దడ పుడుతోందని మాజీమంత్రి పరసారత్నం, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం జీలపాటూరు, పెళ్లకూరు, అర్ధమాల పంచాయతీల్లో ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. గ్రామగ్రామాన వీరిపై పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూహక్కు చట్టం ప్రజలకు ఉరితాడులాంటిదని అది అమలైతే భూములన్నీ జగన్ చేతికి చేరుతాయన్నారు. కేంద్రప్రభుత్వం పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలన్న ఉద్దేశంతో గృహాలు మంజూరు చేస్తే వైసీపీ ప్రభుత్వం వాటిని సక్రమంగా అందించలేదని విమర్శించారు. టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, పేరం మధునాయుడు, పేరం రమేష్‌నాయుడు, సంచి కృష్ణయ్య, వి.మురళీకృష్ణారెడ్డి, నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి, పి. రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఆర్.కృష్ణయ్య, ఎ.నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి మెగా షాక్...

అధికార వైసీపీకి మెగా షాక్ తగిలింది. ఆ పార్టీ నుంచి ఓజిలి మండల వైసీపీ నేత అత్తివరం గోపాల్‌రెడ్డి, నాయుడుపేటకు చెందిన వైసీపీ నాయకుడు కుబేరు మణి, పెళ్లకూరు మండలానికి చెందిన చైతన్యకృష్ణారెడ్డి వందల సంఖ్యలో తమ అనుచరులతో టీడీపీలో చేరారు. నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో నెలవల సుబ్రహ్మణ్యం, పరసారత్నం, వాకాటి నారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. సాయంత్రం గోమతి సెంటర్ నుంచి ఫంక్షన్ హాల్ వరకు సుమారు 500 బైక్‌లలో చైతన్యకృష్ణారెడ్డి ర్యాలీగా వెళ్లి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ టీడీపీ ప్రజాదరణ పెరుగుతోందనడానికి చేరికలే సాక్ష్యమన్నారు. ఈ ప్రభుత్వానికి నూకలు చెల్లిపోయాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, కె.కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, గాలి రాజేష్‌నాయుడు, దార్ల రాజేంద్ర, అవధానం సుధీర్, జి.సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చైతన్యకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

శ్రీవారి ఆశీస్సులతో విజయం నాదే
● తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు



బీసీ సంఘ సమావేశంలో వెలగపల్లి వరప్రసాద రావు - ముస్లింలతో సమావేశమైన వరప్రసాద రావు

తిరుపతి, (ఉపాధ్యాయనగర్) మే 3: తిరుమల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తిరుపతి ఎంపీగా మరోసారి తాను విజయం సాధించబోతున్నానని బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం తిరుమలతో శ్రీవారిని ఆయన కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. అనంతరం తిరుపతి నగరంలోని పీకే లేఅవుట్‌లో బీసీ సంక్షేమ సంఘ సమావేశంలో ఆయన పాలుపంచుకున్నారు. జీవకోనలో ముస్లిం సోదరులతో సమావేశమయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీఏ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తాను ఎప్పుడు అందు బాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, వరప్రసాద్ సతీమణి కొల్లూరి లక్ష్మి, కుమారుడు నవీన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



తిరుమల ఆలయం ముందు వెలగపల్లి వరప్రసాద రావు కుటుంబం

ఈదురు గాలులు



పైకప్పు ఎగిరిపోయిన రాపూరు వెంకటమ్మ ఇల్లు

వెంకటగిరిటౌన్, మే 3: పట్టణంలో ఈదురు గాలులు భారీగా వీచాయి. ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపించాడు. మధ్యాహ్నం 3గంటలకు ఈదురు గాలులు వీచడంతో పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి విద్యుత్ స్తంభాలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగాయి. విద్యుతు సిబ్బంది వెంటనే మరమ్మతులు చేపట్టారు. మండల పరిధిలోని సోమసానిగుంట పంచాయతీ వెంకటేశ్వరపురంలో వెంకటమ్మ పూరి గుడిసె పైకప్పు ఎగిరిపోయింది. చెంచమాల చెంచమ్మ రేకుల ఇంటిపై కప్పు కూడా ఎగిరిపోయాయి. అధికారులు వాటిని పరిశీలించారు. అలాగే డక్కిలి మండలం నాగవోలు మెయిన్ లైన్ నుంచి సరఫరా నిలిచిపోవడంతో మండల వ్యాప్తంగా అంధకారం నెలకొంది.

వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు



కయ్యూరులో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

బాలాయపల్లి, మే 3: వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు అన్నారు. మండలంలోని కయ్యూరులో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ, బీజేపీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అందాలన్నా కూటమి అభ్యర్థులు గెలవాలన్నారు. రాయి సత్యంనాయుడు, కూను శ్రీహరి, సి.సి.నాయుడు, కొర్రపాటి రామచంద్రనాయుడు, మల్లెమాల గోపీకృష్ణా రెడ్డి, తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, సి.వి.కె.నాయుడు, బి.కళ్యాణ్ రెడ్డి, బాబురెడ్డి, జె.కోటేశ్వరావు, చెంచు క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



గూడూరు, మే 3: స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం బ్రాహ్మణ సాధి కార సమితి ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఉమ్మడి మేనిఫెస్టో ప్రజలందరికీ ఆమోద యోగ్యంగా ఉందన్నారు. దీంతో చంద్రబాబు చిత్రపటానికి పాలంతో అభిషేకం చేశామ న్నారు. కార్యక్రమంలో హనుమంతరావు, బాలాజీ, అశోక్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, రామచంద్రారెడ్డి, జనార్దనరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై పోలీసుల దాడి

కోట, మే 3: మండల పరిధిలోని రాఘవాపురంలో కోడి పందేల స్థావరాలపై శుక్రవారం రాత్రి ఎస్ఐ నాగబాబు సిబ్బందితో కలిసి దాడులు జరిపారు. నలుగురు పందెంరాయుళ్లు, రెండు కోడి పుంజులు, రూ.760లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వెంకటగిరికి పూర్వ వైభవం తీసుకువస్తా
ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో పైసా పని జరగలేదు ● టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ



కుల్లూరులో ఎన్నికల ప్రచారంలో కురుగొండ్ల రామకృష్ణ - కలువాయిలో పార్టీలో చేరిన వడ్డెర సంఘ నాయకులతో కురుగొండ్ల

వెంకటగిరి/ డక్కిలి, మే 3: తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వెంకటగిరి నియోజకవర్గంలో రూ.2వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేసినట్టు టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. శుక్రవారం ఆయన నియోజకవర్గంలోని కలువాయి మండలం కుల్లూరు, బద్దవోలు, బ్రాహ్మణపల్లి, రామన్నగారిపల్లి, చింతలపాళెం, వెంకటరామరాజుపేట, కోటూరుపల్లి, ఉయ్యాలపల్లెల్లో ప్రచారం నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాలుగు వేల గృహాలు నిర్మిస్తే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని ఇవ్వకుండా అడ్డుకుందన్నారు. వందలాది చెరువులను నీరు చెట్టు పథకం కింద అభివృద్ధి చేయడంతోనే ఐదేళ్లుగా రైతులు సాగునీటి ఇబ్బంది పడలేదన్నారు. వైసీపీ వచ్చాక ఈ ఐదేళ్లలో ఎక్కడా తట్ట మట్టి వేసిన పాపానపోలేదన్నారు. దోచుకోవడం తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రైతులకు శాశ్వతంగా సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు అల్తూరుపాడు రిజర్వాయరును తీసువస్తే దాన్ని అడ్డుకుందన్నారు. వైసీపీ మునిగిపోయే పడవ అని పొరబాటున కూడా అందులో ప్రయాణించవద్దన్నారు.

పిచ్చి మద్యంతో ప్రాణాలతో చెలగాటం

పిచ్చి మద్యం అమ్మి పేదల ప్రాణాలతో జగన్ చెలగాటమాడుతున్నారని రామకృష్ణ అన్నారు. బిడ్డల భవిష్యత్తు బాగుండాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. జగన్ పరిపాలనలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి పని జరగకపోగా 20ఏళ్ల వెనుకబడిపోయామన్నారు. అభివృద్ధిని గాలికొదిలి ఇసుక, మద్యం, మైనింగ్ పేరిట దోచుకున్నారని ఆరోపించారు. డీడీపీ అధికారంలోని రాగానే రూ.4వేలు పింఛను ఇంటికే వచ్చి ఇస్తామని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు. కుల్లూరులో 20 కుటుంబాల వారు కురుగొండ్ల రామకృష్ణ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు నాయుడు, కూటమి నాయకులు ఎస్ఎస్ఆర్ నాయుడు, అల్లంపాటి వేణు గోపాల్ రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, చల్లా బుజ్జిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, బొట్టా వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లునాయుడు, రవి, రాజేష్ రెడ్డి, కాలేషా, సోమిరెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకయ్య, చల్లా రఘురామిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి గడ్డం, కిషోర్‌రెడ్డి, వేపమాను యువరాజ్, నాగభూషణం, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరిన పంజాం వైసీపీ నాయకులు

నాటి గాంధీజీ కలలు నేడు చంద్రబాబుతోనే సాధ్యం



కేశవరంలో ప్రచారం నిర్వహిస్తున్న పాశిం సునీల్‌కుమార్ - సిద్ధమ్మకండ్రిగలో స్థానికుల ముఖాముఖిలో పాశిం

కోట, మే 3: నాడు మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యం తిరిగి చంద్రబాబు సీఎం అయితేనే నెరవేరుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్ కుమార్ అన్నారు. మండలంలోని కేశవరం, రాఘవాపురం, సిద్ధమ్మకండ్రిగ, చిటేడు, రుద్రవరంలల్లో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడుతూ... ఉత్తుత్తి కార్పొరేషన్లును ఏర్పాటు చేసి ఆయా సామాజిక వర్గాల కడుపుకొట్టిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. గూడూరు నియోజకవర్గంలో ప్రతి పల్లెను అభివృద్ధి చేసిన తనను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. కొంతమంది విజిటింగ్ ప్రొఫెసర్‌లా వచ్చి అభివృద్ధి చేస్తామంటున్నారని వారి మాటలు నమ్మి ఓటేస్తే అంతే సంగతన్నారు. సిద్ధమ్మకండ్రిగలో స్థానికులతో ముఖాముఖి నిర్వహించారు. ఎం.సర్వోత్తమరెడ్డి, జలీల్‌అహ్మద్, చిల్లకూరు దశరథరామిరెడ్డి, వి.కోటేశ్వర ప్రసాద్, చాపల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, టి.సురేష్‌బాబు, మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, కృష్ణయ్య, సుమంత్‌తేజానాయుడు తదితరులు పాల్గొన్నారు. కొక్కుపాడులో జరిగిన పాశిం ప్రచారంలో టీడీపీ నాయకులు జితేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వసంత్ రెడ్డి, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించుకుందాం

గూడూరు, మే 3: కష్టాలు తొలిగిపోవాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలని పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం అడవయ్యకాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ అన్ని వర్గాల ప్రజలను నట్టేట ముంచిందన్నారు. మద్యపాన నిషేధం అమలు చేశాకే ఓట్లు అడిగేందుకు వస్తానని హామీ ఇచ్చిన సీఎం జగన్... నాసిరకం మద్యం విక్రయించి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి మేనిఫెస్టోను ప్రకటించిందన్నారు. రాబోయే ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పి.నాగరాజు, నరసరాజు, భారతి, బాబురావు, రవి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



గూడూరులో ప్రచారం నిర్వహిస్తున్న సంధ్యారాణి